Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 60 • సంచిక: 235 • బుధవారం 30 ఆగస్టు 2017 • విజయవాడ ❋ పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ నవమి తె. 4.20 వరకు, అనంతరం దశమి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 2.15 వరకు, అనంతరం మూల;
అమృతకాలం: సా. 4.30 నుండి 6.15 వరకు; వర్జ్యం: ఉ. శే. 7.40 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.42 నుండి 12.33 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు



కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు ప్రశాంతం

ఓటర్లు బారులు బారులు

64.78% పోలింగ్

- తొలిసారిగా వెబ్ కాస్టింగ్ వినియోగం
- శుక్రవారం ఓట్ల లెక్కింపు... ఫలితాల ప్రకటన
- కనిపించని నోటా మీట

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి : కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. ఆ సమయానికి చిరు జల్లులు పడుతున్నాయి. అయినా లెక్కచేయ కుండా ఓటర్లు బారులు దీరారు. మధ్యాహ్నం వరకు పోలింగ్ సరళి వేగంగానే సాగింది. కాగా 7వ పేజీలో...

నంద్యాల స్ఫూర్తితో సాగుదాం!



2019 లోనూ మనదే విజయం

- ఈ ఫలితం కాకినాడకు కలిసొచ్చింది
- కార్పొరేషన్ మేయర్ పీఠం మనదే
- రెండు ఎన్నికల్లోనూ మంచి సమన్వయంతో పనిచేశాం
- నాలుగైదు తేదీల్లో విజయవాడలో వర్క్‌షాప్
- ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ... భవిష్యత్ కార్యాచరణపై చర్చ
- అంతర్గత సర్వే ఫలితాలను మంత్రులకు వివరించిన సీఎం

హైదరాబాద్/అమరావతి, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నిక ఫలితం కాకినాడ నగర పాలకసంస్థపోలింగ్‌లో స్పష్టంగా కనిపించిందని తటస్థ ఓటర్లతో పాటు యువతీ, యువకులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ పక్షాన నిలబడ్డారని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సమన్వయంతో నంద్యాల ఉప ఎన్నికలో సాధించిన విజయం, ఇదే స్ఫూర్తితో 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లోనూ ముందుకు సాగాలని ప్రతిపాదించారు. నంద్యాల, కాకినాడ ఎన్నికలలో ప్రచార సరళి, ఓటర్లను ఎలా కలుసుకున్నది.. ఇతర అంశాలను చర్చించేందుకు సెప్టెంబర్ 4,5 తేదీల్లో విజయవాడలో సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ఇతర ముఖ్య నేతలను ఈ సమావేశానికి ఆహ్వానించి నంద్యాల, కాకినాడ ఫలితాలపై అధ్యయనం చేయడంతో పాటు పార్టీ యంత్రాంగానికి దిశా నిర్దేశన చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. కాకినాడ నగరపాలకసంస్థ ఎన్నికల్లోనూ విజయకేతనం ఎగురవేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన ఈ ఎన్నికల్లో తెదేపా 30 నుంచి 35 వార్డులు, బీజేపీ 3 నుంచి 7వ పేజీలో...



ముంబై మహా నగరంలో నడిరోడ్డుపై వానలో... వరదలో... జనం ఇలా...!

మునిగిన ముంబై

• ముంచెత్తిన వర్షాలు • చెరువులను తలపిస్తున్న రహదారులు • లోతట్టు ప్రాంతాలు జలమయం • ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు బంద్ • మహారాష్ట్ర సీఎంకు ప్రధాని ఫోన్ • అన్నివిధాలా ఆదుకుంటామని హామీ • సీఎం ఫడ్నవీస్ ఉన్నతస్థాయి సమావేశం • విపత్తు నిర్వహణ అధికారులతో చర్చలు • మానిటరింగ్ సెల్ నుంచి పరిస్థితి పర్యవేక్షణ

7 లో


వ్యవసాయ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి



కాదంటే... ఉద్యమిస్తా

• జన సేనాని ప్రకటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిశీలించేందుకు స్పందించాలని, ఈ సమస్యకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించని పక్షంలో జనసేన తన వంతు పాత్ర పోషించేందుకు వెనుకాడదని ఆయన హెచ్చరించారు. గత 20 రోజుల నుంచి సమ్మె చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని 11 వ్యవసాయ కళాశాలలకు చెందిన మూడు వేల మంది విద్యార్థుల తరపున ప్రతినిధులు మంగళవారం పవన్‌కళ్యాణ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. వారి సమస్యలు ఆయన విన్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకునేలా తాను ప్రయత్నిస్తానని, సానుకూలత రాకుంటే విద్యార్థుల తరపున పోరాడతానని స్పష్టంచేశారు. ఈ అంశం మీద 'ఆంధ్రప్రభ'లో ప్రచురితమైన కథనాలను విద్యార్థులు పవన్‌కు చూపించారు. ఆయన ఆ కథనాలను చదివి సానుకూలంగా స్పందించారు. వ్యవసాయ అధికారుల నియామకాలలో గతంలో వున్న జీవో16ని కొనసాగించాలని, ఇటీవల విడుదల చేసిన 64జీవోని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల డిమాండ్ సహేతుకంగానే ఉందని, వాటిని ప్రభుత్వం పరిశీలించి, పరిష్కరించేందుకు ఎందుకు విముఖత చూపుతోందని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో విడుదలైన 16జీవో తెలంగాణలో ఇప్పటికీ అమలులో ఉందన్న విషయం విద్యార్థులు తన దృష్టికి తెచ్చారని పవన్‌కళ్యాణ్ గుర్తు చేశారు. ఈ సమ్మె కేవలం 7వ పేజీలో...



రేపే పీఎస్ఎల్వీ- సీ 39

ప్రయోగం

• సర్వం సిద్ధం
• ముహూర్తం సా.6.59

7 లో

పెద్దల సభలో ఎన్డీయే సెంచరీ

• శక్తి నిచ్చిన కొత్తమిత్రుల చేరిక • కాషాయ కూటమిలోకి అన్నాడీఎంకే, జేడీయూ • హాఫ్ మార్క్‌కు 21 మంది సభ్యుల దూరంలో ఎన్డీయే • మరో ఏడాదిలోగా ఎగువ సభకు 10 మంది బీజేపీ సభ్యులు • కాంగ్రెస్ పార్టీ సంఖ్యాబలం 57

5 లో



చెప్పింది చేస్తున్నాం..

- అభివృద్ధి కార్యక్రమాల వేగం పెంచాం
- వ్యవస్థల్ని బాగు చేస్తున్నాం • యూపీఏ మాదిరిగా చేతులు ముడుచుకు కూర్చోలేదు
- 11 ఏళ్లుగా ముడిపడని ప్రాజెక్టుల్ని పూర్తిచేశాం: ప్రధాని మోడీ • 11 జాతీయ రహదారులు జాతికి అంకితం • 6 జాతీయ రహదారుల పనులు ప్రారంభం

ఉదయ్‌పూర్ (రాజస్థాన్): తమ ప్రభుత్వం ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటుందని, పట్టుదలతో అమలు చేస్తుందని ప్రధాన మంత్రి మోడీ చెప్పారు. మంగళవారం ఆయన రాజస్థాన్‌లోని ఖేల్గావ్‌లో భారీ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. ఇక్కడ పలు రహదారులను ప్రారంభించడానికి, మరి కొన్నింటికి శంకు స్థాపన చేయడానికి మోడీ వచ్చారు. ఈ రహదారుల నిర్మాణానికి మొత్తం రూ. 15,000 కోట్లు ఖర్చవుతుంది. ఎన్డీయే ప్రభుత్వం గద్దెనెక్కే సమయానికి మొత్తం వ్యవస్థ నాశనమై ఉందని, తాము ఒక్కోదాన్ని బాగు చేసుకుంటూ వస్తున్నామని ప్రధాని చెప్పారు. ఇంకెవరైనా అయితే.. భయపడేవారని, తాము మాత్రం ప్రత్యేకమైన పదార్థంతో చేయబడినందున తట్టుకుని పని చేస్తున్నామని చెప్పారు. సవాళ్లను 7వ పేజీలో...



రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నేషనల్ హైవే ప్రాజెక్టులను రిమోట్ కంట్రోల్‌తో ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ, పక్కనే సీఎం వసుంధర రాజే

సెప్టెంబర్ 17 నుంచి దసరా సెలవులు

అమరావతి, ఆంధ్రప్రభ : పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ దసరా సెలవులు ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 13 రోజులు ఈ సారి సెలవులు రానున్నాయి. అక్టోబర్ 2న గాంధీ జయంతి రావడంతో పాటు సెప్టెంబర్ 17న ఆది వారం వచ్చింది. ఈ క్రమంలో సెప్టెంబర్ 16 వరకూ పాఠశాలలకు పని దినాలుగా నిర్ణయించారు. ఆ రోజు నుంచి దసరా సెలవులు ప్రకటించారు. ఈ విషయాన్ని ముందే క్యాలెండర్‌ను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది.

నంద్యాల ఫలితంతో దిగొచ్చిన జగన్

•మంత్రి కాల్వ శ్రీనివాసులు •ఉప ఎన్నిక ద్వారా మా నాన్నను బ్రతికించుకున్నా: మంత్రి అఖిలప్రియ

అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల విజయం చంద్రబాబు మూడేళ్ల సుపరిపాలనకు అక్కడి ప్రజలు ఇచ్చిన కానుకని సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉప ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రతిపక్షనేత జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో నంద్యాల విజయంపై సమావేశం ముగిసిన అనంతరం మంత్రి కాల్వ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ ఏ నేతా మాట్లాడని విధంగా జగన్ రాక్షస వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. మూడేళ్ల తరువాత ప్రతిపక్షం, అధికార పక్షం ముఖాముఖి తలపడిన ఈ ఎన్నికను తాము సాదాసీదాగా తీసుకున్నా, వైకాపా అధినేత జగన్ మాత్రం పులివెందల నుంచి 150 మంది తన అనుచరులను దింపి భయోత్పాతం సృష్టించాలని చూశారని ఆరోపించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రిని నడిరోడ్డులో ఉరి తీయాలంటూ వ్యాఖ్యలు చేసి ఎన్నికల కమిషన్‌కు ఆవేదనతో మాట్లాడినట్లు వివరణ ఇచ్చారన్నారు. ఆ తరువాత కూడా తన ధోరణి మార్చుకోకుండా మరుసటి రోజే తీవ్ర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. జగన్‌కు, ఆ పార్టీ నేతలు మానసిక వ్యాధితో బాధపడుతున్నారని, శిల్పా మోహనరెడ్డి, రోజా వివిధ సామాజిక వర్గాలపై చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని మంత్రి కాల్వ తెలిపారు. నంద్యాలను మరో పులివెందుల లాగా చేస్తానని జగన్ ప్రకటించారని, అయితే సీఎం చంద్రబాబు పులివెందులను కూడా నంద్యాల లాగా మారుస్తామని చెప్పారన్నారు. భూమా నాగిరెడ్డి చివరి కోరికను ముఖ్యమంత్రి సాఫల్యం చేశారన్నారు.

నంద్యాల ఉప ఎన్నికలో విజయం సాధించటం ద్వారా తిరిగి మా నాన్నను బ్రతికించుకున్నానని మంత్రి అఖిలప్రియ ఉద్వేగపూరితంగా మాట్లాడారు. పార్టీలో ఒక వ్యక్తి చనిపోతే అధిష్టానం ఎలా కష్టపడుతుందో, ఎంత అండగా ఉంటుందో అనటానికి తెలుగుదేశం పార్టీ ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. తాను టీడీపీలో పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నానని మంత్రి అఖిలప్రియ అన్నారు. నంద్యాల ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, రానున్న సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నియోజకవర్గంలోని ప్రజల వద్దకు వెళ్లనున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారికి ప్రభుత్వం నిర్దేశించిన పరిహారం కన్నా 2.3శాతం అధికంగా చెల్లించినట్లు తెలిపారు. త్వరలో అమృత్ పథకం కింద నంద్యాల పట్టణంలోని ప్రతి ఇంటికి కుళాయిలు అమరుస్తామని మంత్రి చెప్పారు. నంద్యాల గెలుపును తాము ముందుగానే ఊహించామని, అయితే ఇంత మంచి మెజారిటీ రావటం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో శిల్పా బ్రదర్స్ మాట్లాడుతూ ఈ పోరులో పరాజయం పాలైతే మంత్రిపదవికి రాజీనామా చేయాలని సవాలు విసిరారని, తాము ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తామని సవాలు చేశారన్నారు. ఈ సవాల్‌ను తాను కూడా స్వీకరించానని, ఇప్పుడు శిల్పా బ్రదర్స్ నైతికంగా ఈ సవాల్‌ను నిలబెట్టుకోవాలని మంత్రి అఖిలప్రియ డిమాండ్ చేశారు. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన నంద్యాల ప్రజలకు మంత్రి అఖిలప్రియ కృతజ్ఞతలు తెలిపారు.

బాబాయి బాటలో పయనిస్తా: ఎమ్మెల్యే భూమా

13 ఏళ్లపాటు అభివృద్ధి నోచుకోని నంద్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తన బాబాయి స్వర్గీయ భూమా నాగిరెడ్డి చూపిన బాటలో పయనిస్తానని నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. గడిచిన 30 ఏళ్లుగా నంద్యాలకు భూమా నాగిరెడ్డి విశిష్టమైన సేవలు అందించారన్నారు. రోడ్ల విస్తరణ, గృహనిర్మాణంపై ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చుకుని సమాజం సహకారంతో నెరవేర్చి నంద్యాల ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఈ ఉప ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన నంద్యాల ప్రజలకు, మంత్రులకు, పార్టీనేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



విలేకరులతో మంత్రి అఖిలప్రియ, ఎమ్మెల్యే భూమా తదితరులు

మంత్రి కాల్వకు సీఎం అభినందన



నంద్యాల ఉప ఎన్నికల్లో విజయానికి కీలకపాత్ర పోషించిన సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. మంగళవారం మంత్రి కాల్వ శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఉప ఎన్నికల్లో నేతలను, కార్యకర్తల మధ్య సమన్వయం ఏర్పర్చి భూమా బ్రహ్మానందరెడ్డి విజయానికి కృషి చేశారని సీఎం మంత్రి కాల్వ శ్రీనివాసులను ప్రశంసించారు.

భూమా కుటుంబానికి అరుదైన రికార్డు

•5న ఎమ్మెల్యేగా బ్రహ్మానందరెడ్డి ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజా స్వామ్య వ్యవస్థలో ఏదైనా సాధ్యమే. అందులోనూ రాయల సీమ వంటి వర్గాధిపత్యాలు ఉన్న నియోజకవర్గాల్లో ఒకకుటుంబం నుంచి అత్యధికులు చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించడం అరుదైన రికార్డే. కర్నూలు జిల్లాలో బలమైన రాజకీయ కుటుంబంగా ఉన్న భూమా కుటుంబానికి ఈ అరుదైన గౌరవం లభించింది. ఒక కుటుంబం నుంచి 5 మంది రాష్ట్ర శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. 1989లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా భూమా వీరశేఖరరెడ్డి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1991లో ఆయన గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఈ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో భూమా వీరశేఖర్ రెడ్డి సోదరుడు భూమా వెంకట నాగిరెడ్డి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తరువాత నాగిరెడ్డి 1996లో నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఎంపీగా ఎన్నికయ్యారు. ఆళ్లగడ్డ నుంచి ఎమ్మెల్యేగా ఉన్న తన స్థానానికి రాజీనామా చేశారు. దీంతో 1997లో జరిగిన ఆళ్లగడ్డ ఉప ఎన్నికల్లో నాగిరెడ్డి సతీమణి భూమా శోభానాగిరెడ్డి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఆ ఉపఎన్నికల్లో విజయం సాధించారు. 2014లో ఎన్నికల సందర్భంలో శోభ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆళ్లగడ్డ స్థానానికి మళ్లీ ఉప ఎన్నికలు జరగ్గా ఈ సారి భూమా కుటుంబం నుంచి నాగిరెడ్డి పెద్ద కుమార్తె అఖిలప్రియ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో పర్యాటక శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నంద్యాల నుంచి గెలుపొందిన భూమా నాగిరెడ్డి ఆకస్మిక మృతితో తాజాగా నంద్యాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో భూమా కుటుంబం నుంచి మాజీ ఎమ్మెల్యే వీరశేఖరరెడ్డి తనయుడు భూమా బ్రహ్మానందరెడ్డి టీడీపీ అభ్యర్థిగా ఘనవిజయం సాధించారు. దీంతో భూమా కుటుంబం నుంచి శాసనసభకు ఎన్నికయిన వారిలో 5వ వారిగా నిలిచి రాజకీయ రంగంలో అరుదైన గౌరవాన్ని భూమా కుటుంబానికి అందించారు. అంతే కాకుండా తన చిన్నాన్న స్థానాన్ని నంద్యాలలో భర్తీ చేసి ఈ నియోజకవర్గానికి 12 వ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం పొంది మరో రికార్డును సొంతం చేసుకున్నారు.

సీఎం ఆదేశంతో కదిలిన యంత్రాంగం

•నంద్యాల అభివృద్ధి పనులు ఇక వేగవంతం •మంత్రులు సోమిరెడ్డి, కాల్వలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగింత

అమరావతి, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా ఇచ్చినహామీలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం నుంచి వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏయే సందర్భంలో ఎలాంటి హామీలను ముఖ్యమంత్రి ఇచ్చారనే దిశగా జాబితాను సిద్ధం చేస్తున్నారు. పనులు ముమ్మరంగా కొనసాగించాల్సిన బాధ్యతను ఎన్నికల ఇన్‌ఛార్జిలుగా వ్యవహరించిన మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాల్వ శ్రీనివాసులుకు అప్పగించారు. నంద్యాలను కుప్పం నియోజకవర్గాన్ని మించి అభివృద్ధి పరుస్తానని, ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్న సీఎం స్వర్గీయ భూమా నాగిరెడ్డి ఇచ్చిన హామీలపై ఆసెంబ్లీ సాక్షిగా పేర్కొన్న వాగ్దానాలను అమలు చేయడం జరుగుతుందని ప్రకటించారు. సీఎం కార్యాచరణకు అనుగుణంగానే మంత్రి చంద్రమోహన్ రెడ్డి అధికారులు, నంద్యాల నేతలను సమన్వయం చేసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.1400 కోట్లకు పైగా విలువైన పనులు, పథకాలకు రికార్డుస్థాయిలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగింది. సి.ఎం తో పాటు మంత్రులు కూడా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కీలకమైన ప్రకటనలు చేశారు. ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా వున్న కుందూనది పూడికతీత కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.9.53 కోట్లు కేటాయించారు. ఫలితంగా అక్కడ ముంపు బాధితులకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అలాగే ఫలితంగా భూమిని కేటాయించిన ప్రభుత్వం 13000 ఇళ్ళను ప్రతిష్టాత్మకంగా నిర్మించడం జరుగుతోంది. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద 483 ఇళ్ళు, గ్రామీణ గృహనిర్మాణ పథకం కింద 326 ఇళ్ళను నిర్మిస్తున్నారు. ఇవే కాకుండా మరో 13 వేల ఇళ్ళను సైతం నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. కేవలం ఇళ్ళ కోసమే దాదాపు రూ. 950 కోట్లను కేటాయించారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 31.90 కోట్ల రూపాయలతో ఫైబర్ గ్రిడ్‌కు వెచ్చిస్తోంది. రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి 30 కోట్లు, తాగునీరు కోసం 137.34 కోట్లు వెచ్చించడం జరుగుతోంది. మున్సిపల్ పరిధిలో ఎస్సీ కాలనీలో నీరిచ్చేందుకు 5.30 కోట్లు, మైనారిటీ బాలికల ఆశ్రమ పాఠశాలల నిమిత్తం 33 కోట్లు, పార్కుల అభివృద్ధికి 1.5 కోట్లు, పాఠశాలల అభివృద్ధికి5.50 కోట్లు, డిజిటల్ క్లాస్‌రూముల కోసం రూ.2 కోట్లు వెచ్చించనున్నారు. అదే విధంగా చామ కాల్వలో వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు 90 కోట్లు, బలిజ కమ్యూనిటి భవన నిర్మాణానికి 3 కోట్లు వెచ్చిస్తున్నారు. పసుపు కుంకుమ పథకం కింద మహిళలకు రూ.50 కోట్లు ఇవ్వాలని సంకల్పించారు. నంద్యాలలో ప్రజా రవాణాను మెరుగుపరిచేందుకు స్టేట్ హైవే పనులకు ప్యాకేజీ 1 లో భాగంగా ఇప్పటికే 68.50 కోట్లు కేటాయించారు. ప్యాకేజీ 2 లో 35.30 కోట్లు కేటాయించారు. ప్రజల సౌకర్యార్థం కొత్తగా 31 బి.టి. రోడ్లకు 43.40 కోట్లు, జిల్లా రహదారులను మెరుగుపరిచేందుకు 30.94 కోట్లు, మల్టి విలేజ్ స్కీం కింద నంద్యాల, గోస్పాడు ప్రాంతాలకు రూ.78.27 కోట్లను కేటాయించారు. 38 కిలోమీటర్ల మేర 77 సిమెంట్ రోడ్లకు 14.70 కోట్లు, 35 గ్రామాలకు ఎల్ఇడి బల్బుల నిమిత్తం నిధులు కేటాయించారు. ఇప్పటికే మంజూరైన పనులే కాకుండా, మరోవైపు ప్రచారంలో భాగంగా తమ దృష్టికి వ చ్చిన సమస్యలను మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రికి లిఖితపూర్వకంగా ఇచ్చారు. మాట తప్పకుండా అన్ని పనులుచేయాలని నిర్దేశించిన ముఖ్యమంత్రి ఈ ప్రాంతాన్ని అన్ని రంగాలలోనూ బహుముఖ రీతిన అభివృద్ధి చేయడానికి సంసిద్ధంగా వున్నామని, నిధులతో నిమిత్తం లేకుండా ముందుకు సాగాలంటూ నేతలకు దిశానిర్దేశం చేశారు. 2019 ఎన్నికలకు స్ఫూర్తిదాయకంగా నంద్యాల ప్రజలు నిలిచారని, వారి రుణాన్ని నంద్యాలనఅభివృద్ధి చేయడం ద్వారా తీర్చుకోవాలనిసి.ఎం మంత్రులతో అన్నారని సమాచారం.

15 మంది వైకాపా ఎమ్మెల్యేలు టీడీపీలోకి వస్తామంటున్నారు

•సీఎంపై కొడాలి నాని వ్యాఖ్యలను ఖండిస్తున్నాం: ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి



మీడియాతో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్

అమరావతి, ఆంధ్రప్రభ : ఏపీ ముఖ్యంత్రి అభివృద్ధిని చూసి నంద్యాల ఉప ఎన్నికల అనంతరం 15మంది వైసీపీ ఎమ్మెల్యేలు టిడిపిలోకి వస్తామంటున్నారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం చంద్రబాబుపై వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నాని చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను ఖండించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠంగా ప్రజలు తీర్పునిచ్చారని, ప్రజా తీర్పును ప్రజాస్వామ్య వ్యవస్థలో గౌరవంగా స్వాగతించాలన్నారు. అందుకు భిన్నంగా అభ్యంతరకర భాష మాట్లాడి, మూర్ఖులుగా వ్యవహరించి అప్పుడప్పుడు కనపడి ఎన్నికల తరువాత వైసీపీ ఎమ్మెల్యే రోజా ముఖం చాటేసిందని ఎద్దేవా చేశారు. నంద్యాల్లో వైసీపీకి అభ్యర్థి లేక టిడిపి నాయకుడైన శిల్పామోహన్ రెడ్డిని భయపెట్టి నిలబెట్టారన్నారు.

మాటతప్పం మడమ తిప్పం అన్నవైసీపీ అధినేత జగన్ నంద్యాల ఉప ఎన్నికల్లో ఘోరపరాజయం తర్వాత మమ్మల్ని కొట్టారు, భవిషత్తులో మిమ్మల్ని కొడతా మనటంహాస్యాస్పదమ న్నారు. జూన్ నెలలో 5మంది పార్లమెంట్ సభ్యులతో రాజీనామా చేయిస్తానని చెప్పి ఇప్పుడు మౌనంగా ఉన్నారని, వారిచేత ఇప్పుడు రాజీనామా చేయించగలరా అంటూ సవాలు విసిరారు. ఉప ఎన్నికల్లో అధికారపార్టీయే గెలవటం సహజ మన్న జగన్, ఎమ్మెల్యే చనిపోతే ఏకగ్రీవ సాంప్రదా యం ఉన్నప్పటికీ పోటీ ఎందుక ు పెట్టారని ప్రశ్నించారు. జగన్ వైఖరి వలనే మైనార్టీలు, క్రిస్టియన్లు దూరమైయ్యారని, ఢిల్లీతో పోరాటం చేస్తామన్న జగన్ ఇప్పుడు ఢిల్లీ కాళ్లు మొక్కు తున్నారని విమర్శించారు. 21మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించే ప్రసక్తే లేదని కావాలంటే మీ ఎమ్మెల్యేల చేత రాజీనామ చేయించి ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ఐదు మంది ఎంపీల చేత రాజీనామా చేయిస్తానన్నప్పుడే ముగ్గురు ఎంపీలు మా దగ్గరికి వచ్చారని, ఇప్పుడు 15మంది ఎమ్మెల్యేలు టిడిపీలోకి వస్తే వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా పోతుందన్నారు. మాటిమాటికి సీఎం మీద నోరు పారేసు కుంటే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఆకేపోగు ప్రభాకర్, గుడిసే దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై కేసుల ఉపసంహరణ వ్యాజ్యాల పరిస్థితి చెప్పండి

•ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో తెదేపాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులపై నమోదైన కేసులను ఉపసంహరించేందుకు జారీ చేసిన జీవోలకు సంబంధించిన కేసులు దిగువ కోర్టుల్లో ఏ దశలో ఉన్నాయో చెప్పాలని హైకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. జీవోల వారిగా ఎన్ని కేసులు ఉపసంహరించారు?, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్ లో ఉన్నాయి?, ఆ కేసుల నేరాలకు సంబంధించిన వివరాలతో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని హైకోర్టు ఏపీ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 18 కి వాయిదా వేసింది. ఇంతలోగా కింది కోర్టుల్లో కేసుల ఉపసంహరణ వ్యాజ్యాలు విచారణకు వస్తే వాయిదా తీసుకుంటామని ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఇచ్చిన హామీని ధర్మాసనం రికార్డు చేసింది. తెదేపాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులపై నమోదైన కేసులు ఉపసంహరించేందుకు వీలుగా ప్రభుత్వం వివిధ సందర్భాల్లో జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ ..ఓ మాజీ ఎమ్మెల్యేపై హత్యా, అత్యాచారం కేసు నమోదైందన్నారు. అలాంటి కేసులను కూడా ఉపసంహరించుకునేందుకు వీలుగా జీవో జారీ చేశారన్నారు. కేసుల ఉపసంహరణ కోసం పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశించే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు.

ఈ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ ..మూడేళ్ల కింద జారీ చేసిన జీవోలను సైతం పిటిషనర్ సవాలు చేయడం పట్ల ఏపీ ఏజీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జీవోలన్నింటినీ కలిపి ఒకే పిల్ రూపంలో దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. సుప్రీంకోర్టు సైతం కేసుల ఉపసంహరణ వ్యవహార అంశాన్ని దిగువ కోర్టుల నిర్ణయానికే వదిలేయాలందని తెలిపారు. కేసుల ఉపసంహరణకు సంబంధించి పీపీలను ఆదేశించే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ..పిటిషనర్ రాజకీయంగా వైరి వర్గం కావొచ్చు. వ్యవహారం కోర్టు దృష్టికి వచ్చాక తాము విచారణ జరపొచ్చని తెలిపింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్న. అధికారులకు నోటీసులు జారీ చేసింది. కేసుల స్థితిగతులపై వివరాలు సమర్పించేందుకు తదుపరి విచారణ సెప్టెంబర్ 19కి వాయిదా వేసింది.

అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాల టెండర్‌పై ప్రతివాదులకు నోటీసులు



టెండర్లు పిలవకుండా ఏపీ అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలు చేసే హక్కును అడ్వాన్స్ కమ్యూనికేషన్స్ కు అప్పగించారని పేర్కొంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 12 కు వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో అసెంబ్లీ కార్యదర్శి, అడ్వాన్స్ కమ్యూనికేషన్స్, తదితర ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి దాఖలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆరు గంటలు ప్రసారం చేస్తే రూ.75 వేలు చెల్లించే విధంగా ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. టెండర్ పిలవకుండానే ఈ పనులను అప్పగించారన్నారు. న్యాయవాది తెలిపిన వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

ప్రజలను విభజించేందుకు జగన్ కుట్ర

•తగు రీతిలో బుద్ధి చెప్పారు: బూరగడ్డ వేదవ్యాస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నికలలో కులాలు, మతాల వారీగా ప్రజలను విభజించి లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి అక్కడి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పారని ఏపీ శాసనసభ మాజీ ఉప సభాపతి బూరుగడ్డ వేదవ్యాస్ అన్నారు. అవినీతి సొమ్ముతో ఓట్లు కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసేందుకు జగన్ చేసిన ప్రయత్నాలను ప్రజలు తెలివిగా తిప్పికొట్టారని ఆయన పేర్కొన్నారు. సాంప్రదాయాలకు విరుద్ధంగా ఈ ఉప ఎన్నికలలో పోటీకి దిగిన వైకాపా అరాచక, అతివాద, రాజకీయ ధోరణులకు తెలుగుదేశం గెలుపును జీర్ణించుకునేందుకు మరో రెండేళ్లైనా ఆయనకు సరిపోదని వేదవ్యాస్ ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో 2019లో జరగనున్న ఎన్నికలకు నంద్యాల ఎన్నిక దిక్సూచిగా పనిచేస్తుందని, ఇది అప్పటి ఫలితాలకు ఇప్పుడే మార్గం సుగమం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఉప ఎన్నికను కురుక్షేత్రంగా అభివర్ణించి.. నవరత్నాల హామీలతో ప్రజాక్షేత్రంలో పరుగులెత్తిన ఉత్తర కుమారుడు విజ్ఞులైన నంద్యాల ఓటర్ల నుంచి తీవ్ర పరాభవం రుచిచూడాల్సి వచ్చిందని వేదవ్యాస్ వ్యంగంగా అన్నారు. స్వతంత్రంగా వైకాపా నుంచి అభ్యర్థిని పోటీకి దించలేక ప్రలోభాలతో తెదేపా నాయకుడ్ని లొంగదీసుకుని పోటీలో పెట్టారని ఆరోపించారు.

అప్రజాస్వామిక పదజాలంతో వ్యక్తిగత విమర్శలు, అరువుదెచ్చుకున్న బీహార్ తెలివితేటలతో మహిళలను కుసంస్కారమైన భాషతో అవమానించి వైకాపా నేతలు దిగజారి వ్యవహరించారని ఆయన దుయ్యబట్టారు. నంద్యాల ప్రజలు అవకాశవాద రాజకీయానికి వ్యతిరేకంగా సంపూర్ణమైన, స్పష్టమైన సమాధానమిచ్చారని, ప్రజాస్వామ్యంలో ఈ తీర్పు అభినందనీయమని వేదవ్యాస్ పేర్కొన్నారు.

దగ్ధమైన ఆర్టీసీ బస్సు

•ప్రయాణికులను అప్రమత్తం చేసిన డ్రైవర్, కండక్టర్ •తప్పిన పెను ప్రమాదం •70 మంది సురక్షితం •ప్రమాద కారణాలపై దర్యాప్తు చేస్తామన్న అధికారులు




అమరావతి, ఆంధ్రప్రభ : ఏపిఎస్ఆర్టీసీ సిటీ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా బస్సు దగ్ధమైన సంఘటన విజయవాడలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బస్సు డ్రైవర్, కండక్టర్‌లు అప్రమత్తంగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. దాదాపు 70 మందితో వెళుతున్న ఏపి9జెడ్6409 నెంబరు గల 54వ నెంబర్ బస్సు ఆటోనగర్, రైల్వేస్టేషన్‌ల మధ్య తిరుగుతుంది. ఈ క్రమంలో మంగళవారం యథావిధిగా డ్యూటీకి వచ్చిన డ్రైవర్ ఆటోనగర్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే క్రమంలో ప్రభుత్వ ఆసు పత్రికి సమీపంలోని జాతీయ రహదారిపైకి రాగానే బస్సునుంచి శబ్దం వచ్చింది. దీనిని గమనించిన కండక్టర్ డ్రైవర్‌ను అప్రమత్తం చేసింది. ఇద్దరు అప్రమత్తం అయి బస్సులోని ప్రయాణీకులను వెంటనే దింపి వేశారు. ఈలోపు బస్సు ఎడమభాగం నుంచి మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమయ్యింది.

ప్రయాణీకులు ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపే బస్సు పూర్తిగా కాలిపోయిందని ప్రయాణీకులు తెలిపారు. ఈ ప్రమాద అంశంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. బస్సు పూర్తిగా సిఎన్‌జీతో నడుస్తుంది. ప్రయాణీకులను అప్రమత్తం చేసిన బస్సు కండక్టర్, డ్రైవర్లను వారు అభినందించారు.

ఫరూఖ్‌కు కౌన్సిల్ ఛైర్మన్ పదవి

•ముఖ్యమంత్రి సంకేతాలు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ పదవి నంద్యాలకు చెందిన మాజీ మంత్రి ఎన్.ఎం.డి ఫరూఖ్‌ను వరించనుంది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. నంద్యాల ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీగా ఎన్నికైనప్పుడే విజయం సాధిస్తే కౌన్సిల్ ఛైర్మన్ పదవిని ఇస్తానంటూ సీఎం ఫరూఖ్‌కు ఆఫర్ ఇచ్చారు. నంద్యాలలో మైనారిటీలతోవిడిగా జరిగిన భేటీలోనూ మైనారిటీలు త్వరలో శుభవార్త వింటారంటూ బహిరంగంగా చెప్పడం జరిగింది. అదే సమయంలో టిడిపి అభ్యర్థిని గెలిపించాలంటూ కోరారు. సీ.ఎం ఆశించినట్టుగానే నంద్యాలలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయకేతనం ఎగురవేశారు. మంగళవారం ఫరూఖ్ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వుంటామని, కౌన్సిల్ ఛైర్మన్ విషయంలో మైనారిటీనే నియమిస్తామని నేరుగా ఎన్.ఎం.డి. ఫరూఖ్‌కు భరోసా ఇవ్వడం విశేషం. కాగా రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లిం మైనారిటీలకు మంత్రి పదవి కూడా లేదు. అయితే కనీసం కౌన్సిల్ పదవి ఇచ్చి అయినా వారికి తగిన గుర్తింపుఇవ్వాలనే యోచనకు వచ్చారు. చివరకు నంద్యాలకు చెందిన నేతనే వరించబోతోంది. వైకాపాలోకి వెళ్ళడంతో చక్రపాణిరెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేశారు. మంత్రులు సోమిరెడ్డి, కాల్వశ్రీనివాసులు నుంచి కూడా ఫరూఖ్‌కు ఇదే రకమైనహామీ లభించింది. నంద్యాల గెలుపులో మైనారిటీలు కీలకంగా మారారని సీఎం ఈ సందర్భంగా పేర్కొనడం విశేషం.గత మే నెలలో చక్రపాణి పదవీ కాలం ముగియడంతో ఛైర్మన్ పదవి ఖాళీ అయింది. డిప్యూటీ ఛైర్మన్‌గా వున్నరెడ్డి సుబ్రహ్మణ్యం ఇన్‌చార్జి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

•అన్ని విభాగాలు సిద్ధం •11 ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్‌లు •పార్కింగ్ ప్రాంతాల వద్ద అన్న ప్రసాదాలు: టీటీడీ తిరుమల జేఈవో




సమావేశంలో అధికారులతో సమీక్షలో టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు

తిరుమల కెఎన్ఎన్: తిరుమలలోని అన్నమయ్య భవనంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుమల జేఈవో శ్రీనివాస రాజు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 23 నుంచి ప్రారంభమయ్యే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ లోమ్ అన్ని విభాగాలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఇంజనీరింగ్ పనులు దాదాపు పూర్తి కావస్తున్నట్లు వివరించారు. సప్తగిరి సత్రాల నుంచి ఆస్థాన మండపం వరకు నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు సెప్టెంబర్ 20 వ తేదికి పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మాడవీధులతో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాలలో 11 ఎల్ఈడి స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఐదు ఎల్ఈడి స్క్రీన్‌లు అదనంగా ఏర్పాటు చేయనున్నామన్నారు.

సెప్టెంబర్ 27 న శ్రీవారి గరుడ సేవకు విశేషంగా విచ్చేసే భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని భారతీయ విద్యాభవన్ పాఠశాల మైదానం, దేవలోక్ ప్రాంగణంలో 2,500 నాలుగు చక్రాల వాహనాలు నిలిపి ఉంచేలా పార్కింగ్ ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. తిరుపతిలో జేఈవో పోలా భాస్కర్ ఆధ్వర్యంలో వాహనాల పార్కింగ్ ప్రదేశాల వద్ద అన్నప్రసాదాలు, త్రాగునీరు, మరుగుదొడ్లు, సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్ఓ రవికృష్ణ, అదనపు ఎఫ్ఎ అండ్ సీఎఓ బాలాజీ, ఎస్ఇ-2 రామచంద్రారెడ్డి, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవో కోదండరామారావు, వేణుగోపాల్, ఆరోగ్యశాఖ అధికారి శర్మిష్ట ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాకు ఏపీ సన్నద్ధం



• ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ సమర్థ వినియోగ చర్యల అమలుకు నిర్ణయం • విద్యుత్ ఆదా ఛాంపియన్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు • ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ • ప్రతి సంవత్సరం 8.23 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా అంచనాలు • దీంతో విద్యుత్ బిల్లులు తగ్గి రూ. 38 లక్షల మిగులు

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వశాఖలన్నింటిలోనూ విద్యుత్ సమర్థ వినియోగ పద్ధుతులను అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందుకు సమగ్ర విధానాన్ని కూడా రూపొందించింది. ఈ మేరకు అన్ని శాఖల్లోనూ విద్యుత్ ఆదా చేసే పరికరాలను అమర్చి బిల్లులను తగ్గించే ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన ఆదా మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఆరో కార్యవర్గ సమావేశం, నాలుగో జనరల్ బాడీ సమావేశాల్లో ఏపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ సదరు వివరాలు వెల్లడించారు. ఇంధన, వ్యవసాయ, పరిశ్రమలు, పంచాయత్ రాజ్, వైద్య ఆరోగ్య, దేవాదాయ, ధర్మాదాయ, పాఠశాల విద్య శాఖల్లోనూ విద్యుత్ సమర్థ వినియోగ పద్ధతులను అమలు చేయడం ద్వారా ఏటా వాడే విద్యుత్‌లో 25శాతం ఆదా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అన్ని ప్రభుత్వశాఖలకూ ఏటా 52వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరమవుతుందని, సమర్థ విద్యుత్ వినియోగం వల్ల ఆదా అయ్యే విద్యుత్ 13వేల మిలియన్ యూనిట్లు ఉండబోతోందని ఆయన వివరించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సమర్థ వినియోగ చర్యలు అమలును తప్పనిసరి చేశామని దినేష్ కుమార్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల భవనాలను స్టార్ బిల్డింగ్‌లుగా చేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగం సమర్థవంతంగా చేసే భవనాలను స్టార్ బిల్డింగ్‌లుగా ప్రభుత్వం గుర్తిస్తుంది. పాత విద్యుత్ ఉపకరణాలను తీసేసి, విద్యుత్‌ను ఆదా చేసే ఉపకరణాలను బిగించడం ద్వారా ఆయా భవనాలను స్టార్ బిల్డింగ్‌లుగా మారుస్తారు. ఇందుకు 5 స్టార్ రేటింగ్ ఉన్న ఉపకరణాలనే వాడతారు. అలాంటి ఉపకరణాలనే ఆయా శాఖలు ఇకపై కొనుగోలు చేసేలా ప్రభుత్వం నిబంధనలు రూపొందిస్తుందని ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. విద్యుత్ ఆదా చేసే విషయంలో ప్రభుత్వ శాఖలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలనిఇ దినేష్ కుమార్ కోరారు. తమ కార్యాలయాల్లో చేసిన విద్యుత్ ఆదా చర్యలకు ప్రచారం కల్పించి, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆయన ప్రభుత్వోద్యోగులను కోరారు. పరిశ్రమలు, వ్యవసాయం, పాఠశాల విద్య తదితర శాఖలకు విద్యుత్ ఆదాకు తీసుకునే చర్యల విషయమై ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సమర్థ వినియోగ అభివృద్ధి సంస్థసాయంతో ఇంధన ఆడిట్‌ను నిర్వహించాలని తెలిపారు. విద్యుత్ ఆదాకు చేపట్టాల్సిన చర్యలను ఈ ఆడిట్ తెలియజేస్తుందని తెలిపారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాల జాబితాను ఆడిట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఉద్దేశాలను తెలియజేశారు. విద్యుత్ ఆదా భారీగా చేయడానికి ముఖ్యమంత్రి సంకల్పించారన్న ప్రధాన కార్యదర్శి చంద్రబాబు నాయుడిని విద్యుత్ ఆదా చాంపియన్‌గా కొనియాడారు. ఈ సందర్భంగా పలు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ ఆదా కోసం అమలు చేస్తున్న చర్యలను అనుసరించడానికి పలు రాష్ట్రాలు సిద్ధమయ్యాయని తెలపారు. ఇటీవల వైజాగ్ లోఓ నిర్వహించిన విద్యుత్ ఆదాపై జాతీయ స్థాయి సదస్సులో ఆయా రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సమర్థ వినియోగ పద్ధతుల గురించి తెలుసుకుని కొనియాడారని వెల్లడించారు. ఆ కారణంగా ముఖ్యమంత్రి అడుగు జాడల్లో ప్రభుత్వ ఉద్యోగులు నడిచి విద్యుత్త సమర్థ వినియోగ పద్ధుతలతో ఆదా చేయాలని సీఎస్ సూచించారు. ప్రధాన కార్యదర్శి సూచనలకు స్పందించిన ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్, ఇప్పటికే వైజాగ్ లోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్ సమర్థ వినియోగ పద్ధతులను అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యకార్యదర్శి ఇచ్చిన వివరాల పట్ల ప్రధాన కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగ పద్ధతుల కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని దినేష్ కుమార్ తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం 500 ప్రభుత్వ భవనాల్లో రూ. 100కోట్లతో విద్యుత్ ఆదా కోసం సమర్థ వినియోగ పద్ధతులను అమలు చేస్తారన్నారు. వెంటనే సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బిసి సంక్షేమ స్కూళ్లు, హాస్టళ్లుతో పాటు ఇతర శాఖల్లో విద్యుత్ ఆదా చర్యలు చేపడతామని తెలిపారు.

ప్రమోషన్ల ప్రక్రియకు తెర

• అసిస్టెంట్ సెక్రటరీలపై కసరత్తు పూర్తి • రేపటిలోగా ఉత్తర్వులు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర సచివాలయంలోని వివిధ శాఖలలో ఖాళీ అయిన ప్రమోషన్ల భర్తీ ప్రక్రియ ఈ నెల 31 వ తేదీతో పూర్తి కానుంది. ఇందుకు సంబంధించి అధికారులు శాఖాపరమైన ప్రమోషన్ల కమిటీల ద్వారా కసరత్తును పూర్తి చేశారు. వివిధ హోదాలలో పనిచేసి పదవీ విరమణ చేసిన వారి స్థానాలలోనే ఇప్పటిదాకాఅధికారులు ప్రమోషన్ల ద్వారా కొత్తవారిని నియమిస్తున్నారు. 32 ప్రభుత్వ శాఖలలో ఖాళీగా వున్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కేటగరీలో 40 పోస్టులను భర్తీ చేయడం జరిగింది. ఫలితంగా 40 మంది సెక్షన్‌ఆఫీసర్లుగా పదోన్నతి పొందారు. లోయర్‌కేడర్‌లో వున్న ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తేనే తమకు వెసులుబాటు కలుగుతుందని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున వత్తిడి తెచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం చకాచకా ప్రమోషన్లను పూర్తి చేసింది. అయితే చివరగా అసిస్టెంట్ సెక్రెటరీ కేటగరిలో ఏడుగురికి డిప్యుటి సెక్రెటరీలుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. పైస్థాయిలో ప్రమోషన్లకు సంబంధించి కొంత జాప్యం జరిగినప్పటికీ గడువుకుచివరి తేదీ అయిన ఆగస్టు 31 వ తేదీలోగా డి.ఎస్ ల పదోన్నతుల్తై ఉత్తర్వులుఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ పాణిగ్రాహి కసరత్తు చేశారు. ఈ ప్రక్రియను మరింత జాప్యం చేయకుండా ముగించాలంటూ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి రామకృష్ణతదితరులు స్పెషల్ చీఫ్ సెక్రెటరీని కలిసి కోరారు.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో తుళ్ళూరు, అనంతపురంలో కన్సల్టేషన్ వర్క్‌షాపులు

అమరావతి, ఆంధ్రప్రభ : అమరావతి రాజధాని నగరంలో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో చేపట్టనున్న రోడ్లు, వరద నియంత్రణ చర్యల ప్రాజెక్టు అమలు వల్ల ప్రభావితమయ్యే ప్రజల నుండి అభిప్రాయ సేకరణకు, సూచనలు, సలహాలు స్వీకరణకు ఏపీసీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం నాడు తుళ్ళూరు, అనంతవరంలలో కన్సల్టేషన్ వర్క్ షాపులు నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లలో రైతులు, వివిధ వర్గాల ప్రజలు, ప్రపంచ బ్యాంక్‌కు చెందిన నలుగురు ప్రతినిధులు, సీఆర్‌డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ బి.ఎల్. చెన్నకేశ్వరావు, స్ట్రాటజీ డైరెక్టర్ జేఎస్ఆర్‌కే శాస్త్రీ, కాంపిటేటివ్ అథారిటీలు గ్లోరియా, సాధన తదితరులు పాల్గొన్నారు. ఈవర్క్ షాపుల్లో ప్రధానంగా పర్యావరణ, సాంఘీ నిర్వహణ ముసాయిదా, పునరావాస పాలసీ ముసాయిదా, పునరావాస కార్యాచరణ ప్రణాళిక-10 ప్రాధాన్య రోడ్లు, 10 ఉప రహదారులకు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా - పర్యావరణ నిర్వహణ ప్రణాళిక, వరద నియంత్రణ పనులు ప్రభావిత పునరావాస పాలసీల గురించి సవివరంగా తెలయజేశారు. ప్రజలనుండివచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి సిటిజన్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లుఅధికారులు తెలిపారు. ఇంతకుముందు చాల కన్సల్టేషన్ సదస్సులు నిర్వహించి వాటి ద్వారా వచ్చిన సూచనలు, సలహాలు పరిశీలించి సేఫ్‌గార్డ్ డాక్యుమెంట్ల ముసాయిదా రూపొందించడం జరిగిందని వారు వివరించారు. వీటిని ఎప్పటికప్పుడు ప్రజా సూచనలకు అనుగుణంగా అప్‌డేట్ చేయడమే కాకుండా ప్రభావిత ప్రజలకు మెరుగైన పునరావాస చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభావితులకు చట్టబద్దంగా అమలు చేయాల్సిన అంశాలు వివరించడంతోపాటు వాటి అమలు ప్రణాళిలను తెలయజేయడం జరిగిందన్నారు. ప్రాజెక్టుల గురించి అందరికీఅన్ని విషయాలు తెలియజేయడం జరుగుతందని వివరించారు. వివిధ ఫోరాలను వినియోగించుకుని తగి సూచనలు ఇస్తున్నారని, ఇంకా ఎవరైనా సలహాలు తెలియజేయవచ్చని మెరుగైన ముసాయిదాలు వచ్చే 20 ఏళ్ళ దాకా కార్యాచరణకు ఉపయోగపడతాయని తెలియజేశారు. తుళ్లూరు,అనంతవరంలలో నిర్వహంచిన వర్క్‌షాపుల్లో ప్రజల నుండి పలు సూచనలు, సలహాలు వచ్చాయి.తుళ్ళూరులో జరిగిన వర్క్ షాపులోతాడికొండ మార్కెట్ కమటీ చైర్మన్ బెల్లంకొండ నరసింహరావు మాట్లాడుతూ, గ్రామ కంఠాలు, అసైన్డ్ , ఇతర చిన్న సమస్యలు సత్వరమే పరిష్కరించి రాధాని అభివృద్ధి పనులపై పూర్తి స్థాయిలో దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. తామంతా స్వచ్ఛందంగా భూములిచ్చామని ప్రపంచ బ్యాంకు వారు సత్వరమే ఆర్థికసాయం విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. తుళ్ళూరుకు చెందిన పువ్వాడ శేషుబాబు మాట్లాడుతూ రిహాబిలిటేషన్ కాలనీల సమాచారం సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలని కోరారు. జొన్నలగడ్డ రవి మాట్లాడుతూసమస్యలు పరిష్కరించి ముందుకు సాగాలన్నారు.ఆర్ వన్‌లో తన స్థలలో రోడ్డు వేశారని, తనకు న్యాయం చేయాలని వై.గణేష్ కోరారు. రాయపూడికి చెందిన హరీంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ, సమస్యలు, ఇబ్బందులు తెలుసుకకుని సంబంధిత రైతులతో సంప్రదించి పరిష్కారం చూపితే తాము భూములు ఇచ్చేందుకుసిద్ధమేనని అన్నారు. రాజధానికి వ్యతిరేకం కాదని, కమ్యూనికేషన్ గ్యాప్‌ను తొలగిస్తే అంతా సానుకూలంగా ఉంటుందని చెప్పారు. సిటిజన్ కమిటీని స్వాగతిస్తున్నామని, రైతులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి కమిటీలో వారికే ఎక్కువ అవకాశం ఇవ్వాలని సూచించారు. చట్టప్రకారం సమస్యలు పరిష్కరించాలని, తుళ్ళూరులో రైతుల సందేశాలు తీర్చేందుకు ఒక లీగల్ అడ్వయిజర్‌ను ఏర్పాటుచేయాలనిఅన్నారు. రాజధాని డివిజన్ అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వీర్లంకయ్య మాట్లాడుతూ పరిహారంలో వివక్షకు తావులేకుండా అందరికీ సమన్యాయం చేయాలన్నారు. అనంతవరంలోనూ రైతులు, ప్రజలు తమ సూచనులు తెలియ జేశారు. ఈ వర్క్ షాపులు కొందరు శానం దయాకర్ కొండ వెంట ఎన్ని ఇళ్లు రోడ్లు వల్ల ప్రభావితమవుతాయో తెలపాలని, అదేవిధంగా రోడ్డు వల్ల మాఇళ్ళు, స్థలాలు ప్రభావితమౌతున్నాయని, గ్రామ కంఠం సమస్యను పరిష్కరించాలని, త్వరగా ప్రపంచ బ్యాంకు నిధులు అందిచాలని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

నేడు వెంకటపాలెం, నీరుకొండల్లో వర్క్‌షాపులు

ఏపీసీఆర్డీ ఆధ్వర్యంలో ఈనెల 30న బుధవారం వెంకటపాలెంలో ఉదయం 10 గంటలకు, అదేరోజు నీరుకొండలో మధ్యాహ్నం 2.30కు ఈ కన్సల్‌టేషన్ వర్క్ షాపులు నిర్వహిస్తున్నామని సీఆర్‌డీఏ పేర్కొంది.

విజయవాడ మీదుగా కన్యాకుమారి-శాంతాగచ్చి ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కన్యాకుమారి - శాంతాగచ్చి మధ్యన రెండు ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది. విజయవాడ మీదుగా నడిపే ఈ ప్రత్యేక రైళ్ల సదుపాయాన్ని వినియోగించుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేసింది. ప్రత్యేక రైలు ఈ నెల 31న (గురువారం) కన్యాకుమారిలో బయలుదేరి శనివారం 21.15 గంటలకు శాంతాగచ్చి చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో శాంతాగచ్చిలో వచ్చే నెల 4న (సోమవారం) బయలుదేరి బుధవారం 09.50 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది. మార్గ మధ్యలోని ప్రధాన స్టేషన్‌లలో రైళ్లను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు.

నిరుపేదలకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు

• రాష్ట్రంలో మెడ్‌టెక్ జోన్ ఏర్పాటు • త్వరలో 14 డయాలసిస్ కేంద్రాలు

అమరావతి, ఆంధ్రప్రభ : నిరుపేద ప్రజలకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను అందించే దిశగా ప్రభుత్వం చర్యలను చేపట్టిందని రాష్ట్రవైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని డాక్టర్ ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా మెడ్‌టెక్ జోన్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ జోన్ పరిధిలో అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన ఉన్నతశ్రేణి ఆరోగ్య సేవలను ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని, ఈ నేపథ్యంలో దాదాపు 80 శాతానికిపైగా పరికరాలను నార్వే, జర్మనీ, స్విజ్జర్లాండ్ తదితర దేశాల నుంచి తెప్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన 222 ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు అద్భుతమైన సేవలను అందిస్తున్నాయని, వీటి ద్వారా నిత్యం 15 వేల మంది వైద్య చికిత్సలను పొందుతున్నట్లు వివరించారు. కిడ్నీ బాధితులకు తోడ్పాటును అందించే దిశగా 18 ఉచిత డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, త్వరలో మరో 14 డయాలసిస్ కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ప్రాజెక్టులకు అడ్డుపడుతున్నవారిపై చర్యలు..

ప్రజా సంక్షేమం దృష్ట్యా దేశంలో ఎక్కడాలేని విధంగా అద్భుతమైన ఆరోగ్య సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి కామినేని స్పష్టం చేశారు. కానీ కొందరు స్వార్థపరులు ప్రభుత్వ ప్రాజెక్టులకు తీవ్రమైన అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. చిన్న చిన్న మరమ్మత్తులను చేపట్టక పోవడంతో ప్రభుత్వ వైద్యశాలల్లో ఎంతో విలువైన వైద్య పరికరాలు నిరుపయోగంగా మారాయంటూ వాటిని పునరుద్ధరించేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. చంద్రన్న సంచార వాహనం ద్వారా నిపుణుడైన వైద్యుడు, డయాగ్నస్టిక్, నర్సుల సేవలను మారుమూల గ్రామీణ ప్రజలకు కూడా అందుబాటులోకి తెచ్చామని, ఈ వాహనాలను జీపీఎస్‌కు అనుసంధానించడం ద్వారా అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, కార్పొరేట్ తరహా ఉచిత వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వైద్య సంబంధిత ప్రాజెక్టులను ఎంతో పారదర్శకంగా చేపట్టడం జరుగుతోందన్నారు. ఆరోగ్య ప్రాజెక్టుల ఏర్పాటులో ఎటువంటి జాప్యానికి తావులేదని, ఎటువంటి సందేహాలున్నా నేరుగా సంప్రదించవచ్చన్నారు. అనంతరం మెడ్‌టెక్ జోన్ సీఈఓ జితేంద్ర కుమార్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా మెడ్‌టెక్ జోన్ ఆవశ్యకతలను వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

• ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్



అమరావతి, ఆంధ్రప్రభ : సీజనల్‌గా ప్రభలే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలియజేశారు. మంగళవారం విజయవాడలో సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ మురుగు నీరు, నిల్వ ఉంచిన నీటి ద్వారా దోమలు, అంటువ్యాధులు త్వరగతిన వ్యాప్తి ప్రమాదం ఉందని చెప్పారు. ప్రజలు తమ ఇంటిని, చుట్టప్రక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, తాజా ఆహార పదార్థాలను తీసుకోవడం వలన దాదాపు 90 శాతం జబ్బులకు, అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. పారిశుద్ధ్య లోపం, వాతావరణం మార్పుల వలన అంటువ్యాధులు ప్రభలుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో త్రాగునీటిని కాచి, వడగట్టుకొని వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు.

కడప ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థులకు తప్పకుండా న్యాయం చేస్తామని కామినేని స్పష్టం చేశారు. ప్రభుత్వం తరపున కోర్టులో గౌరవ బెనర్జీ వాదనలు వినిపిస్తున్నారని, విద్యార్థులను ప్రభుత్వ కళాశాల్లో సర్దుబాటు చేయమని ఆదేశిస్తే తప్పకుండా చేస్తామని చెప్పారు. 108 సేవలకు సంబంధించి కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిందని, త్వరలోనే మళ్లీ టెండర్లు పిలుస్తామన్నారు. 108 వాహనంలో రోగిని ఆసుపత్రికి చేర్చేలోగా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా నూతన యాప్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. తట్టు, రుబెల్లా వ్యాధులను రూపుమాపే ఎంఆర్ టీకాను 9 రోజుల్లో 90 లక్షల మంది చిన్నారులకు వేసినట్లు వివరించారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు చట్టపరమైన హక్కులను కల్పిస్తూ జీఓను జారీ చేయడం జరిగిందని, మంగళగిరి వద్ద నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో ఎయిమ్స్ తరగతులు వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం ఆయన పలువురు విద్యార్థినిలకు స్వయంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహార లోపంతో రక్తహీనత ఉన్నవారికి తగిన మందులను, ఆరోగ్య చిట్కాలకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.

మరింత వేగంగా జాతీయ రహదారుల విస్తరణ పనులు

• కలెక్టర్లు, జాతీయ రహదారుల అథారిటీకి ప్రత్యేక లేఖలు • రహదారుల నిర్వహణకు ప్రత్యేక కన్సల్టెన్సీ • ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల విస్తరణ పనుల్లో మరింత వేగం పెరగాలని, ఇప్పటికే ఎంతో ఆలస్యం అయ్యిందని తగిన సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో సిఎస్ రోడ్లు భవనాలశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ), ఆర్ అండ్ బి అధికారులు రహదారుల విస్తరణలో జరుగుతున్న జాప్యంపై దినేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలతో సహా సిఎస్ అధికారుల ముందుంచారు. విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతే ఆయా మార్గాల్లో ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని, బాటిల్ నెక్, యూ టర్నింగ్, హైవేలను కలుపుతూ నిర్మించే సబ్ రోడ్ల అనుసంధానం విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై, ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు పనులు ఏమేరకు పూర్తి చేశారని ప్రధాన కార్యదర్శి నిలదీశారు. రోడ్లు భవనాలశాఖ పెండింగ్ ప్రాజెక్టులు, భూసేకరణ, రహదారుల నిర్వహణ అంశాలపై జాతీయ రహదారుల అథారిటీ అధికారులు, ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ) రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చేపట్టన జాతీయ రహదారుల విస్తరణ పనుల ప్రగతిని ఉన్నతాధికారులు సిఎస్‌కు వివరించారు. రాష్ట్రంలోని 16వ నంబరు, 216, 65వ జాతీయ రహదారుల విస్తరణకు సంబధించిన ప్రగతి, భూసేకరణ ఇతర ఆంశాలకు సంబసంధించిన సమస్యలను సిఎస్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన దినేష్ కుమార్ రహదారుల విస్తరణకు భూసేకరణ అడ్డంకిగా మారిన నేపథ్యంలో ఎప్పటికప్పుడు సిసిఎల్ఏ, ఆయా జిల్లా కలెక్టర్లతో చర్చించి, సకాలంలో పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. అయితే సమస్య పరిష్కారానికి తన వంతు సహాయం అవసరమైతే తాను అన్ని జిల్లా కలెక్టర్లకు లేఖలు రాస్తానన్నారు. ఈమేరకు తన తరపున అందరికీ లేఖలు రాయాలని తన కార్యాలయ సిబ్బందినిప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. అటవీ అనుమతుల సమస్యలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ జాతీయ, రాష్ట్ర రహదారుల విస్తరణ పనులు మందకొడిగా సాగడానికి వీలు లేదని, కాంట్రాక్టర్లు పనులను మరింత వేగంగా పూర్తి చేయడానికి ప్రయత్నించాలని, లేని పక్షంలో తీవ్రచర్యలు ఉంటాయని సిఎస్ హెచ్చరించారు.

ఆస్ట్రేలియా తరహాలో రహదారుల నిర్వహణ..

రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర రహదారులను ఆస్ట్రేలియా తరహాలో మెరుగైన రీతిలో నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక కన్సల్టెన్సీని ఏర్పాటు చేసి ఉత్తమ విధానాన్ని అమలు చేయడానికి వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆర్‌అండ్‌బి అధికారులకు సూచించారు. రహదారులు వేసిన కొద్ది రోజులకే గుంతలు ఏర్పడటంతో రవాణా వాహనాల రాకపోకలకు తీవ్రం అంతరాయం కలుగుతున్న విషయాన్ని ఆయా శాఖల అధికారులు గుర్తించాలని, అటువంటి వాటిని మెరుగైన రీతిలో నిర్వహించేలా చూడాల్సిన అవసరం కూడా ఉందన్నారు.


రహదారుల మరమ్మతులకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు :

రాష్ట్రంలో ప్రస్తుతం 6,672 కి.మీ పొడవైన జాతీయ రహదారులు, 15,406 కి.మీ పొడవైన రాష్ట్ర రహదారులు, 31,596 కి.మీ పొడవైన జిల్లా రహదారులు ఉన్నాయని ఆర్‌అండ్‌బి అధికారులు స్పష్టం చేశారు. ఈ రహదారుల్లో ఏర్పడిన గుంతలు, గోతులతో పాటు, మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ రోడ్ల నిర్వహణ విధానం (ఎ.పి.ఆర్.ఎం.ఎస్.) కింద రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాంట్రాక్టర్లు, ఇంజినీర్లకు తగిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. జిల్లాస్థాయిలో ఆర్‌అండ్‌బి ఎస్ఈ నోడల్ అధికారులుగా ఆర్.ఎం.ఎస్.కు సంబంధించి ప్రత్యేక సెల్ కూడా ఏర్పాటు చేసి రహదారుల నిర్వహనను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారులు సిఎస్‌కు వివరించారు. ఈసమావేశంలో వివిధ జాతీయ, రాష్ట్రరహదారుల విస్తరణ అంశాలతోపాటు 5 జిల్లాలను కలుపుతూ సుమారు 557 కి.మీ పొడవున 4, 6 వరుసలతో నిర్మించేందుకు అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతిపాదనలు, అమరావతి రాజధాని చుట్టూ దాదాపు 186 కి.మీ పొడవున రింగ్‌రోడ్డు నిర్మించేందుకు సిద్ధం చేసిన అంశాలపైనా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఉన్నతాధికారులతో చర్చించారు.

పిడుగు ప్రమాదాలపై క్షేత్రస్థాయిలో కార్యాచరణ

• పంచాయతీ, రెవెన్యూ అధికారులకు సమన్వయం • దండోరా వేసి పిడుగు సమాచారం తెలిపేలా ఆదేశాలు • పిడుగు పాటు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పిడుగు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయి లో కార్యాచరణ ప్రకటించింది. ఇప్పటి వరకూ స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ఇచ్చే ముందస్తు సమా చారం ప్రజలకు సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వారు ఇచ్చే ప్రతీ సమా చారం పిడుగులు పడే క్షేత్రస్థాయి వరకూ వెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం రాష్ట్ర విప త్తులశాఖ ఇస్తున్న సమాచారం స్థానిక రెవెన్యూ అధి కారుల వరకూ వెళుతోంది. వారు ఆ సమయంలో ఫోన్ చూసుకుంటేనే సదరు సమాచారం ప్రజలకు అందించే అవకాశం ఉంది. ఇదంతా క్షణాల్లో జరగాల్సిన అవసరం ఉన్న తరుణంలో ఆ స్థాయిలో ఎవ్వరూ స్పందించకపోయినా వారి ఆదేశాలు నిష్ఫలంగా మారుతున్నాయి. ఏదైనా గుర్తించిన ప్రాంతంలో పిడుగుపడుతుంది అని చెప్పినా దానిని చేర్చాల్సిన చోటకు చేర్చకపోవడంతో ఇబ్బందులు ఎదురౌతున్నా యి. ఒక్కో సందర్భంగా అదే ప్రాంతంలో పిడుగులు పడి మరణాలు సంభవిస్తున్నాయి. ఇవన్నీ గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం హోంమంత్రి నిమ్మకాయల చిన రాజప్ప ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. స్టేట్ ఎమ ర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ఇచ్చే ముందస్తు సమాచారం మేరకు రెవెన్యూ, గ్రామపంచాయితీ అధికారులు సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. దీంతోపాటు దండోరా వేసి పిడుగుపాటు మరణాలను తగ్గించేందుకు గ్రామ పంచాయతీలు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర విపత్తుల నివారణ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం పట్టించు కోకుంటే సదరు ప్రాంతాల అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ప్రభుత్వం కూడా పిడుగులు పడే అంశాలపై లోతైన అధ్యాయనం చేయించింది. ఎక్కడాలేని విధంగా ముందస్తు సమాచారం ఇచ్చే అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయినా చాలా చోట్ల పెద్ద ఎత్తున పిడుగుపడి మరణిస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ విపత్తులశాఖ ఇచ్చిన సమాచారం పట్టిం చుకోకపోవడమేనన్న అంశాన్ని ప్రభుత్వం ప్రత్యేకం గా గుర్తించింది. అందుకే పిడుగు సమాచారంపై పూర్తిస్థాయిలో కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించింది. రెవెన్యూ, గ్రామపంచాయతీలు, ఇతర శాఖలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించింది. పిడుగులు పడే సమాచారం తక్షణమే క్షేత్రస్థాయిలోని ప్రజలకు చేరేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఇప్పటికే రాష్ట్ర విపత్తులశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైతం ప్రత్యేకంగా విపత్తుల నివారణపై నిత్యం సమీక్షలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అందిపుచ్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరవేసినప్పుడే మరణాలను అడ్డుకోగలమని ప్రభుత్వం అంచనా వేస్తోంది.



పలు జిల్లాలకు పిడుగు ప్రమాద హెచ్చరికలు

రాష్ట్రంలోని పలు జిల్లాలకు మంగళవారం పిడుగు ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. విశా ఖపట్నం, కర్నూలు, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లోని పలు మండలాలకు, గ్రామాలకు పిడుగులు పడే ప్రమాదం ఉందని సమాచారం ఇచ్చారు. ఆయా మండల తహసీల్దార్లకు, విఆర్‌వోలకు, బిఎస్ఎన్ఎల్ ఉపయోగించే వినియోగదారులకు ఈ సమాచారం వెళ్లింది. ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా పిడుగు ప్రమాద హెచ్చరికలపై తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేశారు. పిడుగులు పడే 30 నుంచి 40 నిముషాల ముందే రాష్ట్ర విపత్తులశాఖ సమాచారం అందిస్తోంది. దానిని క్షేత్రస్థాయిలోని రెవెన్యూ, పోలీస్, ఫైర్, విపత్తులశాఖ ప్రత్యేక అనుబంధ విభాగాలు ప్రజలకు చేరవేయాల్సి ఉంది. రాష్ట్రంలో అంతిమంగా పిడుగు ప్రమాదాలను తగ్గించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషిచేస్తోంది.

గుంటూరు ఉద్యానవనశాఖ డీడీ సస్పెన్షన్

• డీడీ అవినీతి, అక్రమాలపై విచారణకు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: గుంటూరు ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేస్తూ కమిషనర్ చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ వేటుకు గురైన జయచంద్రారెడ్డిపై రైతులు కొందరు నేరుగా కమిషనర్‌ను కలిసి ఆరోపణలు చేయడం జరిగింది. ప్రభుత్వ సబ్సిడీ పథకాల మంజూరులో జయచంద్రారెడ్డి డబ్బులు డిమాండ్ చేసినట్లు రైతులు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ప్రాథమిక విచారణలో రుజువు కావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. గోరంట్లకు చెందిన ప్రసాదరెడ్డి, మందపాడుకు చెందిన శివరామిరెడ్డి అనే రైతులు తమ పొలంలో వేసిన షేడ్‌నెట్లకు సబ్సిడీ మంజూరులో డీడీ డబ్బులు డిమాండ్ చేసినట్లు వారు ఫిర్యాదు చేశారు. అలాగే డీడీకి సంబంధించిన టెలిఫోన్ సంభాషణను కూడా రైతులు కమిషనర్‌కు వినిపించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో డీడీని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై కమిషనర్ చిరంజీవి చౌదరి వివరణ కోరగా, డీడీ జయచంద్రారెడ్డిపై కొందరు రైతులు అవినీతి ఆరోపణలు చేయడం జరిగిందన్నారు. రైతులు చేసిన ఆరోపణలపై ప్రాథమిక విచారణ నిర్వహించి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. డీడీపై వచ్చిన ఫిర్యాదులపై పూర్తి విచారణ జరిపి నివేదిక అందగానే చర్యలు తీసుకుంటామని కమిషనర్ వివరించారు. ఇదిలా ఉంటే మంగళగిరి ప్రాంతంలో దొండ సాగుకు సంబంధించి పందిర్లకు మంజూరు చేసే సబ్సిడీ విషయంలో కూడా డీడీపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే డీడీ జయచంద్రారెడ్డి గతంలో పలుమార్లు సస్పెండ్ కావడం ఈ సందర్భంగా గమనార్హం.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 30 ఆగస్టు 2017

కొత్త 'ఆర్థికం' వెనక్కి!

ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలనా రంగానికి కొత్త రూపును తీసుకుని వచ్చేందుకు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆలోచనలు సాగిస్తూనే ఉన్నారు. వాటిల్లో చాలా మటుకు ఆచరణలో పెట్టారు. కాంగ్రెస్ పాలనలో అనుసరించిన విధానాల వల్లే దేశంలో అవినీతి తిష్ఠ వేసిందని బలంగా నమ్ముతున్న మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పద్మా అవార్డులను గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. పేరున్న వారి ప్రాపకంతో,వారి సిఫార్సులతో పద్మా అవార్డులను పొందే పాతపద్ధతికి స్వస్తి చెప్పేందుకు కొత్తవిధానాన్ని ప్రవేశపెట్టారు. వివిధ రంగాల్లో ప్రముఖులు ఈ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవీలు కల్పిస్తున్నట్టు ప్రకటించారు.పద్మా అవార్డులకు ఎంపికలో అవినీతిని క్షాళన చేయడానికి ఈ కొత్త పద్ధతిని ప్రవేశపెడుతున్నట్టు ఆయన ప్రకటించారు.అలాగే, ప్రణాళికా సంఘం స్థానే నీతి ఆయోగ్‌ని ప్రవేశపెట్టారు.రైల్వేబడ్జెట్‌ని రద్దు చేసి సాధారణ బడ్జెట్‌లో విలీనం చేశారు. నల్లధనం వెలికితీతకు పెద్ద కరెన్సీని ఉన్నపళంగా రద్దు చేశారు. పారిశుధ్యంపై జనానికి స్పృహ కలిగించేందుకు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని తానే ప్రారంభించారు. ఇవన్నీ ప్రయోగాలే. ఇవి ఎంతవరకూ విజయవంతం అయ్యాయో ఎవరి మటుకు వారు విశ్లేషణ చేసుకోవల్సిందే. ఈ క్రమంలోనే ఆయన మదిలో మెరిసిన ఆలోచన ఆర్థిక సంవత్సరం మార్పు. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి మార్చి 31 వరకూ ఆర్థిక సంవత్సరం బ్రిటిష్ వారి కాలం నుంచి అమలులో ఉంది. బ్రిటిష్ ప్రభుత్వం నుంచి నిధుల విడుదలను ఆధారంగా చేసుకుని గతంలో బడ్జెట్‌లను తయారు చేసేవారు. అందువల్ల ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ప్రారంభమయ్యేట్టుగా ఆర్థిక సంవత్సరాన్ని ఎంతో కాలంగా పాటిస్తూ వస్తున్నారు.దీనిని జనవరి నుంచి డిసెంబర్‌కి మార్చేందుకు ప్రతిపాదనల సంకేతాలను జనం మీదికి వదిలారు. దీనిపై ఇప్పటికే పెద్ద చర్చ జరిగింది. అన్ని సంస్కరణలు ఒకేసారి అమలులో పెడితే సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.ఇప్పుడు అదే జరుగుతోంది. ప్రణాళికా సంఘం స్థానే ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ వల్ల రాష్ట్రా ల ప్రణాళికా పెట్టుబడుల ఖరారులో జాప్యం తొలగిన మాట నిజమే అయినప్పటికీ,రాష్ట్రా లకు శాఖల వారీగా కాకుండా, పథకాల వారీగా నిధుల కేటాయించే పద్ధతి వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే, కేంద్ర నిధుల్లో రాష్ట్రా ల వాటాని 32 శాతం నుంచి 42 శాతం పెంచినట్టు మోడీ ప్రభుత్వం హోరెత్తించే ప్రచారం చేసింది.కానీ, గతంలో వివిధ పథకాలకు చేసే కేటాయింపులను ఇప్పుడు తగ్గించిందని చాలా రాష్ట్రా లు వాపోతున్నాయి.అంతేకాక, పథకాల నిధులను వివిధ కార్యక్రమాలకు మళ్ళించుకునే స్వేచ్ఛ రాష్ట్రా లకు ఉండేది.ఇప్పుడు అలాంటి స్వేచ్ఛ లేదు.దాని వల్ల కూడా రాష్ట్రా లు ఇబ్బందులకు గురి అవుతున్నాయి. గత జూలై 30వతేదీ అర్ధరాత్రి నుంచి ఆర్భాటంగా ప్రవేశపెట్టిన వస్తు,సేవా పన్ను (జిఎస్‌టి)పన్ను వల్ల రాష్ట్రా లు తమ ఆదాయానికి గండి పడిందని గగ్గోలు పెడుతున్నాయి. కొత్త పన్ను మీద దేశవ్యాప్తంగా ప్రచారం జరుగుతున్న మాట వాస్తవమే కానీ, దేశవ్యాప్తంగా వర్తక,వాణిజ్య సంఘాల వారు దీని పట్ల అనాసక్తిని ప్రదర్శిస్తున్నారు. పన్ను రేట్ల విషయంలో వివాదం ఇంకా కొలిక్కి రాలేదు.కొన్ని వస్తువులపై గతంలో 18 శాతం ఉన్న పన్ను ఇప్పుడు 28 శాతానికి పెరిగేసరికి హాహాకారాలు బయలుదేరాయి. ఈ నేపథ్యంలో రాబడి అంతంత మాత్రంగానే ఉంది.అయితే,ఆర్థికమంత్రి జైట్లీ మాత్రం జిఎస్‌టి వల్ల పన్ను రాబడి పెరిగిందనీ, ఆదాయం పన్ను చెల్లించేవారి శాతం 25 శాతం పెరిగిందని పదే పదే స్పష్టం చేస్తున్నారు. రాబడి పెరిగితే పొదుపు పథకాల వడ్డీ రేట్లపై కోత ఎందుకన్న ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సరైనసమాధానం లేదు.

మార్చి ఆఖరులోగా పన్ను చెల్లించే వెసులుబాటుకు అలవాటు పడిన చెల్లింపుదారులు ముందే చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. ఆర్థిక సంవత్సరం మార్పుపై మోడీ ప్రభుత్వం పునరాలోచనలో పడటానికి ప్రధాన కారణం ఇదే కావచ్చు.అంతేకాక,ఆర్థికసంవత్సరంమార్పును చాలా రాష్ట్రా లు వ్యతిరేకిస్తున్నాయి.ఆర్థిక చక్రాన్ని మార్చడం వల్ల పెద్దగా ప్రయోజనాలు ఉండవని ఆర్థిక శాస్త్రవేత్తలు స్పష్టం చేయడం మరోకారణం కావచ్చు. బ్రిటిష్ వారి కాలంలో రైల్వే శాఖకు ప్రత్యేక బడ్జెట్‌ని ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది.ఇప్పుడు దానిని సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయడం వల్ల ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల ముజఫర్‌నగర్ వద్ద జరిగిన ఉత్కళ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం సందర్భంగా దీని లోటుపాట్లు వెలుగు చూశాయి. ప్రత్యేక బడ్జెట్ ఉన్నప్పుడు రైల్వే బోర్డు క్షణాల్లో స్పందించేది.ఇప్పుడు నిధుల కోసం ఆర్థిక శాఖపై చూడాల్సిన పరిస్థితి ఇటీవల స్వయంగా చూశాం. అలాగే, జిఎస్‌టి వల్ల ఇప్పటికే నష్టాలు వస్తున్న ప్రస్తుత పరిస్థితిలో ఆర్థిక సంవత్సరం మార్పు వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని రాష్ట్రా లు గట్టిగా వాదిస్తుండటంతో ఈ ప్రతిపాదనను ప్రస్తుతానికి విరమించుకోవాలని ప్రధాని నిర్ణయించుకున్నట్టు సమాచారం. 2019లో తమ ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వస్తుందన్న ధీమాతో ఉన్న కారణంగా అప్పుడే దీనిని ప్రవేశపెట్టవచ్చుని ఆయన నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.ఎప్పుడూ పాత పద్ధతినే అనుసరించాలని లేదు.మార్పులు తీసుకుని రావడం ప్రభుత్వానికి ఉన్న హక్కు,స్వేచ్ఛ.అయితే,మార్పు వల్ల సమస్యలు తీరాలే తప్ప మరింత పెరగకూడదు.పెద్ద కరెన్సీ రద్దు నాటి కష్టాలు ఇప్పటికీ ఏదో రూపంలో జనాన్ని వెంటాడుతూనే ఉన్న సంగతిని మరువగలమా?

డేరాల్లో ఘోరాలు

హర్యానాలో (అ)ధార్మిక సంస్థ, డేరా అధినేత రామ్ రహీం సింగ్ అత్యాచారం కేసులో ముద్దాయిగా కోర్టు తీర్పు వెలువడిన వెంటనే హింస జరగగా 36 మంది ప్రాణాలు కోల్పోవడం, వందలాదిమంది గాయపడడం, వేల కోట్ల రూపాయల ఆస్థి ధ్వంసం కావడం అత్యంత హేయం. ఒక ప్రభుత్వం అంటూ అక్కడ ఉందా అన్న సందేహం అందరికీ వచ్చే ఉంటుంది. ముఖ్యంగా డేరా సంస్థ ఒక ఊరికో, వాడకో పరిమితం కాలేదు. లక్షలాదిమంది అనుచరులు, వేలకోట్ల ఆస్తులు కలిగి, వివిధ రాష్ట్రా లలో విస్తరించిన ఒక వివాదాస్పద మానవ సమూహం. దాని అధినేత పట్ల ఆ అనుచరుల్లో ఉన్మత్తస్థాయిలో మూఢ విశ్వాసం. అయితే దురదృష్టవశాత్తు హర్యానాలో ప్రతీ రాజకీయ పార్టీ ఆ మూఢభక్తిని వీలైనంత ఎక్కువగా పిండుకోవాలని చూసినవే తప్ప, వారికి దూరంగా జరిగినవి కావు. పదిహేనేళ్లుగా ఆ అధినేతపై అత్యాచారం వంటి తీవ్ర నేరారోపణలతో కేసు నడుస్తున్నా, ఏమాత్రం ఆయన పరపతికి వచ్చిన నష్టం లేకపోయింది. ఆయన దయతలిచి పోయిన ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చాడు. ఆయన స్వచ్ఛ భారత్ స్ఫూర్తికి ప్రధాని కితాబు కూడా లభించింది. ఒక తీవ్ర నేరంలో నిందితుడిగా నిలబడ్డ ప్రబుద్ధుని పట్ల ఉండాల్సిన స్పందన ఇదా? సరే! బురద రాజకీయాలు అనుకుందాం.

అన్ని లక్షల మంది పిచ్చి అనుచరులు ఉన్నప్పుడు, వ్యతిరేక తీర్పు రాగల అవకాశం, వచ్చిన తరువాత రాగల దొమ్మీ అవకాశాలు ఊహించలేనివా! వాటి విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి కదా! ఒక నేరస్థుడికి శిక్ష ఖరారు చెయ్యడానికి, న్యాయమూర్తి తన న్యాయస్థానంలో రక్షణ ఉండదని భావించి జైలులో తీర్పు వెలువరించాల్సి రావడం దేశానికే సిగ్గు చేటు. నాలుగు ఓట్లున్నవాడు, నాగు పామైనా సరే, నాకు ఆప్తుడే అని రాజకీయ పార్టీలు అనుకొనే వరకూ పరిస్థితి మారదు. వారి ప్రాపకం కోసం వెంపర్లాడడం అంటే దేశాన్ని తాకట్టు పెట్టడమే. ఈ ఉదంతం అందరికీ కనువిప్పు కావాలి, దేశ ప్రధానితో సహా.

-డా. డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపి, పార్వతీపురం.

మంచి మాట

పుస్తక పఠనం అనే వినోదానికి
అయ్యే ఖర్చుచాలా తక్కువ,
పొందే వినోదం శాశ్వతమైంది.

● లేడీ మాంటేగ్

ఎస్పీ పోరాట పటిమ ఏమైంది?

దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో నాలుగుసార్లు అధికారాన్ని చెలాయించి, ప్రస్తుతం అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్రంలో తాజా పరిణామాలపై ఏమాత్రం స్పందించకుండా ప్రేక్షక పాత్ర వహిస్తోంది. గతంలో రాష్ట్రంలో ఏదైనా కుంభకోణం చోటు చేసుకున్నా, ఘోర ప్రమాదాలు సంభవించినా ఆ పార్టీ నాయకులూ, కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టేవారు. దేశ వ్యాప్తంగా తీవ్ర సంచలనాన్ని సృష్టించిన ఘోరఖ్‌పూర్ ఆస్పత్రిలో దాదాపు 70 మంది శిశువులు మరణించినా, ముజఫర్‌నగర్ వద్ద ఉత్కళ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో 25 మంది అశువులు బాసినా సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తల నుంచి కనీసం ఏమాత్రం స్పందన లేదు. ప్రధాన ప్రతిపక్షంగా పిలవబడుతున్నా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీకీ, సమాజ్‌వాదీ పార్టీ మధ్య బలాబలాల విషయంలో హస్తిమశకాంతరం తేడా ఉన్న మాట నిజమే. అయినప్పటికీ, రాష్ట్రంలో ఘోరాలు జరుగుతున్నా ఆ పార్టీ అలా ఎందుకు మిన్నకుండిపోతోంది? దాని పోరాట పటిమ అంతా ఏమై పోయింది? అనే ప్రశ్నలు రాజకీయ విశ్లేషకుల నుంచి వినవస్తున్నాయి.

వాస్తవానికి సమాజ్‌వాదీ పార్టీ గోరఖ్‌పూర్ సంఘటనపై పెద్దగా వ్యాఖ్యానించలేదు. ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఇది దురదృష్టకర సంఘటన అంటూ ముక్తసరిగా వ్యాఖ్యానించారు. మృతుల కుటుంబాలకు తమ పార్టీ తరపున సాయం అందజేశారు. ఈ దుర్ఘటనకు సంతాపసూచకంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాల్సిందిగా తమ పార్టీ జిల్లా శాఖలను ఆయన ఆదేశించారు.

బీజేపీకి భయపడి...:

తమ పార్టీ ఎందుకంత అచేతనంగా ఉందో సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలే బయటపెట్టారు. రాష్ట్రంలో బీజేపీ అధికార పక్షమే కాకుండా, సంఖ్యాపరంగా, కేడర్‌పరంగా చాలా బలమైన పార్టీ. అందుకే ఆ పార్టీ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టేందుకు సాహసించలేదని సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్త ఒకరు పేర్కొన్నారు. గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ నిల్వలు తగినంత లేకపోవడం వల్లనే శిశుమరణాలు సంభవించాయని తేలింది.ఆస్పత్రి సూపరింటెండెంట్ కఫీల్ అహ్మద్ ఖాన్‌పై విమర్శలు వెల్లువెత్తినప్పుడు సమాజ్‌వాదీ పార్టీ స్పందించలేదు. ఆయన సమాజ్‌వాదీ పార్టీకి ముఖ్యంగా, అఖిలేష్ యాదవ్‌కి సన్నిహితుడని కమలనాథులు ప్రచారం చేశారు. దాంతో సమాజ్‌వాదీ పార్టీ నోరు పెగల్చలేకపోయింది. జరిగిన ఘోరం గురించి కాకుండా, హిందూ-ముస్లింల మధ్య తగాదాగా దీనిని మార్చి వేసేందుకు కమలనాథులు పన్నిన వ్యూహం ఫలించింది. నిజానికి ఆ ఆస్పత్రిలో ఖాన్ పిల్లల వైద్యునిగా మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన చాలామంది పిల్లల ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినట్టు జనమే ఒప్పుకున్నారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ సిలిండర్ల కొరత ఉండటంతో ఆయన తన సొంత నిధులు ఖర్చుచేసి చాలా మంది ప్రాణాలు కాపాడారు. అయితే, ఆయనకు వ్యతిరేకంగా జరిగిన ప్రచారం ఆయనను దోషిగా నిలబెట్టింది. నిజానికి ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేసే ఏజెన్సీకి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం వల్లనే సిలిండర్ల కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్ళడంలో సమాజ్‌వాదీ పార్టీ విఫలమైంది. కఫీల్‌ఖాన్‌పై బీజేపీ నాయకులు జరిపిన ప్రచారాన్ని ఎదుర్కోలేకపోయింది.

మరింత పెరిగిన అగాధం:

ఈ పరిస్థితికి ప్రధాన కారణం సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్‌కీ, ఆయన కుమారుడు,మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌కీ మధ్య గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఏర్పడిన అగాధం ఇంకా పూడలేదు సరికదా,పార్టీలో ఇరువర్గాలకు చెందిన స్వార్థపరులు వారిద్దరిమధ్య అగాధాన్ని మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ములాయం సొంత సోదరుడు శివపాల్ సింగ్ యాదవ్ అఖిలేష్‌పై పాత కక్షను ఇప్పుడు తీర్చుకుంటున్నారు. అఖిలేష్‌కి వాగ్ధాటితో జనాన్ని ఆకర్షించేశక్తి లేదని ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలు పెంపొందించుకోకుండా, తన చుట్టూ చేరిన వారితో కలిసి గడుపుతున్నారని అఖిలేష్‌పై శివపాల్ సింగ్ యాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తుతున్నారు.ఆయన బీజేపీ నాయకుల చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తున్నారని ప్రత్యర్థివర్గం ఆరోపిస్తోంది.

మరో వంక ములాయంకి వరుసకు సోదరుడైన రామ్‌గోపాల్ యాదవ్ అసెంబ్లీ ఎన్నికల ముందు తండ్రి,



కొడుకుల మధ్య వివాదం పెరిగి పార్టీలో చీలిక రావడానికి తెరవెనుక తంత్రాంగాన్ని నడిపించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు మరింతగా పెరిగేందుకు ఆజ్యం పోస్తున్నారు. అఖిలేష్ యాదవ్ ఐదేళ్ళు అధికారంలో ఉన్నప్పుడు లబ్ధి పొందిన వారంతా ఇప్పుడు కాగడా పెట్టి వెతికినా కనిపించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు.

బీజేపీ ఆడిస్తున్న నాటకం: సమాజ్‌వాదీ పార్టీలో అసెంబ్లీ ఎన్నికల నాటి చిచ్చు ఇంకా ఆరకుండా దానిని ఎప్పటికప్పుడు రాజేయడంలో కమలనాథులు తమ అధికారాన్నీ, అవకాశాలనూ పూర్తిగా వినియోగించుకుంటున్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఏ అభ్యర్థికి సమాజ్‌వాదీ ఎంపీలు,ఎమ్మెల్యేలూ క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడేట్టు చేశారు. నలుగురు ఎంపీలు, పదిమంది లెజిస్లేటర్లు క్రాస్ ఓటింగ్‌కి పాల్పడి అఖిలేష్ యాదవ్ ఆదేశాలను బేఖాతరు చేశారు. ఆ సమయంలో ఆయన (అఖిలేష్ యాదవ్) లండన్‌లో తన పుట్టినరోజు పండుగ జరుపుకున్నారు. మాంచెస్టర్‌లో తన కుమారునితో ఫుట్‌బాల్ ఆడుకున్నారని ఆయన ప్రత్యర్థి వర్గం నాయకుడు ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శించారు. అయితే, అఖిలేష్ యాదవ్‌ని ఆయన సన్నిహితుడు సంతోష్ సైనీ సమర్థించారు. అఖిలేష్ లండన్‌లోఉన్నా ఇక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆదేశాలు జారీ చేస్తూ వచ్చారనీ,ఆయన తప్పేమీ లేదని సైనీ స్పష్టం చేశారు.

ఫిరాయింపుదారులపై చర్యలేవీ: ఆగస్టు మాసారంభంలో ఆరుగురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరారు. పార్టీ ఫిరాయించిన యశ్వంత్‌సింగ్ అనే ఎమ్మెల్సీ తాను పార్టీ మారుతున్న విషయం అఖిలేష్‌కి ముందే తెలుసుననీ,అయినా, ఆయన తనతో ఫోన్‌లో మాట్లాడలేదని అన్నారు. రాజీనామా చేసిన తర్వాత పిలిచారనీ,అప్పటికే రాజీనామా చేశానని అన్నారు. తాను బీజేపీలో చేరలేదనీ, అయితే, ఆ పార్టీ జాతీయ భావాలకు తాను ఆకర్షితుడనయ్యానని అన్నారు. ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోకపోవడం అఖిలేష్ బలహీనతగా పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏర్పాటు చేసిన ఠాకూర్ కూటమిలో యశ్వంత్‌సింగ్ కూడా సభ్యుడే. ఆయన అలా వెళ్ళడంలో ఆశ్చర్యం లేదు కానీ, శివపాల్ యాదవ్ అసెంబ్లీలో తనకు ప్రతిపక్ష నాయకుని పదవి ఇవ్వనందుకు గుర్రుగా ఉన్నారు.

అఖిలేష్ బ్రిగేడ్: అఖిలేష్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అఖిలేష్ బ్రిగేడ్‌గా వ్యవహరించిన వారంతా కౌన్సిల్ సభ్యులే. వారికి ప్రజలతో నేరుగా సంబంధాలు లేవు. పార్టీలో పాత, కొత్త తరాల్లో ఏదైనిఅయినప్పటికీ,చీలిక జరగబోదని ఎవరూ చెప్పడం లేదు. తగిన సమయం రావాలని మాత్రమే అంటున్నారు. నేతాజీ (ములాయంసింగ్) ఉన్నంత కాలం పార్టీ చీలబోదని ఆశిస్తున్నట్టు ఆయన అనుచరుడు ఒకరు పేర్కొన్నారు. ములాయం పార్టీ కోసం ఎంతో శ్రమించారనీ, అట్టడుగు స్థాయినుంచి అధికార పీఠం వైపు పార్టీని నడిపించారని ఆయన వర్గానికి చెందిన నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు.

పార్టీలో ఎవరెవరు ఎటు:

రామ్‌గోపాల్ యాదవ్--ములాయంకి వరుసకు సోదరుడు. 2017 అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన తిరుగుబాటుకు ప్రధాన సూత్రధారి. సైకిల్ ఎన్నికల గుర్తు అఖిలేష్‌కి దక్కేట్టు చేయడంలో కీలక పాత్ర వహించారు. రాజ్యసభలో పార్టీ నాయకునిగా వ్యవహరిస్తున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు ములాయం సింగ్ ఏర్పాటు చేసిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీల సమావేశానికి రామ్‌గోపాల్ యాదవ్ హాజరు కాలేదు. జయబచ్చన్, విశ్వంభర్ ప్రసాద్ నిషాద్, నరేష్ అగర్వాల్, సురేంద్ర సింగ్ అగర్వాల్ ప్రభృతులు హాజరయ్యారు.

బరాట్ పాక్ - మధ్యవయస్కుడవుతున్నా, యువజన విభాగంలో పేరొందారు. అఖిలేష్‌యాదవ్ పార్టీలో చేరినప్పటి నుంచి ఆయనను అనుసరిస్తున్నారు. ఒకప్పుడు వీధి పోరాటాల్లో పాల్గొన్నారు. ఇప్పుడు అఖిలేష్‌కి రాజకీయాలకు సంబంధించిన సమాచారం అందిస్తున్నారు. ఆనంద్ బదూరియా,అనురోగ్ భాదోరియా,సంతోష్ యాదవ్ సైని, ఉదయవీర్‌సింగ్, సంజయ్ లత్తార్, --వీళ్ళంతా అఖిలేష్ శిబిరానికి చెందిన వారు.

శివపాల్‌సింగ్ శిబిరం- ములాయం రెండో భార్య సాధనా గుప్తా, శివపాల్‌కి ఆమే పెద్ద దన్ను. తన కుమారుడు ప్రతీక్ యాదవ్‌ని ములాయం రాజకీయవారసునిగా చేసేందుకు

శివపాల్ యాదవ్‌ని ఉపయోగించుకుంటోంది. కోడలు అపర్ణా యాదవ్ ధర్మేంద్ర యాదవ్, తేజ్‌ప్రతాప్‌సింగ్ యాదవ్- ధర్మేంద్రబాదౌన్ ఎంపీ, ములాయంకు మేనల్లుడు. తేజ్‌ప్రతాప్ ములాయం అన్నగారి మనవడు.

ఆదిత్య యాదవ్- శివపాల్ కుమారుడు. ప్రధాన సలహాదారు.

మధుకర్ జెట్లీ -ములాయం పాత అనుచరుడు. శాసనమండలి సభ్యుడు, ములాయం పట్ల విధేయత కారణంగా శివపాల్ శిబిరంలో కొనసాగుతున్నారు.

పార్టీకి పూర్వవైభవం కోసం...:

అసెంబ్లీ ఎన్నికల్లో అనైక్యత వల్ల కుప్పకూలిన పార్టీని తిరిగి సంఘటితం పర్చేందుకు, పార్టీకి ఒకే రూపు ఇచ్చేందుకు సమాజ్‌వాదీ పార్టీ నాయకులు తీవ్ర యత్నాలు సాగిస్తున్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్‌కూ, ఆయన కుమారుడు, ప్రస్తుత అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌కీ మధ్య సామరస్య సాధనతో పాటు,పార్టీలోని అన్ని వర్గాలనూ కలుపుకుని పోయేందుకు కార్యాచరణ రూపొందించనున్నారు. వచ్చే నెలలో జరిగే పార్టీ జాతీయ సదస్సుకు భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ఎంతో కాలంగా ప్రత్యర్థిగా ఉన్న బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పి)తో పొత్తు వల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని చాలా మంది ఆందోళన చెందుతున్నారు.

బీజేపీని ఎదుర్కొనేందుకు లౌకిక శక్తులను కలుపుకుని పోవాలన్న అఖిలేష్ పిలుపునకు అనుగుణంగా బీఎస్‌పితో పొత్తువార్తలు వెలువడ్డాయి. ప్రధాన ప్రతిపక్షంగా పార్టీ సమర్థవంతమైన పాత్ర వహించేందుకు తీసుకోవల్సిన చర్యల గురించి ఈ సమావేశాల్లో చర్చిస్తారు. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత సహరాన్‌పూర్, రాయబరేలీ తదితర ప్రాంతాల్లో దళితులపై దాడులు జరిగాయి. గోరఖ్‌పూర్‌లో శిశుమరణాలు సంభవించాయి. శిక్షా మిత్రా సభ్యుల ఆందోళన వంటి ప్రధానాంశాలపై యోగి ప్రభుత్వంపై ధ్వజమెత్తడంలో సమాజ్‌వాదీ పార్టీ విఫలమైందన్న విమర్శల నేపథ్యంలో పార్టీకి పూర్వవైభవాన్ని తెచ్చేందుకు వచ్చే నెల జరిగే జాతీయ సదస్సులో తగిన కార్యాచరణను రూపొందిస్తారు.

పేట్రన్‌గానే ఉండాలి: ములాయంసింగ్ పార్టీ అధ్యక్ష పదవిని కోరకుండా పార్టీ పేట్రన్‌గా ఉండినట్టయితే, పార్టీలో అసలు సమస్యే లేదని అఖిలేష్ వర్గం పేర్కొంటోంది. పార్టీ పెద్దగా ములాయం ఇటు తన సోదరుడు శివపాల్‌కీ, అటు కుమారుడుఅఖిలేష్‌కి సలహా ఇచ్చే స్థానంలో ఉండాలనీ, ఇద్దరినీ కూర్చోబెట్టి మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుందని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికలు ప్రధాన లక్ష్యంగా సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ శక్తిగా తన పూర్వవైభవాన్ని సంపాదించేందుకు కృషి చేయాలన్నదే కార్యకర్తలు, నాయకుల అభిమతమని సీనియర్ నాయకుడు పేర్కొన్నారు. తండ్రి కొడుకుల మధ్య సామరస్యంఉంటేనే పార్టీకి మనుగడ అని ఆయన అన్నారు.

-ఎ.వి.స్వామి

సంక్షోభమే సువర్ణావకాశం!



రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు తన సత్తా ఏమిటో నిరూపించుకునే అవకాశం వచ్చింది. సంక్షోభాన్ని సువర్ణావకాశంగా మలుచుకొని సాంకేతికంగా దూసుకెళుతున్న సమయమిది. రాష్ట్ర రథసారథి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మూడేళ్ల నవ్యాంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అనేక విజయాలు సాధించింది. **ఐఓటి (ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్) విప్లవంతో తుఫాన్లను జయించాం. పిడుగులపైనే పిడికిలి బిగించాం. సాంకేతిక పరిజ్ఞానంతో అపాయాలు తప్పించుకునే ఉపాయాలు కనిపెట్టిన ఘనత మనదే. ఇదే టెక్నాలజీని ప్రభుత్వం అవినీతి నిరోధానికి, జవాబుదారీ, పారదర్శక పాలనకు సోపానంగా మలుచుకుంటోంది.** దాపరికం లేని పాలన రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. పేదరికం లేని సమాజం గమ్యం. ప్రజాహితమైన, అవినీతి రహితమైన పాలనే ప్రభుత్వ విధానం. ఇందుకు ఎంచుకున్న మార్గం జవాబుదారీతనం. పారదర్శకత. ఇందులో భాగంగా తాజాగా ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన కార్యక్రమమే 'ప్రజలే ముందు'. ఏ కార్యక్రమం ఆరంభించినా 'ప్రజలే ముందు' అనే స్ఫూర్తితో సాగాలని ప్రభుత్వం అధికారులకు దిశానిర్దేశం చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే తొలి ప్రాథమ్యాలు. ప్రజలే ముందుంటారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం. 'ప్రభుత్వం ప్రజలకు చేరువగా వెళ్లాలి. ప్రజల్ని గౌరవించి, అభివృద్ధిలో వారిని భాగస్వాముల్ని చేయాలి' ఇదే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా 1100 కాల్ సెంటర్ నెంబర్ ప్రారంభించింది. భవిష్యత్తులో 1100కు వచ్చే ఫిర్యాదులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి గడువు విధించనున్నారు. గడువులోగా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపకుంటే, సిటిజన్ చార్టర్ మాదిరిగా సదరు అధికారికి హెచ్చరికలు జారీ చేస్తారు. సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుని ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా సంక్షేమ ఫలాలు అర్హులకు చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ప్రజల సంతోషం, వారి సంతృప్తే అంతిమంగా ప్రభుత్వానికి గుర్తింపు. పథకాలతో ఎవరు లబ్ధి పొందుతున్నారు? ప్రయోజనం దక్కనటువంటి అర్హులు ఎవరైనా ఉన్నారా? అనే విషయాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలించి రికార్డుల్లో వుంచుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2017-18 వ సంవత్సరాన్ని 'ఇ-ప్రగతి' సంవత్సరంగా ప్రకటించింది. పారదర్శక పాలనతో రాష్ట్రాన్ని అవినీతి రహితంగా మార్చడానికి ఇది విశిష్ట, వినూత్న కార్యక్రమం. సాంకేతిక పరిజ్ఞానంతో దళారులు, మధ్యవర్తులను నియంత్రించడానికి ఐరిస్, బయోమెట్రిక్ విధానాలతో పెన్షన్లు జారీ చేస్తోంది. కంటిపాప, వేలిముద్రలతో అక్రమాలకు అవకాశం లేకుండా చేసింది. **రాష్ట్రంలో అవినీతి గణనీయంగా తగ్గినట్లు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్ (ఎన్‌సిఎఇఆర్) 2017 సర్వేలో వెల్లడైంది. దేశంలో ఏపీ 19 స్థానంలో నిలిచింది. దేశచరిత్రలో తొలిసారి ఒక రాజధాని నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యుత్తమ భూ సమీకరణ విధానంతో 33,811 ఎకరాలు సమీకరించిందని నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) కొనియాడింది.** రాయలసీమలో చేపట్టిన జల సంరక్షణలో శిక్షణ కార్యక్రమాన్ని 'నీతి ఆయోగ్' మెచ్చుకుంది. మత్స్య సంపదను పెంచేందుకు అనుసరించిన విధానంతో ఫిషరీస్ (మత్స్యశాఖ) ఆదాయం 2015-16లో 3 రెట్లు పెరిగిందని మన రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించింది. రియల్ టైమ్ మేనేజ్‌మెంట్ (ఆర్టీజీ)లో భాగంగా సీఎం డ్యాష్ బోర్డు కింద ముఖ్య రంగాల పనితీరును ఒకే చోట తెలుసుకొనేందుకు వీలుకలిగింది. అన్ని శాఖలు, పథకాలు, కార్యక్రమాల అమలు గురించి పూర్తి లెక్కలు ముఖ్యమంత్రి నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకూ అందరికీ అందుబాటులో ఉన్నాయి. పారదర్శకతకు ఇదే నిదర్శనం.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పుల పంపిణీకి అమలుచేస్తున్న ఎలక్ట్రానిక్ పేమెంట్ విధానంతో అవినీతి తగ్గింది. విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి. మరోవైపు రవాణాశాఖ డిజిటలీకరణవల్ల పారదర్శకత, జవాబుదారీతనం వచ్చింది. వాహన వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతోంది. ఇంకా **'డయల్ ఏపీ', 'మన రాష్ట్రం', 'టెలీహెల్త్', 'ఇ-ఎడ్యుకేషన్', 'హరిత' వస్తున్నాయి. ఇవన్నీ సుపరిపాలన కోసమే. త్వరలో 'ఇ-మండీ', సిటిజన్ ఇన్ బాక్స్', 'డిజిటల్ లిటరసీ', 'ఇ-ఎస్‌హెచ్‌జీ', 'స్మార్ట్ సిటీ', 'స్మార్ట్ గ్రిడ్' తదితర సేవలన్నీ రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.** ప్రజారోగ్యం, పాఠశాలల్లో డ్రాప్ అవుట్ రేటు తదితర ప్రామాణికాల నిర్ధారణకు 'ఇ-ప్రగతి' ప్రాజెక్టు తోడ్పడుతుంది. 'మీ సేవ', 'సీఎం డ్యాష్‌బోర్డు', 'మీ భూమి' తదితర కామన్ అప్లికేషన్లతో పాటు ఆర్థిక, సీఆర్డీఏ, పట్టణాభివృద్ధి వంటి ప్రభుత్వ శాఖల సమగ్ర సమాచారాన్ని పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. అన్ని ప్రభుత్వ శాఖల, రాష్ట్రంలోని భూమి, లేఅవుట్లు, ఇళ్లు, రోడ్లు, దేవాలయాలు, భూగర్భజలాలు.. ఇలా ఒక్కటేమిటి సమగ్ర సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆయా శాఖల వెబ్‌సైట్లలో పొందుపరుస్తోంది. ఈ ప్రక్రియ శరవేగంగా జరిగిపోతోంది. ఇప్పటికే కొన్ని శాఖలు తమ పరిధిలోని సమాచారాన్ని చాలా వరకు వెబ్ సైట్లలో ప్రజలకు అందుబాటులో ఉంచాయి. పట్టణ గ్రామీణ ప్రణాళికా శాఖ (డీటీసీపీ - డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) వెబ్ సైట్‌లో రాష్ట్రంలోని సీఆర్‌డీఏ నుంచి పట్టణాభివృద్ధి సంస్థలు, నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలలో మాస్టర్ ప్లాన్లు, అనుమతి ఉన్న లే ఔట్ల సమాచారాన్ని ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఉంచింది. ఆయా ప్రాంతాలలో లేఅవుట్లు, భవన నిర్మాణాలు, గ్రూప్ హౌస్ లు లాంటి అన్ని రకాల అనుమతులకు కావలసిన దరఖాస్తులు ఉన్నాయి. ఇలా ప్రతి శాఖకు చెందిన పూర్తి సమాచారంతోపాటు ప్రతి పౌరుడి సమాచారాన్ని డిజిటలైజ్ చేసే బాధ్యతను ప్రభుత్వం స్వీకరించింది. కైజాలా అనే యాప్‌కు మెరుగులు దిద్ది 'కనెక్ట్ ఆంధ్రప్రదేశ్ సీఎం' అనే యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. పరిపాలనపై తమ అభిప్రాయాలను ప్రజలు ముఖ్యమంత్రితో నేరుగా చెప్పడానికే ఈ యాప్ ఉపయోగపడుతోంది. ప్రభుత్వానికి 360 డిగ్రీల్లో సమాచారం కావాలి. ఈ ప్రక్రియలో ఈ యాప్ ఓ మైలురాయి. సంక్షోభ ఆంధ్రప్రదేశ్ సంక్షేమ ఆంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకుంటోంది. 2022 నాటికి ఆంధ్రప్రదేశ్ దేశంలోని 3 అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

-శిరందాసు నాగార్జున, 9440222914

స్త్రీ స్వేచ్ఛకు సంకెళ్ళు తెగుతున్నాయ్!

భారత న్యాయ వ్యవస్థపై ఒక్కసారిగా సామాన్య ప్రజానీకానికి గౌరవం పెరిగింది. మూడుసార్లు తలాక్ చెప్పి వివాహబంధానికి అత్యంత సులువుగా చెల్లుచీటి ఇవ్వడం చట్టవిరుద్ధం, రాజ్యాంగ వ్యతిరేకమే గాక పవిత్ర ఖురాన్ ప్రబోధానికి కూడ పూర్తి వ్యతిరేకం అంటూ సుప్రీం కోర్టు ఆగస్టు 22న వెలువరించిన తీర్పు ముస్లిం మహిళలకే గాక యావత్ మహిళాలోకానికి గొప్ప ఆశాభావాన్ని కలిగించింది. తలాక్ అనేది మెజారిటీకి మైనారిటీకి సంబంధించిన అంశం కాదు. ఇది కేవలం ముస్లిం పురుషులు, అభాగ్య ముస్లిం వనితల మధ్య వందల సంవత్సరాలుగా ఉన్న సమస్య. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన 395 పేజీల సంచలనాత్మక తీర్పును దేశవ్యాప్తంగా అభ్యుదయవాదులతో పాటు అన్ని రాజకీయ పక్షాలు స్వాగతించాయి.


ప్రముఖ రచయిత కొడవటిగంటి కుటుంబరావు అన్నట్లు సంఘంలో సంస్కార స్థాయి పెరగాలి. అప్పుడు చట్టం చేయాల్సిన పని సంస్కారమే చేస్తుంది. ఈ రోజు సతీసహగమనం చేయకూడదని చట్టం చేయాల్సిన అవసరం లేదు. ఈ సాంఘిక దురాచారం రూపుమాపేందుకు రాజారామమోహనరాయ్ లాంటి ఎందరో సంఘ సంస్కర్తలు చేసిన పోరాటాలు మనకు స్ఫూర్తిని కలిగిస్తాయి. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు కీ.శే. ఎన్.టి.రామారావు చట్టం చేసేవరకు మన రాష్ట్రంలో ఆడపిల్లలకు పురుషులతో సమాన ఆస్తి హక్కు లేదు. స్త్రీ హక్కుల సాధనలో మనం గడిచిన 32 ఏళ్ళ కాలంలో చూస్తే రెండు ముఖ్యమైన తీర్పులున్నాయి. సిరియన్ క్రిస్టియన్ కమ్యూనిటీకి చెందిన స్త్రీలకు కుటుంబ ఆస్తిలో వాటా లేదు. ట్రావెన్కూరు సంస్థాన వారసత్వ చట్టం 1915 ప్రకారం కేరళలో మహిళలకు కుటుంబ ఆస్తిలో వాటా లేదు. భారత వారసత్వ చట్టం 1925 ప్రకారం కేరళ మినహా దేశవ్యాప్తంగా ఈ కమ్యూనిటీకి మహిళలకు ఆస్తి హక్కు ఉంది. తన సోదరులు కుటుంబ ఆస్తిలో వాటా ఇవ్వకపోవటంపై మేరీ రాయ్ కేరళ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసు వేసి తన హక్కు సాధించుకుంది. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ పి.ఎన్.భగవతి ఫిబ్రవరి 24, 1986న కుటుంబ ఆస్తిలో మేరీరాయ్‌కు వాటా ఇవ్వాలని తీర్పు ఇచ్చారు. సాహిత్యంలో బుకర్ ప్రైజ్ పొందిన అరుంధతీరాయ్‌కు మేరీరాయ్ తల్లి.

1993లో కామన్‌వెల్త్ ప్రైజ్‌ను తన తొలిసాహిత్య రచనకు పొందిన గీతాహరిహరన్ ఆమె భర్త కలిసి వేసిన కేసులో బిడ్డకు తల్లే సహజ సిద్ధమైన సంరక్షకురాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. హిందూ వారసత్వ చట్టం 1956లో మహిళలకు వ్యతిరేకంగా ఉన్న సెక్షన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. సమానత్వం కోసం మహిళలు చేసే పోరాటం పురుషులకు వ్యతిరేకమైంది కాదు.

తలాక్ బారినపడి పండంటి జీవితానికి దూరమైన సైరాబానో, గుల్షన్ పర్వీన్, ఇష్రాత్ జహాన్, అఫ్రీన్ రహమాన్, అతియా సబ్రీలతోపాటు భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ కూడా ముమ్మార్లు తలాక్‌కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టును ఆశ్రయించి ఈ చారిత్రాత్మక తీర్పు పొందారు. మన దేశ జనాభాలో 8 శాతానికి పైగా ఉన్న ముస్లిం మహిళలకు ఈ తీర్పు ఎంతో ఊరట కలిగించింది. మతపరమైన, భావోద్వేగాలతో కూడిన అంశం కావడంతో సుప్రీం కోర్టు తీర్పుపై ఎంతో ఉత్కంఠ కలిగింది. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో ముగ్గురు న్యాయమూర్తులు తలాక్ రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేయగా ఇద్దరు మాత్రం రాజ్యాంగంలో మత స్వేచ్ఛను పేర్కొన్న ఆర్టికల్ 25, న్యాయవ్యవస్థ నిగ్రహ అవసరాన్ని వివరించిన ఆర్టికల్ 142ను ప్రస్తావించి ఆరు నెలల్లో చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి నిర్దేశించారు. అయితే మెజారిటీ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులు దీనిని తోసిపుచ్చడంతో తలాక్ విధానం రద్దుచేస్తూ ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు.

మతం పేరుతో సాగే ఛాందస, సంప్రదాయ పద్ధతులను రూపుమాపడంలో కోర్టు తీర్పులను, ప్రభుత్వ చట్టాలను పరిమిత పాత్రగా ప్రజలు మార్చరాదు. వరకట్న చట్టం చేసి ఎన్నో ఏళ్ళయినా ఇంకా వేళ్ళూనుకుని వున్నట్లుగా కాకుండా ప్రజలు, ముఖ్యంగా మహిళాలోకం చైతన్యవంతంగా వుండాలి. 1985లో షాబానో మనోవర్తి కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన సంచలనాత్మక తీర్పును నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ ముస్లింలను బుజ్జగించేందుకు ఆ తీర్పును నీరుగారుస్తూ 1986లో చేసిన ప్రొటెక్షన్ ఆన్ డైవర్స్ యాక్ట్ - 1986ను గుర్తుంచుకోవాలి. మత ఛాందసానికి మరోపేరైన పాకిస్తాన్, 96 శాతం ముస్లిం జనాభా వున్న పాకిస్తాన్ 1961లోనే ముమ్మారు తలాక్ విధానాన్ని నిషేధించిందంటే లౌకిక విధానం పేరుతో ఈ అంశంపై ఎంత సాచివేత ధోరణి అవలంభించామో అర్థం అవుతుంది. ముమ్మారు తలాక్ విధానాన్ని ఎప్పుడో నిషేధించిన దేశాలు 19 ఉండగా ఇందులో ముస్లింలు అధికంగా ఉన్న ఈజిప్టు, బంగ్లాదేశ్, ఇండోనేషియా, టర్కీ, ఇరాన్ దేశాలు కూడా ఉన్నాయి. మూర్ఖపు ఆచారాలు, గుడ్డి విశ్వాసాలపై మహిళలు సాధించిన ఘన విజయం ఇది. తలాక్ అంశంపై చూపిన చొరవను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 33 శాతం మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదంలో కూడా చూపించాల్సిన అవసరం ఎంతో ఉంది. తలాక్‌తో ముస్లిం మహిళలు మాత్రమే గాక, సరళీకరణ విధానాలతో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమై పెరిగిన పని భారం, ఒత్తిడి కారణంగా చిన్న చిన్న కారణాలతో విడాకులు తీసుకుంటున్న సంఖ్య ఇతర వర్గాల్లో కూడా పెరిగిపోయింది. మత దురాచారాలను తిరస్కరించడంతో పాటు, మానవ సంబంధాలను మంట కలుపుతున్న విధానాలపై కూడా పోరాటం అవసరం. అప్పుడు మాత్రమే స్త్రీ స్వేచ్ఛకు, పురోగమనానికి అడ్డుకట్టగా ఉన్న సంకెళ్ళు తెగటంతో పాటు మహాకవి గురజాడ చెప్పినట్లుగా స్త్రీ ఆధునిక మహిళగా మారి చరిత్ర తిరగరాయగలదు.

-పోతుల సునీత, ఎంఎల్సీ



డేరాలు ఖాళీ..

●బాబా లేక వెలవెల ●ఆశ్రమాల్లోంచి బయటకెళ్తున్న భక్తులు ●రెండ్రోజుల్లో 6,500 మంది పయనం

సిర్సా(హర్యానా) : నిన్న మొన్నటి వరకు కనుచూపుమేర జనం.. ఎక్కడ చూసిన ప్రవేట్ దళాలతో కిక్కిరిసిపోయిన డేరా చీఫ్ పాత ప్రధాన కార్యాలయం ఇప్పుడు బోసిపోయింది. డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కు 20 ఏళ్ల జైలు శిక్షపడటంతో రెండ్రోజుల్లోనే దాదాపు 6500 మంది గుర్మీత్ అనుచరులు ప్రధాన కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ఇక డేరాబాబా కొత్త కాంప్లెక్స్‌ను వదిలివెళ్లేందుకు 200 మంది మాత్రం ఇష్టపడటం లేదు. బాబా అనుచరులు ఎలాంటి దాడులకైనా తెగిస్తారని ఆర్మీ, భద్రతా సిబ్బంది డెరా కొత్త, పాత ప్రధాన కార్యాలయాల వద్ద మొహరించాయి. అయితే గుర్మీత్ సింగ్ శిక్షతర్వాత కూడా సిర్సాలో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదని అధికారులు వెల్లడించారు. డేరాబాబాకు చెందిన కొత్త కాంప్లెక్స్‌కు 500 మీటర్ల దూరంలో ఆర్మీ బారికేడ్లు ఏర్పాటుచేసింది. కొత్త కాంప్లెక్స్ లో ఉన్న వారంతా గుర్మీత్ సింగ్ దగ్గర పనిచేసినఉద్యోగులేనని సిర్సాడిప్యూటీ కమిషనర్ ప్రబోజోతేసింగ్ తెలిపారు. డేరా ప్రధాన కార్యాలయాల నుంచి తిరిగివెళ్లిపోయే వారికోసం బస్సులు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.కొంతమంది మైనర్ బాలికలు కూడా డేరా కాంప్లెక్స్ లను వదిలిపెట్టేందుకుఇష్టపడకపోయిన సిబ్బంది ద్వారా వారిని సొంత ప్రాంతాలకు తరలించేందుకుపోలీసులు ఏర్పాట్లుచేశారు.

డేరా సామ్రాజ్యంలో ఫిల్మ్ సిటీ

డేరా సచ్చాసౌదా చీఫ్ గుర్మీత్ సింగ్ స్టయిలే వేరు. ఆయన తలచిందేదైనా దరి చేరాల్సిందే. అందుకే తన సామ్రాజ్యాన్ని బయటి ప్రపంచంతో అవసరం లేనంతగా విస్తరించారు. బాబా డేరాలో దేనికీ కొదవలేదు. సినిమా తీయాలన్నా కావల్సినన్ని సౌకర్యాలు అక్కడ అందుబాటులో ఉంచారు. తాను నటించిన సినిమాల షూటింగ్స్ లో ఎక్కువ శాతం తన సామ్రాజ్యంలోనే జరిగేలా ఏర్పాట్లు చేసుకున్నాడు. మెసేజ్ ఆఫ్ గాడ్, మెసేజ్ ఆఫ్ గాడ్-2 వంటి సినిమాలే కాకుండా జట్టు ఇంజనీర్ అండ్ హింద్ కా నపక్ కో జవాబ్ వంటి చిత్రాలు డేలారాల్లో షూట్ చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే డేరా బాబా కార్యాలయాలే ఫిల్మ్ సిటీల్లా ఉంటారు. త్వరలో విడుదల కాబోతున్న ఆన్‌లైన్ గురుకుల్ సినిమా కూడా ఎక్కువ శాతం బాబా సంస్థానంలోనే షూట్ చేయించారు. స్క్రిప్టుకు తగ్గట్టుగా సెట్స్ వేయడం అక్కడ సిబ్బందికి అలవాటైపోయింది. బయటి వ్యక్తుల ప్రమేయం లేకుండా బాబా సంస్థానంలో సినిమాలు షూటింగ్ చేసేవారు. సినిమా పూర్తయిన తర్వాత అక్కడే ఉన్న పెద్దపెద్ద తెరల్లో ప్రివ్యూ షోలు చూపించి...వాటిని జనాల్లోకి తీసుకుపోవాలని చెప్పేవారని గుర్మీత్ సింగ్ దగ్గర పనిచేసిన వారు చెబుతున్నారు. బాబా నటించిన సినిమాలకు అనూహ్య స్పందన వచ్చేలా కృషి చేయాలని అనుచరులకు, భక్తులకు హుకుం జారీ చేసేవారని తెలిపారు.

12 గంటల పాటు కర్ఫ్యూ సడలింపు

అత్యాచారం కేసులో డేరాసచ్చా సౌద చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కు శిక్ష ఖరారైన తర్వాత ఎలాంటి అవాంచనీయ




ఘటనలు జరగకుండా సిర్సా వంటి ప్రాంతాల్లో పోలీసులు కర్ఫ్యూ విధించారు. అయితే ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సిర్సాలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కర్ఫ్యూను సడలించారు. సాధారణ పరిస్థితులు వచ్చే వరకు కర్ఫ్యూను దశగావారిగా ఎత్తివేస్తామని పోలీసులు తెలిపారు. అయితే స్థానికులు మాత్రం కర్ఫ్యూ వల్ల జనజీవనం స్తంభించిందని .. రోజువారీ కూలీలకు కూడా చాలా ఇబ్బందులు ఎదురౌతున్నాయని వాపోతున్నారు. కర్ఫ్యూను పూర్తిగా ఎత్తివేయాలని కోరుతున్నారు. కర్ఫ్యూ ఎత్తివేసిన సమయంలో విద్యాసంస్థలు యథావిధిగా నడుస్తున్నప్పటికీ ప్రజలు ఇళ్ల నుంచి భయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కర్ఫ్యూను పూర్తిస్థాయిలో ఎత్తివేయకపోవడం వల్ల.. ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న మళ్లీ ఆంక్షలు విధిస్తారన్న భయంతో జనం బిక్కుబిక్కుమంటున్నారు.

డేరాల నుంచి 18 మంది బాలికలకు విముక్తి

డేరా సచ్చాసౌదా చీఫ్ గుర్మీత్ సింగ్‌కు జైలు శిక్షఖరారైన తర్వాత అతడి చీకటి కోణాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఆధ్యాత్మికం ముసుగులో డేరా బాబా చేసిన అకృత్యాలు, దారుణాలు బయటి ప్రపంచానికి తెలుస్తున్నాయి. హర్యానాలోని సిర్సా డేరా ఆశ్రమంలో ఉన్న 18 మంది బాలికలకు అధికారులు విముక్తి కల్పించారు. వారిని డేరా నుంచి బయటకు తీసుకొచ్చి వెంటనే వైద్య పరీక్షలు చేయించారు. 18 మంది బాలికలూ 18 ఏళ్ల లోపు వారే ఉండటంతో వారిని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంరక్షణలో ఉంచారు. ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాక వారిని పిల్లల సంరక్షణ కేంద్రాలకు తరలిస్తామని సిర్సా డిప్యూటీ కమిషనర్ ప్రబోజోత్ సింగ్ తెలిపారు.

గుర్మీత్ వంటి వాళ్లతో ధార్మిక సంస్థలకు చెడ్డపేరు



ఇండోర్: డేరాసచ్చాసౌద చీఫ్ గుర్మీత్ సింగ్ లాంటివాళ్లు చేస్తున్న కార్యకలాపాలు మంచిలక్ష్యంతో నడిచే ధార్మిక సంస్థలకు కూడా చెడ్డపేరు తెచ్చేలా ఉన్నాయని యోగాగురు రాందేవ్ బాబా ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వాళ్ల వల్ల గత రెండు మూడేళ్లగా తమలాంటి వారెందరో ఇబ్బందిగా ఫీలవుతున్నామని చెప్పారు. దేశంలో కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్న బాబాల వల్ల సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే వారికి మనగుడలేకుండా పోతోందని అన్నారు. ఒక్క బాబా తప్పు చేస్తే మొత్తం ధార్మిక సంస్థలు నడిపేవారందరినీ తప్పుడు దృష్టితో చూడటం సరికాదన్నారు. అధ్యాత్మిక పేరుతో సంస్థలు ప్రారంభించే వారు ఒక్కసారి మన చరిత్ర పుటలను తిరగేస్తే అంత అవగత మౌతుందని సలహా ఇచ్చారు. రామ్ రహీమ్ లాంటివాళ్లు చేసిన నేరాలతో అందరు మత గురువులను ఒకేగాటికి కట్టడం సరికాదన్నారు. భారత సంస్కృతికి ప్రతీకగా చెప్పుకునే రాముడి పేరు పెట్టుకుని ఇలాంటిపనులకు పాల్పడటం మంచిది కాదన్నారు.



(ఫైల్ ఫోటో)

సెప్టెంబర్ 3న చైనాలో బ్రిక్స్ సదస్సు

● హాజరు కానున్న మోడీ ● అక్కడి నుంచి మయన్మార్‌కు..

బీజింగ్: డొక్లాం వివాదంలో భారత్, చైనాలు దౌత్య నీతి ప్రదర్శించిన నేపథ్యంలో వచ్చే నెల మూడో తేదీ నుంచి బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా కూటమి (బ్రిక్స్) సమావేశాలు జరుగుతున్నాయి. జియామిన్‌లో జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశం సఫలమవుతుందని చైనా ఆశాభావంతో ఉంది. భారత ప్రధాని మోడీ కూడా ఈ సమావేశానికి హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ మంగళవారం ప్రకటించింది. డొక్లాం నుంచి భారత్, చైనాలు తమ సైన్యాలను ఉపసంహరించుకున్న నేపథ్యంలో బ్రిక్స్ సమావేశం సఫలమవుతుందని ఇరు దేశాలూ ఆశిస్తున్నాయి. సెప్టెంబర్ మూడో తేదీ నుంచి జరగనున్న ఈ సమావేశాలకు జియామిన్ వెళ్లడానికి మోడీ సిద్ధమయ్యారు. అయితే.. రోడ్డు విషయమై కూడా చైనా మరో మెట్టు దిగినట్లు కనిపిస్తోంది. సోమవారం తమ ప్రయోజనాలకు అనుగుణంగా చేస్తామన్న చైనా విదేశాంగ ప్రతినిధి హువా చున్‌యింగ్, మంగళవారం అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కా రాన్ని శాంతియుత మార్గాల ద్వారా సాధిస్తామని చెప్పారు. తమది బాధ్యతాయుతమైన దేశమని చెప్పారు. బ్రిక్స్ సమా వేశమనేది అయిదు పెద్ద దేశాలకు కీలకమని, ఇందులో అందరి ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని ఆమె చెప్పారు. సరిహద్దుల్లో జీవన ప్రమానాలు పెంచడానికి చైనా మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఆమె చెప్పారు. మొత్తానికి తాము భారత్‌తో వివాదాన్ని పరిష్కరించుకున్నామని చెప్పారు. భారత్ కూడా డొక్లాం పరిష్కారం నేపథ్యంలో బ్రిక్స్ సమావేశంలో పాల్గొనడానికి సిద్ధమైంది. చైనా అధ్యక్షుడు భారత ప్రధాని మోడీ చైనాలోని పుజియాన్ రాష్ట్రంలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారని విదేశాంగ శాఖ ప్రకటించింది. చైనా నుంచి ప్రధాని మయన్మార్ వెళతారు. అక్కడ ఆ దేశ అధ్యక్షుడు యూ తిన్ క్యాతో సమావేశమవుతారు. మయన్మార్‌లో మోడీకిది మొదటి ద్వైపాక్షిక పర్యటన అవుతుంది.

డొక్లామ్ భారత్ దౌత్య విజయం

ఓర్పు, నేర్పుతో వ్యవహరించిన ఫలితమే ఇది : బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : డోక్లామ్ ప్రతిష్టంభన ప్రశాంతంగా ముగియడం భారత దౌత్య విజయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ అన్నారు. రెండు దేశాల సమస్యను అర్థం చేసుకుని, ఇరు దేశాల ప్రయోజనాల దృష్ట్యా డోక్లామ్ నుంచి నిష్క్రమించాయన్నారు. డోక్లామ్ అంశంపై క్షేత్రస్థాయిలో ధృడవైఖరిని ప్రదర్శించామని తెలిపారు. ఇది ఒకరి గెలుపు, మరొకరి విజయం కాదని రెండు దేశాలు చేసిన సమష్టి కృషి ఫలితమని విశ్లేషించారు. రెచ్చగొట్టే ప్రకటనలు చేయకుండా ప్రశాంతతను కనబ రుస్తూ హుందాతనంతో వ్యవహరించడం వల్లే సమస్య సమసిపోయింద న్నారు. దేశ ప్రయో జనాల విషయంలో రాజీ పడకుండా వివా దాలను దౌత్య మార్గంలో పరిష్కరించుకోవడమే తమ సిద్ధాంతమన్నారు. ఆయా దేశాలు వాటి సరిహద్దుల వద్ద పెట్రోలింగ్ జరపడం సాధారణ విషయమేనని అన్నారు.

'డొక్లామ్' శుభం కార్డుకు భూటాన్ హర్షం

న్యూఢిల్లీ: భారత్-చైనా - భూటాన్ మధ్య గల త్రికూడలి డొక్లామ్ ప్రతిష్టంభనకు శుభంకార్డు పడటంపై భూటాన్ హర్షం వ్యక్తం చేసింది.

చండీగఢ్ మరో పంచకుల కాకూడదు

● బాబాకు శిక్షపై హైకోర్టుకు వెళ్లే యోచనలో అనుచరులు ● చండీగఢ్‌లో భద్రత కట్టుదిట్టం ● ర్యాలీలు, రాస్తారోకోలకు అనుమతులు నిరాకరణ

చండీగఢ్: గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ను అత్యాచార కేసులో దోషిగా తేల్చిన వెంటనే అట్టుడికిన పంచకుల ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఈనెల 25న పంచకులలో జరిగిన హింస పంజాబ్,హర్యానా రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో పునరావృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని సీనియర్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుర్మీత్‌కు జైలు శిక్షనుంచి విముక్తి కల్పించాలని అతని తరపు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించడంతో పంచకుల సీన్ చండీగఢ్‌లో రిపీటౌతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పును హైకోర్టు కూడా సమర్థిస్తే చండీగఢ్‌లో అల్లర్లు, దాడులకు అవకాశం ఉండొచ్చని నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చినట్లు తెలియజేశారు. పంచకుల లాంటి హింసాత్మక ఘటనలు చండీగడ్‌లో పునరావృతం కాకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బాబా కేసుపై హైకోర్టు ఇచ్చే తీర్పునుసరించే ముందుకు కదలాలని గుర్మీత్ అనుచరులు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలియడంతో... కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ర్యాలీలు వంటివాటికి అనుమతులు ఇవ్వడం లేదు. గుంపులు గుంపులుగా ప్రజలు ఒక్కచోట చేరకుండా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే బాబాను సీబీఐ కోర్టు దోషిగా తేల్చిన రోజే చండీగఢ్ అధికారులు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలతో ఆరోజు రాజధానిలో ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగలేదు. బాబాకు అనుచరులైన వారిలో తమకు పరిచయం ఉన్న వారిని ముందుగానే హెచ్చరించారు. రాజధానిలో ఎలాంటి సమస్యలు సృష్టించరాదని...హింసాత్మక ఘటనలకు పాల్పడకూడదని సూచించారు.

రామ్‌పాల్ మీద రెండు కేసుల కొట్టివేత

మరో రెండు కేసుల్లో అనుకూల తీర్పు వస్తేనే జైలు నుంచి విముక్తి

హిసార్: ఒక బాబాకు శిక్ష పడిన 24 గంటల్లోపే మరో బాబా రెండు కేసుల్లో నిర్దోషిగా బయటపడ్డాడు. హిసార్‌కు చెందిన బాబా రామ్‌పాల్‌ను రెండు క్రిమినల్ కేసుల్లో కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. ఆయన నేనారికి పాల్పడ్డాడనడానికి సరైన ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. వినాయక చవితికి ముందు రోజే రావాల్సిన ఈ తీర్పు డేరా బాబా అనుచరులు సృష్టించిన ఉద్రిక్తతల వల్ల తీర్పును వాయిదా వేయాలని పోలీసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం తీర్పిచ్చారు. దీంతో ఈయనకు కూడా శిక్ష పడుతుంది కాబట్టే తీర్పును వాయిదా వేసారని ఊహాగానాలు బయలుదేరాయి. అయితే.. అందుకు విరుద్ధంగా రామ్‌పాల్ మీద ఉన్న రెండు కేసులను హిసార్ జుడిషియల్ మేజిస్ట్రేటు ముఖేశ్ కుమార్ కొట్టివేసారు. నవంబర్ 17, 2014న రామ్‌పాల్‌తో పాటు ఆయన అనుచరుల మీద ప్రభుత్వోద్యోగిని విధులు నిర్వహించకుండా అడ్డుకున్నందుకు సెక్షన్ 186 ప్రకారం కేసు పెట్టారు. ప్రభుత్వోద్యోగిని గాయపర్చినట్లు కూడా ఆరోపణలు చేసారు. మరునాడే రామ్‌పాల్ తో పాటు మరో 40 మంది మీద దొమ్మీ, అనుమతి లేని సమావేశం కేసులు నమోదయ్యాయి. ఆయనను అరెస్టు చేయడానికి పోలీసులు వెళ్లినప్పుడు ఆయన అనుచరులు 15,000 మంది రామ్‌పాల్‌ను చుట్టుముట్టి పోలీసులను ఎదిరించారు. ఈ గొడవలో ఐదుగురు మరణించారు. తనను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులతో వెళ్లడానికి నిరాకరించడమే కాక, కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు రాగా, 43 సార్లు వాటిని ధిక్కరించారు. ఈ కేసుల్లో నిర్దోషిగా నిరూపితమైనా, కుట్ర కేసుతో పాటు మరో కేసులోనూ ఆరోపణలున్నందున ఆయా కేసుల్లో నిర్దోషిగా తీర్పు వస్తేనే ఆయన జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం ఉంది.




చైనా తటస్థ వైఖరి!

బీజింగ్ : డొక్లామ్ ప్రతిష్టంభనకు సంబంధించిన అంశంపై చైనా వ్యూహం బెడిసికొట్టడంతో డ్రాగన్ ప్రస్తుతం తటస్థవైఖరిని ఎంచుకుంది. 73 రోజుల తర్వాత డొక్లామ్ వివాదానికి సోమవారం శుభంకార్డు పడటంతో చైనా కొంత ఇరుకున పడింది. భారత్-చైనా-భూటాన్ త్రికూడలిలో నిర్మిస్తున్న రోడ్లకు తాజా పరిణామాలతో బ్రేకు పడింది. సరిహద్దు ప్రాంతాల్లో జీవించే ఆ దేశ ప్రజానీకానికి డ్రాగన్ మెరుగైన జీవన ప్రమాణాలను అందజేసేందుకు నిర్మాణాలు చేపట్టినట్లువెల్లడించింది. అయితే, ఆ ప్రాంతంలో చైనా నిర్మాణాలు చేపడితే తమకు కూడా భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని వాదిస్తూ భారత్ అడ్డుకుంది. భూటాన్‌కు సాయంగా భారత సైన్యాలు డొక్లామ్ వద్ద రంగంలోకి దిగి చర్యలు ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా, సెప్టెంబర్ మొదటివారంలో బ్రిక్స్ సమావేశాలు ఉండటంతో అంతర్జాతీయ సమాజంలో చైనా అభాసుపాలు అవుతానని భావించి ఈ మేరకు నిర్ణయం తీసుకుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

కేంద్ర అఫిడవిట్ దాఖలు తరువాత రండి

రామసేతు మీద స్వామికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ: రామ సేతువు మీద కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసిన తరువాత తమ దగ్గరకు రావాలని బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్య స్వామిని కోర్టు ఆదేశించింది. పురాణ ప్రాశస్త్యమున్న రామ సేతువు గురించి తొందరగా విచారించాలని స్వామి పిటిషన్ వేసారు. దీంతో కేంద్రం ఈ విషయమై స్పందించిన తరువాతే ఆయన వాదన వింటామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. తమిళనాడుకు ఆగ్నేయంగా హిందూ మహా సముద్రంలో సున్నపురాయి గుట్టల శృంఖలాల కలయిక ఒక బ్రిడ్జిలా ఉంటుంది. అది రాముడు నిర్మింపచేసిన సేతువని హిందువుల విశ్వాసం. దాన్ని తొలగించేసి ఓడల కోసం సేతు సముద్రం రహదారి నిర్మించాలని ప్రతిపాదన కూడా ఉంది. ఆ ప్రతిపాదనను సుబ్రహ్మణ్య స్వామి వ్యతిరేకిస్తున్నారు. కేంద్రం కూడా రామ సేతువును నాశనం చేసే ప్రసక్తి లేదని ఇప్పటికే చెప్పేసింది. అయినా.. కేంద్రం అఫిడవిట్ దాఖలు చేస్తే కానీ తాము స్వామి వాదనలను వినబోమని న్యాయమూర్తులు స్పష్టం చేసారు.

ఈసీ తలుపు తట్టిన దినకరన్

పార్టీ గుర్తు విషయంలో తన వాదన వినాలని వినతి

న్యూఢిల్లీ: తమిళనాట రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. అధికార అన్నాడీఎంకే పార్టీలో వైరి వర్గాల మధ్య తలెత్తిన విభేదాలు పార్టీని చీల్చేవరకూ వెళ్లాయి. పళని, పన్నీరు పెత్తనాన్ని జీర్ణించుకోలేకపోతున్న శశికళ వర్గం పార్టీని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకునేందుకు పావులు కదుపుతోంది. పార్టీ జిల్లాల కార్యదర్శి పదవుల నుంచి సీఎం పళని సహా కీలక నేతలందరినీ తొలగించిన అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ దినకరన్..మరోసారి ఎన్నికల కమిషన్ తలుపుతట్టారు. పార్టీ గుర్తు(రెండాకులు)ను ఏ వర్గానికి కేటాయించాలో నిర్ణయించే ముందే తన వాదన కూడా వినాలని ఎన్నికల కమిషన్‌ను అభ్యర్థించారు. దినకరన్ కు అన్నాడీఎంకే కర్నాటక యూనిట్ చీఫ్ పుగొహెందీ మద్దతు పలుకుతూ ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ గుర్తుపై ఎన్నికల సంఘం పోల్ ప్యానల్ ఏ నిర్ణయం తీసుకునేముందు తమ వాదన వినాలని వినతిపత్రంలో దినకరన్ పేర్కొన్నారు. పన్నీర్,పళనిలు ఎన్నికల కమిషన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని.. అన్నాడీఎంకే పార్టీ ముఖ్యనేతలు శశికళ, దినకరనే అన్న విషయాన్ని గుర్తుచేశారు.

పెద్దల సభలో ఎన్డీయే సెంచరీ

● కాషాయ కూటమిలోకి అన్నాడీఎంకే, జేడీయూ చేరిక ● హాఫ్ మార్క్‌కు 21 మంది సభ్యుల దూరంలో ఎన్డీయే ● మరో ఏడాదిలోగా ఎగువ సభకు 10 మంది బీజేపీ సభ్యులు

న్యూఢిల్లీ: కొత్త మిత్రుల చేరిక బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరింత శక్తివంతమైంది. పెద్దల సభలో నామ మాత్రంగా ఉన్న బలాన్ని పెంచుకోవడంపై దృష్టిసారించిన ప్రధాన మంత్రి మోడీ, ఆ దిశగా చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. కొత్తగా నితీశ్ నేతృత్వంలోని జేడీయు, తమిళనాట వర్గపోరుతో సతమతమైన అన్నాడీఎంకే పార్టీలు ఎన్డేయే కూటమిలో చేరాయి. దీంతో ఎగువ సభలో కాషాయ కూటమి బలం వంద మార్కును అధిగమించింది. ప్రస్తుతం సాంకేతికంగా వీరి సంఖ్యాబలం 102కు చేరింది. అయినప్పటికీ ఇక్కడ ప్రతిపక్షాలదే పైచేయిగా ఉంది. 117 మంది సభ్యులతో ఎన్డీయే వ్యతిరేక పార్టీలు పెద్దలసభలో స్వల్ప ఆధిక్యంతో ఉన్నాయి. దీనికితోడు మరికొన్ని తటస్థ పార్టీలు, ముఖ్యంగా ఎస్పీ, జేడీయూ, ఎన్‌సీపీ తమకు అనుకూలమైన రీతిలో అడుగులేస్తూ, కొన్నిసందర్భాలలో ప్రభుత్వాన్ని ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయి.

ఎన్డీయేకు 102 మంది సభ్యులు..

ప్రస్తుతం రాజ్యసభలో బీజేపీకి సొంతంగా 57 మంది సభ్యులున్నారు. జేడీయూ నుంచి 10 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అన్నాడీఎంకే నుంచి 13 మంది, టీడీపీ నుంచి 6గురు, శివసేన,అకాళీదళ్ పార్టీల నుంచి ముగ్గురేసి ఎంపీలు రాజ్యసభలో ఉన్నారు. ఇక పీడీపీ సభ్యులు ఇద్దరు కూడా ఎన్డీయే కూటమిలోని వారే. వీరితోపాటు 12 మంది నామినేటెట్ సభ్యుల్లో నలుగురు బీజేపీ హయాంలో నామినేటెడ్ అయినవారున్నారు. మిగతా 8 మంది యూపీఏ హయాంలో నామినేటెడ్ అయ్యారు. వీరిలో చాలా మంది పదవీకాలం కొద్దికాలంలో ముగియనుంది. కాగా, ఏదైనా కీలక సమయంలో ఓటింగ్ అనివార్యమైతే బయట నుంచి టీఆర్ఎస్ (3), వైకాపా (1), ఐఎన్ఎల్‌డీ (1), మరికొందరు స్వతంత్రుల మద్దతు బీజేపీకి లభిస్తుంది. ఎనిమిది మంది సభ్యులున్న బీజేడీ (బిజూ జనతాదళ్) తటస్థంగా ఉంటూ, అంశాలవారీ మద్దతు పేరుతో ప్రభుత్వానికి అండగా నిలిచే పరిస్థితులున్నాయి. మొత్తంగా ఇప్పుడు పెద్దల సభలో బీజేపీ పెద్దన్న పాత్రకు దాదాపు అర్హత సాధించింది.

కాంగ్రెస్ సంఖ్యా బలం - 57

గత రెండేళ్లల కాలంలో పెద్దల సభలో కాంగ్రెస్ పార్టీ ప్రాభవం క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. 65 మంది సభ్యులున్న ఆ పార్టీ సంఖ్యాబలం ఇప్పుడు 57కి చేరింది. బీజేపీతో సరిసమానంగా నిలిచింది. రెండేళ్లకాలంలో వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం చెందడమే ఎగువ సభలో సంఖ్యాబలం తగ్గడానికి ప్రధాన కారణం. దానికి తోడు ఏటా కొంత మంది రిటైర్ అవుతున్నా, తిరిగి ఆ స్థానాలను భర్తీ చేసుకోవడం కాంగ్రెస్‌కు కష్టతరంగా మారుతోంది. 18 పార్టీల మిత్రులతో కలిపి రాజ్యసభలో యూపీఏదే పైచేయిగా ఉంది. యూపీఏలో ఎస్పీ (18), తృణమూల్ (13), సీపీఎం (7), బీఎస్పీ (5), ఎన్‌సీపీ (5), డీఎంకే (4), ఆర్జేడీ (3), సీపీఐ, జేఎంఎం, కేసీఎం, జేడీఎస్, ఐయూఎంఎల్ పార్టీల నుంచి ఒక్కొక్క సభ్యుడు ఉన్నారు. కాగా, ఎగువ సభలో ప్రస్తుతం మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

ఆడపిల్ల పుట్టిందని తలాక్.. తలాక్.. తలాక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ట్రిపుల్ తలాక్ చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు వారం రోజుల క్రితం సంచలన తీర్పుని వెలువరించినా ఓ వ్యక్తి భార్యకు తలాక్ చెప్పిన ఉదంతం భాగ్యనగరంలో వెలుగుచూసింది. తన భార్యకు ఆడపిల్ల పుట్టిందనే నెపంతో తలాక్ చెప్పిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. భర్త, అత్త, మామ సహా ఎనిమిది మందిపై చార్మినార్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మగపిల్లాడి కోసం బాబా వద్ద వైద్యం చేయించుకోవాలంటూ భర్త హుస్సేన్ ఒత్తిడి తీసుకురావడంతో నకిలీ బాబా వద్దకు వెళ్లగా.. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాబా వద్ద వైద్యం చేయించుకోనని భర్తకు తేల్చి చెప్పింది. దీంతో ఆడపిల్ల పుట్టగానే హుస్సేన్ ట్రిపుల్ తలాక్ నోటీసుల్ని పంపాడు. ఘటనపై బాధితురాలి పోలీసులను ఆశ్రయిం చడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నకిలీ బాబా సహా ఏడుగురిని అరెస్టు చేశారు.

పట్టాలు తప్పిన దురంతో..

అసంగావ్: నాగ్‌పూర్-ముంబై దురంతో ఎక్స్ ప్రెస్ పట్టాలు తప్పింది. మంగళవారం ఉదయం వసింద్, అసంగావ్ స్టేషన్ల మధ్య కొండ చరియలు విరిగి పడడం కారణంగా రైలు పట్టాలు తప్పింది. ఇది పది రోజుల్లో ప్రమాదానికి గురైన నాలుగో రైలు కావడం గమనార్హం. ఈ ప్రమాదంలో ఎవరికీ తీవ్ర గాయాలైన సమాచారం లేదని మధ్య రైల్వే ప్రధాన పీఆర్వో సునీల్ ఉదాసీ చెప్పారు. రైలు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా కొండ చరియలు విరిగిపడడంతో డ్రైవర్ ఎమర్జెన్సీ బ్రేకులు వేసాడని ఉదాసీ తెలిపారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని, ఆయన వివరించారు. ఇంజన్‌తో సహా తొమ్మిది బోగీలు ఈ దుర్ఘటనలో పట్టాలు తప్పాయి. ఈ రైల్లో మొత్తం 18 బోగీలున్నాయి. దుర్ఘటన సమయంలో రైల్లో ఉన్న పీటీఐ విలేకరి జస్టిన్ రావ్ ఏ-2 కోచ్‌లో ప్రయాణిస్తున్నారు. చాలా మంది ప్రయాణికులు అప్పటికి ఇంకా నిద్రిస్తున్నారని, ఉదయం ఆరున్నరే కావడంతో అందరూ నిద్ర లేవలేదని ఆయన చెప్పారు. నిద్రిస్తుండగా పెద్ద కుదుపు వచ్చిందని, లేచి చూసేసరికి బోగీలు పట్టాలు తప్పి ఉన్నాయని చెప్పారు. కొందరు వాష్‌రూమ్‌లలో చిక్కుకుపోయారని తెలిపారు. వారు కిటికీల అద్దాలను పగులగొట్టి బయటకు వచ్చారని చెప్పారు. వెంటనే ప్రయాణికులను తరలించడానికి బస్సులను, టాక్సీలను ఏర్పాటు చేసారన్నారు.



లక్ష్యాన్ని మించిన జీఎస్‌టీ వసూళ్లు: అరుణ్‌జైట్లీ



న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జీఎస్టి) మొదటి నెల వసూళ్లు లక్ష్యాన్ని మించిపోయాయని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. కేంద్రప్రభుత్వం జులై నెల జీఎస్టి వసూళ్లు రూ.91వేలకోట్లు లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటి వరకు రూ.92,283 కోట్లు వసూళ్లయ్యాయని, జీఎస్టి గణాంకాలను ప్రజల ముందుంచితే ప్రతి ఒక్కరికి కొత్త చట్టం వల్ల ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో తేలిగ్గా అర్థం అవుతుందని చెప్పారు. 72.33 శాతం మంది పన్ను చెల్లింపుదారులు జీఎస్టికి మారారని, వారిలో 64.42 శాతం మంది పన్ను చెల్లింపుదారులు పన్ను చెల్లింపు చేశారని ఆయన అన్నారు. సీజీఎస్‌టి ద్వారా రూ.14,874 కోట్లు, ఎస్‌జీఎస్‌టి ద్వారా రూ.22,722కోట్లు, ఐజీఎస్‌టి ద్వారా రూ.47,469 కోట్లు, ఐజీఎస్‌టి దిగుమతుల ద్వారా రూ.20,964 కోట్లు వసూళ్లయ్యాయని అన్నారు. ఐజీఎస్‌టి ద్వారా వచ్చిన వసూళ్లలో కేంద్రం, రాష్ట్రం పంచుకుంటాయన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల వరకు 38.38 లక్షల మంది జీఎస్టి రిటర్న్లు ఫైల్ చేశారని జైట్లీ పేర్కొన్నారు. మొత్తం 59.57 లక్షల మంది రిటర్న్లు దాఖలు చేయాల్సి ఉందన్నారు. ఫైలింగ్ ఆలస్యం చేస్తే రోజుకు రూ.100 చొప్పున జరిమానా విధిస్తారని ఆయన తెలిపారు.

32వేల కోట్లు హచ్‌కు పన్నుపోటు

• వొడాఫోన్‌కు హచిసన్‌ను విక్రయించినందుకు



హాంగ్‌కాంగ్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న హచిసన్‌కు రూ.32,320 కోట్ల పన్నునోటీసును ఆదాయపు పన్ను శాఖ పంపింది. బ్రిటన్‌కు చెందిన వోడాఫోన్ గ్రూపునకు భారత్‌లోని మొబైల్ వ్యాపారాన్ని 1100 కోట్ల డాలర్లు విక్రయించినందుకు క్యాపిటల్ గెయిన్‌టాక్స్ కట్టాలని పన్ను డిమాండ్ నోటీసు సారాంశం.

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను శాఖ హాంగ్‌కాంగ్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న హచిసన్‌కు రూ.32,320 కోట్ల పన్నునోటీసును పంపింది. బ్రిటన్‌కు చెందిన వోడాఫోన్ గ్రూపునకు తమ మొబైల్ వ్యాపారాన్ని 1100 కోట్ల డాలర్లు విక్రయించినందుకు క్యాపిటల్ గెయిన్‌టాక్స్ కట్టాలని పన్ను డిమాండ్ నోటీసు సారాంశం.

హాంగ్‌కాంగ్‌కు చెందిన బిలియనీర్ సీకె హచిసన్ హోల్డింగ్ లిమిటెడ్ చీఫ్ లీ కా షింగ్ హాంగ్‌కాంగ్ స్టాక్‌ఎక్స్ఛేంజీకి ఈ విషయం తెలియజేశారు. కాగా భారత ఆదాయపు పన్ను శాఖ హచిసన్ టెలికమ్యూనికేషన్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (హెచ్‌టీఐఎల్)కు టాక్స్ డిమాండ్ రూ.7,900 కోట్లు రూ.16,430 కోట్లు వడ్డీ, మరో రూ.7,900 కోట్లు జరిమానా కింద లెక్కగట్టి మొత్తం రూ.32,320 కోట్ల నోటీసు పంపించింది. అయితే సీకె హచిసన్ మాత్రం ఆదాయపు పన్ను శాఖ వాదనతో విభేదిస్తోంది.

భారత ప్రభుత్వం మొట్టమొదటిసారి హాంగ్‌కాంగ్‌కు చెందిన హచిసన్‌కు పన్ను డిమాండ్ నోటీసును పంపింది. అలాగే వోడాఫోన్ నుంచి పన్ను రాబట్టుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తోంది కూడా. ఒక్క వోడాఫోన్ విషయానికి వస్తే ప్రారంభంలో రూ.7,900 కోట్ల పన్ను డిమాండ్‌ను నోటీసును పంపించింది. హచిసన్‌సన్ డీల్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుకు గాను ఈ డిమాండ్ నోటీసును పంపింది. ప్రస్తుతం ఇది వడ్డీ, జరిమానాతో కలిపి రూ.20 వేల కోట్లను దాటిపోయింది. అటు తర్వాత 2012లో వోడాఫోన్‌ను సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. కోర్టు కూడా వోడాఫోన్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిపోయాయి. హచిసన్‌కు చెందిన భారత్ ఆస్తులను వోడాఫోన్ కొనుగోలు చేస్తే దాని వోడాఫోను ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని తీర్పు ఇచ్చింది. ఇలాంటి పాత పన్ను బకాయిల విషయానికి వస్తే బ్రిటన్‌కు చెందిన కెయిర్న్ ఎనర్జీ పీఎల్‌సీకి కూడా ఆదాయపు పన్ను శాఖ రూ.10,2478 కోట్ల పన్ను డిమాండ్ నోటీసును పంపించింది. ప్రస్తుతం ఈ అంశం అంతర్జాతీయ కోర్టులో నానుతోంది.

తాజా నిర్ణయం ఈజ్ ఆఫ్ డూయింగ్‌కు ఆటంకం

అయిదు బిలియన్ డాలర్ల పన్ను వివాదం ప్రపంచ బ్యాంకు ఏటా రూపొందించే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నివేదికలో మెరుగయిన స్థానం కోసం భారత్ ప్రయత్నానికి ఇబ్బంది కలిగించే అవకాశం వుంది. 2.2 బిలియన్ డాలర్ల ఈ పన్ను వివాదాన్ని సెటిల్ చేసుకునే ఉద్దేశం ఓడాఫోన్‌కు కనబడటం లేదు. అంతమాత్రం చేత సికె హచ్సన్ హోల్డింగ్స్ అధినేత లీ కా షింగ్‌ను ఈ పన్ను మొత్తాన్ని భరించమని అడిగే అవకాశమూ లేదు. భారత్ ఇంకా ఇదే తంత్రాన్ని కొనసాగిస్తే ప్రపంచ బ్యాంకు రూపొందించే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 40 స్థానాలు మెరుగుపరుచుకోవాలన్న లక్ష్యానికి గండిపడుతుంది. 2016 నివేదికలో భారత్ 130వ స్థానంలో నిలిచింది.

ఓడాఫోన్‌తో పన్ను వివాదం అయిదేళ్లుగా సాగుతున్నదే. భారత ఆదాయపు పన్ను శాఖ అధికారుల నుంచి పెనాల్టీ ఆర్డరు అందుకున్నట్లు సికె హచ్సన్ టెలికమ్యూనికేషన్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సోమవారంనాడు హాంకాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలిపింది. ఆగస్టు 9న ఈ పెనాల్టీ ఆర్డరు జారీ అయినట్లు పేర్కొంది. పన్ను, పన్ను మీద వడ్డీ వసూలు చేయాలని భారత్ ఆదాయపు పన్ను శాఖ భావిస్తోంది. భారత ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను, వడ్డీ కలిపి, సికె హచ్సన్ నగదు నిల్వలలో 25 శాతానికి సమానమవుతుంది.

ఈ వివాదం పూర్వాపరాలు....భారత్‌లోని మొబైల్ ఫోన్ వ్యాపారాన్ని పదేళ్ల కిందట లీ కి చెందిన కంపెనీ, ఓడాఫోన్‌కు విక్రయించింది. హచ్సన్ ఎస్సార్ లిమిటెడ్‌లో 67 శాతం వాటా వున్న కేమాన్ ద్వీపానికి చెందిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థను లీ నుంచి బ్రిటన్‌కు చెందిన ఓడాఫోన్ కొనుగోలు చేయడం ద్వారా ఈ లావాదేవీ జరిగింది. దీంతో లీకి ఆకస్మికంగా వచ్చిన లాభం మీద పన్ను విధించాలని భారత్ భావించి, అందుకు ఉపక్రమించింది.

కాకపోతే ఈ లావాదేవీ మొత్తం దేశం బయట జరగడంతో ఆ విధంగా పన్ను విధించడం సాధ్యం కాదని సుప్రీమ్ కోర్టు కొట్టివేసింది. దీంతో భారత ప్రభుత్వం, ముందు కాలం నుంచి వర్తించేలా పన్ను చట్టాన్ని 2012లో సవరించింది. పరోక్షంగా బదిలీ చేసే ఆస్థుల మీద పన్ను విధించే అవకాశం ఈ సవరణతో ప్రభుత్వం చేజిక్కించుకుంది. 2014 ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోడి ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, ట్యాక్స్ టెర్రరిజమ్‌గా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ చర్యను అభివర్ణించారు. దీంతో ఈ వివాదం సామరస్యంగా సర్దుమణిగిపోతుందని అందరూ భావించారు.

కానీ నిజానికి అందుకు విరుద్ధంగా జరిగింది. ఓడాఫోన్‌తో వివాదం యధాతథంగా కొనసాగుతోంది. అంతేకాకుండా ఈ వివాదం వల్ల భారత్‌లోని కంపెనీ షేర్లను పబ్లిక్‌కు అమ్మలేని పరిస్థితిని మాతృ సంస్థ ఓడాఫోన్ ఎదుర్కొంటోంది. ఈ బ్యూరోక్రసీ తప్పిదం జరిగి అయిదేళ్లవుతోంది. భారత్‌లోని తన సంస్థను ప్రత్యర్థి ఐడియా సెల్యులార్‌కు విక్రయించి, దేశం నుంచి బయటకు వెళ్లలాని ఓడాఫోన్ ప్రయత్నిస్తోంది. ఓడాఫోన్ (భారత్), ఐడియా విలీనం ఎంతో దూరంలో లేదు. అయినా కూడా ఓడాఫోన్‌తో పన్ను వివాదంలో భారత్ వెనక్కు తగ్గాలనుకుంటున్న సూచనలు కనబడటం లేదు.



రూ.1,000 నోటు ప్రవేశపెట్టం

• ఆర్థికమంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ : ఇటీవలే కొత్త రూ.200 నోటును చలామణిలోకి తెచ్చిన నేపథ్యంలో, పెద్దనోట్ల రద్దు సందర్భంగా రద్దు చేసిన రూ.1,000 కరెన్సీ నోటు తిరిగి చలామణిలోకి వస్తుందన్న వార్తలకు ఆర్థికమంత్రిత్వశాఖ తెర దించింది. రూ.1,000 నోటును తెచ్చే ప్రతిపాదన ఏదీ లేదని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ట్విట్ చేశారు. రిజర్వుబ్యాంకు తక్కువ డినామినేషన్ నోట్లపై ఒత్తిడి పెరగడంతో ఆగస్టు 25వ తేదీన రూ.200 నోటును విడుదల చేసింది . ప్రస్తుతం మార్కెట్లో రూ.500, రూ.2,000 మాత్రమే చలామణిలో ఉండటంతో రూ.2,000 నోటుకు చిల్లర దొరక్క ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. దీంతో రూ.100పై ఒత్తిడి పెరిగింది. ఒత్తిడి తగ్గించేందుకు రూ.200 నోటును ఆర్‌బీఐ ప్రారంభించింది. ప్రస్తుతం రిజర్వుబ్యాంకు రూ.2,000, రూ.500 నోటుతో పాటు రూ.200, రూ.50 కొత్త నోట్లను ఈ నెలలోనే విడుదల చేసింది. త్వరలోనే రూ.200 నోటును చలామణిలోకి తేస్తామని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఓలా, యుప్ టీవీ జట్టు



హైదరాబాద్ : ఇంటర్నెట్ ఆధారిత టీవీ, ఆన్ డిమాండ్ సర్వీస్ ప్రొవైడర్ యప్ టీవీలు క్యాబ్ అగ్రిగేటర్ ఓలాతో భాగస్వామ్యం చేపట్టినట్లు మంగళవారం నాడు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా ఓలా ప్రయాణికులు తమ ప్రయాణంలో లైవ్ టీవీ ఆప్షన్ అందుబాటులోకి వస్తుంది. ఉదాహరణకు వార్తలు, మ్యూజిక్, వినోద కార్యక్రమాలు యప్‌టీవీ ద్వారా ఆనందించవచ్చునని యప్ టీవీ వ్యవస్థాపకుడు సీఈవో ఉదయ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఓలా ప్లే వైస్ ప్రెసిడెంట్, హెడ్ యప్ టీవీ భాగస్వామ్యంలో తమ కస్టమర్లకు కొత్త అనుభూతిని కలిగిస్తామని ఆయన అన్నారు. కాగా ఓలా ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, పూనే, హైదరాబాద్‌లలో క్యాబ్ సేవలందిస్తోంది.

'జూమ్' పరిమితి పెంచిన పేపాల్

హైదరాబాద్: పేపాల్ డిజిటల్ మనీ ట్రాన్స్‌ఫర్ సర్వీస్ 'జూమ్' పరిమితులను పెంచింది. మెరుగయిన ఎక్స్ఛేంజ్ రేట్లతో ఇప్పుడు 10 వేల డాలర్ల మొత్తాన్ని ఒకేసారి బదిలీ చేసే వీలు కల్పిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. మార్ట్‌గేజ్ చెల్లింపులు, వ్యక్తిగత పెట్టుబడులు, ఎడ్యుకేషన్ లోన్స్ వంటి అవసరాల దృష్ట్యా ఈ సదుపాయం అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. భారత్‌లోని తమ కుటుంబ సభ్యులకు బాసటగా నిలవాలనుకునే వారి అవసరాలకు కూడా ఇది ఉపయోగపడుతుందని, బదిలీ మొత్తం పెరిగితే కొద్దీ మెరుగైన ఎక్స్ఛేంజ్ రేటు లభిస్తుందని వివరించింది. 2015లో విదేశాల నుంచి భారత్‌లోకి వచ్చిన మొత్తం 12 బిలియన్ డాలర్లుగా పిఇడబ్ల్యు రిసెర్చ్ సంస్థ అంచనా. విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులే స్వదేశంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ మొత్తం పంపించారు.

విదేశీ వ్యాపారాలు కొన్న హీరో ఎలక్ట్రానిక్స్

హైదరాబాద్: హీరో ఎలక్ట్రానిక్స్‌కు చెందిన టెసాల్వ్ మలేషియా, సింగపూర్ దేశాలకు చెందిన రెండు వ్యాపారాలను కొనుగోలు చేసింది. మలేషియాకు చెందిన స్పెక్ట్రమ్ ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీస్ ఎస్‌డిఎన్ బిహెచ్‌డి, సింగపూర్‌కు చెందిన లింగ్జెమి పిటిఇకి చెందిన టెస్ట్ ల్యాబ్ వ్యాపారాలను కొనుగోలు చేసినట్లు హీరో ఎలక్ట్రానిక్స్ ప్రకటించింది. 2022 నాటికి 1200 కోట్ల పెట్టుబడితో ప్రణాళికలు రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. 2017 సంవత్సరంలో హీరో ఎలక్ట్రానిక్స్ రూ.600 టర్నోవర్ సాధించింది.



దేనా బ్యాంక్ మెగా రుణ మేళా

హైదరాబాద్: దేనా బ్యాంక్ మెగా రుణ మేళా నిర్వహించింది. నగరంలోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ మెగా రుణ మేళాలో రూ.67 కోట్ల రుణాల మంజూరు లేఖలను రుణగ్రహీతలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ ఎస్. సింగ్ అందచేసినట్లు బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాధాన్య రంగమైన వ్యవసాయం, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లు, ముద్రా స్కీము రుణాలు రూ.60 కోట్ల దాకా వుండగా, ఎడ్యుకేషనల్ లోన్స్, ప్రభుత్వ స్పాన్సర్డ్ స్కీములు, హౌసింగ్, ఎంఎస్‌ఎంఇ లోన్స్ రూ. 7 కోట్లని దేనా బ్యాంకు పేర్కొంది.ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రా లకు చెందిన రుణగ్రహీతలు పెద్ద సంఖ్యలో ఇందులో భాగం పంచుకున్నట్లు వివరించిందిద.జోనల్ మేనేజర్ అశ్విన్ హెచ్. దలాల్, డిప్యూటీ జోనల్ మేనేజర్ పివిఆర్ఎస్ ప్రకాశరావు, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హైసియా వార్షిక సదస్సు

హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలోని చిన్న, మధ్య తరహా సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లో పోటీని తట్టుకుని, అభివృద్ధి పథంలో దూసుకు పోవడానికి తగిన మార్పులు చేసుకోవాలని హైసియా వార్షిక సదస్సులో పాల్గొన్న ప్రధాన వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఐటి ఎగుమతులలో పది శాతం చిన్న, మధ్యతరహా సంస్థల నుంచే సమకూరుతోంది. దీనిని రెట్టింపు చేసే వీలుందని, సెక్యూరిటీ, ఎనలిటిక్స్ విభాగాలలో అధికవృద్ధికి ఆస్కారముందని చెప్పారు. హైసియా 2017 వార్షిక సదస్సులో తెలంగాణా రాష్ట్ర ఐటి శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, హైసియా అధ్యక్షుడు రంగా పోతుల, ఐడిసి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జయ్‌దీప్ మెహతా పాల్గొన్నారు. హైదరాబాద్ ఐటి ఎగుమతులు గత అయిదేళ్ల కాలంలో 2017 నాటికి 87 వేల కోట్లకు చేరాయని రంగా పోతుల తెలిపారు. ఇందులో పది శాతం వాటా చిన్న, మధ్యతరహా ఐటి సంస్థలదేనని చెప్పారు.

నేనే బాధితుణ్ణి: గౌతమ్ సింఘానియా


• తండ్రి కన్నీటి కథ ఒక నాటకం • ఉద్యోగుల, వాటాదారుల ప్రయోజనం ముఖ్యం

• కుటుంబం ఒప్పందం ప్రకారమే వాటాల బదలీ : గౌతమ్ సింఘానియా



ముంబై : రేమండ్స్ వ్యవస్థాపకుడు విజయపథ్ సింఘానియా ఆయన ఏకైక కుమారుడు గౌతమ్ సింఘానియా న్యాయపోరాటం చేస్తున్నారు. కుమారుడికి 37.17 శాతం కంపెనీ వాటాలు సుమారు రూ.1,000 కోట్ల ఆస్తి బదలీ చేసి జీవితంలో అతి పెద్ద తప్పు చేశానని విజయ్‌పథ్ ఆవేదన చెందుతున్న విషయం తెలిసిందే. దీనిపై గౌతమ్ సింఘానియా తన వాదన వినిపించారు. ఆయన వాదన ఆయన మాటల్లోనే... ఫిబ్రవరి 2015లో వాటాలు తన పేరుపై బదలీ చేయడం జరిగిందనేది వాస్తవమే.. విజయ్‌పథ్‌కు ఒక్కాగానొక్కకొడుకును కాబట్టి గతంలో ఎప్పుడూ కుటుంబంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కంపెనీలోని వాటాలను తన పేరుపై బదలీ చేశారని వివరించారు. ఒక వేళ తనకు కాకుండా వేరొకరికి వాటాలు బదలీ చేస్తే గ్రూపు పూర్తిగా దెబ్బతినేదని రేమండ్ సీఎండీ అయిన గౌతమ్ వివ రించారు. గత 35 సంవత్సరాల నుంచి రోజుకు 16 గంటల చొప్పున పనిచేసి కంపెనీని తాను నిలబెట్టానని అన్నారు. 30 సంవత్సరాల క్రితం కుటుంబం సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారమే తాను పనిచేస్తున్నానని 52 ఏళ్ల గౌతమ్ చెప్పారు. తన తండ్రిపై వాటాలు బదలీ చేయాలని కుటుంబం ఒత్తిడి పెరగడమే వల్లే ఆయన వాటాలు బదలీ చేశారని, తాను గత 35 సంవత్సరాల నుంచి కంపెనీని విజయవంతంగా నడిపించానన్నారు. తనకు కాక మరొకరికి కంపెనీని అప్పగించి ఉంటే కంపెనీలో పనిచేసే 35 వేల ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

2015లో తండ్రి నుంచి వాటలు దక్కించుకున్న తర్వాత కంపెనీని గాడిలో పెట్టానికి స్వతంత్రంగా పలు నిర్ణయాలు తీసుకున్నానని, కొత్తగా అడ్వయిజరీ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, నిపుణులైన మేనేజర్లను నియమించి వ్యాపారాన్ని శరవేగంగా అభివృద్ధి పథంలో తీసుకువచ్చానన్నారు. ఇదంతా కేవలం రెండున్నర సంవత్సరాలల్లో పూర్తి చేశానన్నారు. కంపెనీ తన చేతిలోకి వచ్చిన తర్వాతనే కంపెనీని వృద్ధిబాటలో తీసుకువచ్చానని.. గతంలో నిర్ణయాలు తీసుకోలేకపోవడానికి కారణం.. కంపెనీలోని రాజకీయాలే అడ్డంకిగా మారాయని గౌతమ్ వివరించారు. రేమండ్స్ పగ్గాలు చేపట్టిన తర్వాత షేరు ధర 50 శాతంపైనే పెరిగిందన్నారు.





గౌతమ్ సింఘానియా తండ్రి, కుటుంబ సభ్యులతో పాటు ప్రమోటర్లతో న్యాయపోరాటం చేస్తున్నారు.

తండ్రి కుటుంబసభ్యుల వాదన ఏమిటంటే ముంబైలోని ఖరీదైన మలబార్ హిల్స్‌లో జెకె హౌజ్‌లో కొత్తగా డెవలప్ చేసిన భవనంలో డూప్లెక్స్ హౌజ్‌ను చౌకగా అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి గౌతమ్ సింఘానియా మాత్రం ససేమిరా అంటున్నారు. కుమారుడిగా తన బాధ్యతలు వేరు.. చైర్మన్‌గా బోర్డు సభ్యుడిగా కంపెనీ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తన తండ్రి చేస్తున్న డ్రామా చూడండి వాస్తవానికి తనే బాధుతుణ్ణి అని గౌతమ్ అన్నారు. ప్రస్తుతం తన జీవిత లక్ష్యం రేమండ్స్‌ను బ్లూచిప్ కంపెనీగా తీర్చిదిద్దడం. భవిష్యత్తు తరాలు వారు కూడా గుర్తుంచుకొనేలా కంపెనీని నడిపిస్తానన్నారు. మీడియా తనను పేజీ 3 సెలబ్రిటిని చేసిందని, ప్రజలు వాస్తవ గౌతమ్ సింఘానియాను చూడాలని అనుకుంటున్నాన న్నారు. కేర్‌టేకర్‌గా కంపెనీ సంపదను రాబోయే తరానికి అప్పగిస్తానని దీనికి తగ్గట్టుగా పక్కా ప్రణాళికను రూపొందిస్తున్నానన్నారు. రేమండ్స్‌లో పనిచేసే ఉద్యోగులు ఫ్రాంచైజీలు, డీలర్లు, వెండర్స్, వాటాదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత తనపైఉందని గౌతమ్ వివరించారు. తన తలపై బరువులైన ఆభరణాలులన్నాయన్నారు. తన బాధ్యతలు ఏమిటో తనకు తెలుసునన్నారు.

1999లో గౌతమ్ సింఘానియా మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు కంపెనీ భారీ అప్పుల్లో కూరుకు పోయింది. ఉక్కు, ఫిలామెంట్ వ్యాపారాలు దెబ్బతినడంతో భారీ నష్టాలను చవిచూసింది. దీంతో కీలకం కానీ ఆస్తును విక్రయించి అప్పులను తీర్చి కేవలం టెక్స్‌టైల్ వ్యాపారంపై దృష్టి పెట్టడంతో రేమండ్స్ నిలదొక్కుకొని లాభాల బాట పట్టిందని గౌతమ్ వివరించారు. ఇన్ని అష్టకష్టాలు పడ్డాం కాబట్టి ఈ రోజు రేమండ్స్ నిలదొక్కుకొంది. తాను చేసింది ఖచ్చితంగా సరైందని.. కాబట్టి మార్కెట్ కూడా తనను స్వాగిస్తోందన్నారు. ప్రస్తుతం గేర్లు మారుస్తున్నాం.. రెండో గేర్ నుంచి మూడో గేర్‌కు మారాం. అయితే టాప్ గేర్ 6 గేర్ ఉన్నామని మాత్రం అనని, టాప్ గేర్‌లోకి రావడానికి చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని రేసింగ్ కార్లంటే మక్కువ చూపించే గౌతమ్ సింఘానియా అన్నారు. తనను కాకుండా మరొకరికి కంపెనీని అప్పగించి ఉంటే రేమండ్స్ రివర్స్ గేర్‌లో ప్రయాణించేదని వ్యాఖ్యానించారు.

మార్కెట్లపై ఉత్తర కొరియా బాంబు

362 పాయింట్లు ఢమాల్
కుప్పకూలిన గ్లోబల్ మార్కెట్లు

ముంబై : వరుసగా నాలుగు రోజుల నుంచి లాభాలతో దూసుకుపోతున్న స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు కుదేలయ్యాయి. ఉత్తర కొరియా జపాన్ తీరంపై క్షిపణిలతో దాడులు చేయడంతో గ్లోబల్ మార్కెట్లు తల్లడిల్లాయి. గురువారంతో ఆగస్టు నెల డెరివేటివ్ కాంట్రాక్టు ముగియనుండటంతో మదుపరులు మార్కెట్లకు దూరంగా ఉన్నారు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సూచిలు ఇంట్రాడేలో ఒక శాతం క్షీణించి.. తొమ్మిది నెలల కనిష్ఠానికి దిగివచ్చాయి.

ఉత్తర కొరియా మంగళవారం ఉదయం జపాన్, పసిఫిక్ సముద్రజలాలపై క్షిపణులతో దాడులు చేసింది. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రికత్త నెలకొంది. మొత్తానికి స్టాక్ మార్కెట్లు ముగిసే నాటికి బీఎస్ఈ 362.43 పాయింట్లు లేదా 1.14 శాతం క్షీణించి 31,388.39 పాయింట్ల వద్ద ఎన్ఎస్ఈ 116.75 పాయింట్ల లేదా 1.18 శాతం నష్టపోయి 9,796.05 వద్ద ముగిశాయి. బీఎస్ఈలో అన్ని సూచిలు నష్టాలతో ముగిశాయి. అత్యధికంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 1.86 శాతం, విద్యుత్ 1.56 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.47 శాతం, పీఎస్‌యు 1.24 శాతం వరకు నష్టపోయాయి. ఇక షేర్ల విషయానికి వస్తే అత్యధికంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. ఎన్‌టీపీసీ 2.8 శాతం, సన్‌ఫార్మా 2.35 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 2.2 శాతం, రిలయన్స్ 2.17 శాతం, కోల్ ఇండియా 2.1 శాతం కాగా బీఎస్ఈలో కేవలం 2 షేర్లు మాత్రమే లాభాలతో గట్టెక్కాయి. ఎంఅండ్‌ఎం 0.25 శాతం, విప్రోలు 0.02 శాతం శాతంగా ఉన్నాయి.

విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టీపీసీ అత్యధికంగా 3 శాతం నష్టపోయింది. కేంద్రప్రభుత్వం 5 శాతం వాటాల విక్రయం కూడా ప్రారంభించింది. మరో ఐదు శాతం వాటాలను విక్రయించాలనే ఆలోచనలో ఉంది. మొత్తం పది శాతం విక్రయించి 220 కోట్ల డాలర్లు సేకరిస్తుంది. ఇన్ఫోసిస్ షేరుపై మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడంతో 1.5 శాతం క్షీణించింది. కాగా గత నాలుగు ట్రేడింగ్ సెషన్‌లలో ఈ షేరు 8 శాతంపైనే పెరిగింది. విశాల్‌సిక్కా రాజీనామా తర్వాత సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని పగ్గాలు చేపట్టడంతో షేరు తిరిగి గాడినపడింది. ఎన్ఎస్ఈ సూచి నుంచి తప్పిస్తున్న ఏసీసీ లిమిటెడ్; బ్యాంకు ఆఫ్ బరోడా, టాటాపవర్‌కంపెనీ షేర్లు కూడా నష్టపోయాయి. అయితే రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేరు ఏకంగా 7.7 శాతం పెరిగింది. రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీ గ్రీన్‌కో రిలయన్స్ ఇన్‌ఫ్రా ఎలక్ట్రిక్ కంపెనీ వ్యాపారాన్ని టేకోవర్ చేస్తున్నట్లు వార్తలు రావడమే కారణం. ఆసియా మార్కెట్లతో పాటు యూరోపియన్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి.

డిఫాల్టర్ల రెండో జాబితా రూపొందించిన ఆర్‌బీఐ

• ఐవిఆర్‌సిఎల్, విడియోకాన్ సహ 40 కంపెనీలు

న్యూఢిల్లీ: నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)కి సమర్పించేందుకు 30 నుంచి 40 మంది డిఫాల్టర్లతో కూడిన రెండో జాబితాను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) సిద్ధం చేసింది. ఈ జాబితాలో ఐవిఆర్‌సిఎల్, వీడియోకాన్, క్యాస్టెక్స్ టెక్నాలజీస్, వీసా స్టీల్, జెఎస్‌పిఎల్ వంటి సంస్థలు ఇందులో వున్నట్లు తెలుస్తోంది. జాబితాలోని అత్యధిక సంస్థలు మౌలికవసతులు, విద్యుత్ రంగాలకు చెందినవే వున్నట్లు భావిస్తున్నారు. ఈ రెండవ జాబితాను బహుశా సెప్టెంబర్‌లో ఆర్‌బిఐ విడుదల చేయనుంది. రెండవ జాబితా వార్తలు బయటకు రావడంతో వీసా స్టీల్ షేర్ ధర మంగళవారం 1.24 శాతం తగ్గి రూ.19.90కి చేరింది. ఈ షేర్ గత 3 నెలల్లో 26 శాతం, గత అయిదేళ్లలో 60 శాతం క్షీణించింది. ఇక వీడియోకాన్ షేర్ 3 శాతం తగ్గి రూ.18.35 వద్ద ముగిసింది. 3 నెలల్లో వీడియోకాన్ షేర్ 60 శాతం మార్కెట్ క్యాపిటలైజేషన్ పోగొట్టకుంది, ఇక అయిదేళ్లకు చూస్తే షేర్ 90 శాతం నష్టపోయింది. ఉత్తమ్ గాల్వా, జెఎస్‌పిఋల్ షేర్ ధరలూ క్షీణించాయి. ఈ కంపెనీల మీద ఎన్‌సిఎల్‌టి వద్ద దివాలా చర్యలు ప్రారంభించాల్సిందిగా రుణదాతలకు ఆర్‌బిఐ సూచించనుంది. రెండో జాబితా లోని కంపెనీలు రుణదాతలకు రూ.3 నుంచి 50 వేల కోట్ల మేర చెల్లింపులు బకాయి ప డ్డాయి. గుర్తించిన జాబితా వరకే సమస్య పరిమితమని భావించకూడదు. ఇదే సమస్య మరింత లోతుగా వుండొచ్చని ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ ఆర్, గాంధి అభిప్రాయపడ్డారు.



సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ క్రీడల ప్రోత్సాహానికి కృషి చేస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ నీతా అంబానికి క్రీడా ప్రోత్సాహక పురస్కారం కేల్ ప్రోష్టన్ పురస్కార్ 2017ని అందించారు.

కార్పొరేట్ గవర్నెన్స్ ఉల్లంఘన జరిగింది : నారాయణ మూర్తి

వాటాదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకే బోర్డుతో మాటల యుద్ధం చేయాల్సి వచ్చిందని ఇన్ఫోసిస్ సంస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణమూర్తి మంగళవారం వెల్లడించారు. కొత్త నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమితమయిన నందన్ నీలెకనికి మేనేజ్‌మెంట్ అన్ని విధాల సహరిస్తుందనే ఆశాభావాన్ని ఆయన ఇన్వెస్టర్ల కాన్ఫరెన్స్ కాల్ లో వ్యక్తం చేశారు. పాత డెరెక్టర్ల బోర్డు కార్పొరేట్ గవర్నెన్స్ నిబంధనలను సరిగా పాటించలేదని, కొన్నిసార్లు ఉల్లంఘనా జరిగిందని నారాయణమూర్తి విమర్శించారు. అంతర్జాతీయంగా ఉత్తమ సంస్థగా పేరు తెచ్చుకున్న ఇన్ఫోసిస్ పూర్వ వైభవాన్ని పొందాలనేదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. 1981 నుంచీ కార్పరోట్ గవర్నెన్స్ విషయంలో ఉత్తమ సాంప్రదాయాలను కంపెనీ పాటిస్తోందని, అందరు స్టేక్‌హోల్డర్స్ ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రయత్నించామని మూర్తి స్పష్టం చేశారు. నాస్‌డాక్ లిస్టింగ్ కంటే చాలా ముందుగానే యుఎస్ గ్యాప్ నిబంధనల మేరకు వెల్లడి ప్రమాణాలను అనుసరించడం మొదలు పెట్టామని, ఇటువంటి ఎన్నో అంశాలలో ఎప్పుడూ ముందుండే వాళ్లమని వివరించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎప్పుడూ పాకులాడలేదని, దీర్ఘకాలంలో ఇన్వెస్టర్ల ప్రయోజనాలనే తనకు పరమావధిగా భావించానని మూర్తి వెల్లడించారు. మీడియాలోనూ, బయటా కొంత మంది తన పట్ల ప్రతికూల వ్యాఖ్యలు చేయడం కలచి వేసిందని వాపోయారు.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు ప్రశాంతం

64.78% పోలింగ్





(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం నుంచి మందకొడిగా మారింది. సాయంత్రం 5గంటలకు 64.78శాతం పోలింగ్ నమోదైంది. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 2,29,373 మంది ఓటర్లున్నారు. వీరిలో 1,48,598మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాల్గవ డివిజన్‌లో కనిష్టంగా 51శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. 15వ డివిజన్‌లో గరిష్టంగా 80శాతం పోలింగ్ నమోదైంది. 2005లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 58శాతం పోలింగ్ జరగ్గా ఈ సారి సుమా రు 6.78శాతం అధికంగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ సందర్భంగా చెదురుమదురు సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఏటిమొగలో రెండు ప్రధాన పార్టీల కార్యకర్తల తోపులాటలకు పాల్పడ్డారు. 9వ డివిజన్లో బీజేపీ వైకాపా అభ్యర్థుల మధ్య వివాదం జరిగింది. 39వ డివిజన్‌లో వైకాపా, స్వతంత్ర అభ్య ర్థుల కార్యకర్తలు కొట్లాటకు దిగారు. 9వ డివిజన్లో మాత్రం పోలీసులు లాఠీలు ఝుళిపించారు. మరె క్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. కలెక్టర్ కార్తికేయమిశ్రా నగరంలోని బూత్‌లను సంద ర్శించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు సమీ క్షించారు. మున్సిపల్ పోలీస్ అధికారులు కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లో తొలిసారిగా వెబ్‌కాస్టింగ్‌ను వినియోగించారు. ప్రతిబూత్‌లోనూ వీడియో కెమెరాలేర్పాటు చేశారు. వీటిని కంట్రోల్‌రూమ్‌తో అనుసంధానం చేశారు. మరోవైపు డ్రోన్ కెమెరాల ద్వారా పోలింగ్ స్టేషన్ల పరిసరాల్ని పోలీస్ అధికారులు పరిశీలించారు. పోలింగ్ మొత్తాన్ని వీడియోలో చిత్రీకరించారు. కాకినాడలోకనీవిని ఎరుగని రీతిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏకంగా 2,139మందిని ఇందుకోసం వినియోగించారు. ఎస్‌పి, అడిషనల్ ఎస్‌పిలు స్వయంగా బందోబస్తు పర్యవేక్షణ చేశారు. ఎనిమిదిమంది డిఎస్‌పిలకు బందోబస్తు అధికార బాధ్యతలు అప్పగించారు.

ఓటర్ల తీర్పు ఇవిఎమ్‌ల్లో నిక్షిప్తం:

నగరంలోని 196పోలింగ్ స్టేషన్లలో జరిగిన ఓటింగ్‌ను ఇవీఎమ్‌ల్లో నిక్షిప్తం చేశారు. వీటన్నింటిని రంగరాయ మెడికల్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. 1వ తేదీ ఉదయం 8గంటల్నుంచి లెక్కింపు ప్రక్రియ మొదలౌతుంది. కాగా కాకినాడ కార్పొరేషన్‌లో మొత్తం 50డివిజన్లున్నాయి. కోర్టు ఉత్తర్వుల కారణంగా రెండు డివిజన్లలో ఎన్నికలు వాయిదాపడ్డాయి. 48డివిజన్లకు మాత్రమే ఎన్నికలు నిర్వహించారు.

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు:

మాజీమంత్రి ముత్తా గోపాలకృష్ణ కుటుంబీకులు రామారావుపేట మున్సిపల్ హైస్కూల్‌లో తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కుటుంబీకులు చర్చిస్క్వేర్ సెంటర్ మున్సిపల్ హైస్కూల్లో ఓట్లేశారు. ఎమ్మెల్సీ రవివర్మ 50వ డివిజన్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

కనిపించని నోటా మీట

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి : కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో నోటా మీటను విస్మరించారు. 196పోలింగ్ స్టేషన్లలో వినియోగించిన ఏ ఇవిఎమ్‌లో కూడా నోటా ఆప్షన్ లేదు. ఇది ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ధిక్కరించడమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పలు దేశాల్లో ఈ నోటా విధానం అమల్లో ఉంది. పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ తమకు నచ్చని పక్షంలో అదే విషయాన్ని నన్ ఆఫ్ ద ఏబౌ పేరిట ధృవీకరించే అధికారం ఎన్నికల సంఘం ఓటరుకిచ్చింది. 2013వరకు భారత ప్రభుత్వం కూడా దీన్ని వ్యతిరేకించింది. అయితే పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ అనే సంస్థ ఈ హక్కు కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలు ప్రజాస్వామ్య దేశాల్లో అమల్లో ఉన్న ఈ విధానాన్ని భారత ఎన్నికల కమిషన్ కూడా అనుసరించాలంటూ సుప్రింకోర్టు 2013సెప్టెంబర్ 27న ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకనుగుణంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ 2014సాధారణ ఎన్నికల్లో ఈ నోటాను ప్రవేశపెట్టారు. 2015అక్టోబర్ 23న ఎన్నికల కమిషనర్ అన్ని రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఈ నోటాను అమలు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాదు.. నోటాను ఇవిఎంలో నమోదు చేయని పక్షంలో తీవ్రచర్యలుంటాయని కూడా హెచ్చరించారు. అదే ఏడాది గుజరాత్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను వినియోగించక పోవడంపై సుప్రింకోర్టులో ఇప్పటికీ వ్యాజ్యం నడుస్తోంది. గతేడాది డిసెంబర్‌లో పంజాబ్‌లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నోటా ఆప్షన్ ఇచ్చారు. బరిలో ఉన్న అభ్యర్థులెవరూ తమకు నచ్చలేదన్న విషయాన్ని ప్రస్ఫుటం చేస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 60లక్షల మందికి పైగా నోటా గుర్తును నొక్కిచూపించారు. అప్పట్నుంచి ప్రతి ఎన్నికలోనూ వీరి సంఖ్య పెరుగుతూనే ఉంది. కర్ణాటక పంచాయతీ ఎన్నికల్లో కూడా నోటా ఆప్షన్ ఇచ్చారు. అలాంటిది కాకినాడ మున్సిపల్ ఎన్నికల్లో నోటా ఆప్షన్ లేక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

పాత ఇవిఎమ్‌ల కారణంగానే : కలెక్టర్

కార్పొరేషన్ ఎన్నికల్లో వినియోగిస్తున్న ఇవిఎమ్‌లు ఇప్పటివికావని కలెక్టర్ కార్తికేయ మిశ్రా స్పష్టం చేశారు. పాతకాలం నాటి ఇవిఎమ్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో నోటా ఆప్షన్‌కు అవకాశంలేదన్నారు. అందువల్లే ఈ సారి ఎన్నికల్లో నోటాకు అవకాశమివ్వలేదని వెల్లడించారు.

నంద్యాల స్ఫూర్తితో సాగుదాం!



(మొదటిపేజీ తరువాయి)

5 వార్డుల్లో విజయం సాధిస్తున్నామని ఆయన చెప్పారు. మిత్రపక్షం బీజేపీతో కలిపి సునాయాసంగా 40 వార్డులను కైవసం చేసుకుంటున్నామని, కాకినాడ నగరపాలక సంస్థపై తెలుగుదేశం పార్టీ జెండా రెప రెపలాడటానికి మార్గం సుగమమైందని ఆయన తెలిపారు. కాకినాడ పోలింగ్‌పై చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, కాల్వ శ్రీనివాసులు, ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డిలతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం జరిగిన పోలింగ్ సరళిపై అంతర్గత సర్వే నిర్వహించిన చంద్రబాబు ఆ ఫలితాలను మంత్రులకు వివరించినట్లు తెలుస్తోంది. తన సర్వేలో వచ్చిన ఫలితాలు, పార్టీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి సీనియర్ నేతలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, పయ్యావుల కేశవ్, బాబూ రాజేంద్రప్రసాద్‌లు అనునిత్యం పార్టీ యంత్రాంగం, ఇతర నేతలతో జరిపిన సంభాషణలు, చర్చలను పోల్చి చూశాక కాకినాడ ఎన్నికల్లో తొలిసారిగా తెలుగుదేశం పార్టీ విజయబావుటా ఎగురవేస్తోందని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం.

మంగళవారం మధ్యాహ్నం వరకు కాకినాడ ఎన్నికలలో ఆశించిన స్థాయిలో పోలింగ్ జరగలేదని, మధ్యాహ్నం నుంచి పార్టీ నేతలు ఇంటింటికి వెళ్లి ఓటర్లను పోలింగ్ కేంద్రానికి పంపించిన తీరును చంద్రబాబు ప్రశంసించారు. కాకినాడ ఎన్నికలో అభ్యర్థుల ఎంపిక కొంత ఇబ్బంది కలిగించినా ఫలితాలు మాత్రం సానుకూలంగా వస్తున్నాయని ఈ ఎన్నికలోనూ వైకాపాకు శృంగభంగం తప్పదని చంద్రబాబు అన్నారు. బీజేపీకి ఇచ్చిన వార్డుల్లో మూడు నుంచి ఐదు వార్డులను కైవసం చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. నంద్యాల ఉప ఎన్నిక ఫలితం వచ్చిన మరుసటిరోజే కాకినాడ నగరపాలకసంస్థ ఎన్నికలు జరగడం కలిసివచ్చిందని తటస్థ ఓటర్లతో పాటు ఉన్నత విద్యనభ్యసించిన ఓటర్లంతా అభివృద్ధికి పట్టం కట్టాలన్న ధ్యేయంతో ముందుకు వచ్చారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలే పునరావృతమవుతాయని ఆయన పేర్కొన్నారు. కాకినాడ పురపాలక సంఘం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఇప్పటిదాకా ఛైర్మన్ పదవిని అధిష్టించలేదని నగరపాలక సంస్థగా కాకినాడ అభివృద్ధి చెందాక కూడా మేయర్ పీఠాన్ని దక్కించుకోలేకపోయామని, తొలిసారిగా ఇక్కడ పాగా వేయనున్నామని చంద్రబాబు అన్నారు. అటు నంద్యాల, ఇటు కాకినాడలలో ఎన్నికల సమయంలో చేసిన హామీలన్నింటినీ నెరవేర్చే బాధ్యత తాను తీసుకుంటానని, మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ ఆయా జిల్లాల నేతలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం సాధించిన విజయాలను చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేయాలని చంద్రబాబు కోరారు. ఓ వైపు పార్టీని బలోపేతం చేస్తూనే మరోవైపు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను, పథకాలను విజయవంతం చేసే బాధ్యతలను కిందిస్థాయి నేతల వరకు తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. విపక్షపార్టీ వైకాపా ఇస్తున్న హామీలను ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ప్రజలు పట్టించుకోవడం లేదని.. అభివృద్ధికే వారు తమ ఓటును వేస్తున్నారని వివరించారు. నంద్యాలతో పాటు కాకినాడలో తాను పర్యటించి నిర్వహించిన రోడ్‌షోలు, బహిరంగ సభలకు హాజరైన ప్రజానీకాన్ని చూశానని, అయితే, వారినుంచి వచ్చిన స్పందన చూసి ముగ్ధుడనయ్యానని, అప్పుడే ఫలితం అనుకూలంగా వస్తుందన్న ధీమా తనలో వ్యక్తమైందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ రెండు ఎన్నికల ఫలితాలతో బాధ్యత ఇంకా పెరిగిందని.. నూతనోత్సాహంతో వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

కాకినాడ నగరపాలక సంస్థ పోలింగ్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష..

అమరావతి, ఆంధ్రప్రభ : కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణలతో కలిసి సమీక్షించారు. మంగళవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన నాటి నుంచి ముగిసే వరకు మంత్రులు, కాకినాడ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లు నేతలతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 196 పోలింగ్ కేంద్రాల్లో పోల్‌అవుతున్న ఓట్ల వివరాలను నేతల ద్వారా తెలుసుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు సచివాలయంలోని కమాండ్ కంట్రోల్‌లో పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమాచారం అందించారు. ఆరంభంలో పోలింగ్ ప్రక్రియ కొంత మందకొడిగా సాగిన చివరకు వేగం పుంజుకుని 71శాతానికి చేరడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.






కాదంటే ఉద్యమిస్తా

(మొదటిపేజీ తరువాయి)

మూడు వేల మంది విద్యార్థులకు సంబంధించిన విషయంగా తమ పార్టీ పరిగణించడం లేదన్నారు. లక్షలాది మంది రైతులు, వారి కుటుంబాలకు చెందిన సమస్యగా జనసేన భావిస్తోందని పవన్‌కళ్యాణ్ అన్నారు. విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టమని కోరుతున్నారని ఇది ఎంతో సహేతుకంగా ఉందన్నారు. నిద్రాహారాలు మాని ఎంసెట్ పరీక్షలో ఉత్తీర్ణులైనప్పటికీ వారు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారని, ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని వారు ఒక సర్టిఫికెట్ సంపాదించి వ్యవసాయ అధికారులుగా పనిచేస్తున్నారనే విషయం విద్యార్థులు తన దృష్టికి తెచ్చారని ఆయన తెలిపారు. వ్యవసాయ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందో.. లేదో తేల్చేది భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) మాత్రమేనని, ఈ సంస్థ గుర్తింపు వుండి ఆంధ్రప్రదేశ్‌లో చదువుతున్న వ్యవసాయ పట్టభద్రులకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత లేకపోవడం సమంజసం కాదని పవన్‌కళ్యాణ్ అన్నారు. ఐసీఏఆర్ గుర్తింపులేని కళాశాలల నుంచి వచ్చిన వారు వ్యవసాయాధికారులుగా ఉద్యోగాలు పొంది రైతులకు మెరుగైన సేవలు ఎలా అందించగలరని ఆయన ప్రశ్నించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కోటి ఎకరాలకు పైగా భూములలో వ్యవసాయం సాగవుతోందని, లక్షలాది మంది రైతులు ఈ భూములపై ఆధారపడ్డారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వ్యవసాయం లాభసాటిగా లేదని కొందరు రైతులు వ్యవసాయానికి దూరమవుతున్నారని, అప్పులపాలై మరికొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుస్థితి పోవాలంటే నిపుణులైన వ్యవసాయాధికారులు వారికి అండగా ఉండాలని, అలాంటి అధికారులు కావాలంటే ప్రతిభకు పట్టం కట్టాలని పవన్‌కళ్యాణ్ ప్రభుత్వానికి సూచించారు. మేలైన వ్యవసాయ విద్య అందాలంటే ఐసీఏఆర్ లాంటి సంస్థల అజమాయిషీ అవసరం ఎంతైనా ఉందన్నారు. అయితే, ఐసీఏఆర్‌ను ఏర్పాటు చేసేటప్పుడు దానికి చట్టబద్ధమైన అధికారం కల్పించలేదని, దీంతో ఈ సంస్థ మరింత సమర్థంగా వ్యవహరించలేకపోతోందని ఆయన పేర్కొన్నారు. అయితే, అనధికారికంగా ఏర్పాటైన బీసీసీఐ లాంటి సంస్థలు రాజ్యమేలుతున్న తరుణంలో ఐసీఏఆర్‌కు ఆపాటి అధికారాలు ఇవ్వకపోవడం శోచనీయమని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. విద్యార్థులు ఆరోపిస్తున్నట్లు ఎవరైనా తప్పుడు సర్టిఫికెట్లతో రాష్ట్ర వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు పొందితే వారిపై తక్షణమే విచారణ జరిపి దోషులని తేలిన వారిని ఉద్యోగాలనుంచి తొలగించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మె జరుపుతున్న విద్యార్థులతో ప్రభుత్వంలోని పెద్దలు చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఎలాంటి అధికారాలున్నాయో.. అదే రీతిలో ఐసీఏఆర్‌కు కూడా కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పవన్‌కళ్యాణ్ డిమాండ్ చేశారు.

రేపే పీఎస్ఎల్వీ- సీ 39 ప్రయోగం



శ్రీహరికోట(సూళ్లూరుపేట)కెఎన్ఎన్: భారత అంతరిక్షపరిశోధన సంస్థ(ఇస్రో) సతీష్ ధవన్ స్పేష్ సెంటర్ నుంచి ఈ నెల 31వ తేదీన సాయంత్రం 6.59 నిమిషాలకు పీఎస్ఎల్వీ -సీ39 రాకెట్ ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేశారు. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ సిరీస్‌లో ఆఖరి శాటిలైట్ ఐఆర్ఎస్ఎస్ఎస్ -1హెచ్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపించేందుకు రాకెట్‌కు సంబంధించిన పనులు పూర్తి చేశారు. 44.4మీటర్ల ఎత్తున్న పీఎల్ఎల్వీ -సీ39 రాకెట్ ప్రయోగ సమయంలో ఇంధనంతో కలిపి 320టన్నులు బరువుతో నింగిలోకి పంపనున్నారు. శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని 20 నిమిషాల్లో పూర్తి చేసేలా గ్రహ వ్యవస్థ ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌ను తయారు చేశారు. ఉపగ్రహాలు తయారు చేసేందుకు శాస్త్రవేత్తలు పరీక్షల తర్వాత 2013 జూలై 1 దిక్సూచి వ్యవస్థలో మొదటి ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్ -1ని విజయవంతం ప్రయోగించారు. తర్వాత 7వ ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్ -1జీని 2016 ఏప్రిల్ 20వ తేదీన ప్రయోగించారు. అయితే ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చే సమయంలో ఉపయోగించిన ఐఆర్ఎన్ఎస్ఎస్ఏ -1 ఉపగ్రహంలో సాంకేతిక లోపంతో పనిచేయడం మానేసింది. ఆ ఉపగ్రహం స్థానంలో ఈ నెల 31వ తేదీన ప్రయోగించబోయే ఐఆర్ఎన్ఎస్ఎస్ -1 హెచ్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టి భారతదేశానికి పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో చేసుకున్న దిక్సూచి అందుబాటులోకి తెస్తుందన్నారు. మొదటి దశలో ఫోర్ అలోన్ చుట్టూ ఆరు స్టాపాన్ బూస్టర్లను అమర్చి 320 టన్నుల బరువున్న రాకెట్‌ను మొదటి రెండు, మూడు, నాలుగు దశలలో నింగిలోకి పంపనున్నారు. నింపిన ఇంధనంతో పాటు 1400 కిలోల ఉపగ్రహం బరువుతో నింగికి తీసుకువెళ్లాలంటే ఆరు స్టాపాన్ బూస్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో స్టాపన్ బూస్టర్ మీటర్ వ్యాసార్ధం ఉంటుంది. ఒక్కో స్టాపన్ బూస్టర్‌లో 12.5 టన్నుల ఘన ఇంధనాన్ని నింపుతారు. బూస్టర్ సాయంతో ప్రయోగం ప్రారంభమవుతుంది.

మునిగిన ముంబై

• ముంచెత్తిన వర్షాలు • చెరువులను తలపిస్తున్న రహదారులు • లోతట్టు ప్రాంతాలు జలమయం





ముంబై: ముంబైని వర్షాలు ముంచెత్తాయి.ఎడతెరపిలేకుండా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. ఎక్కడ చూసినా అడుగు లోతు నీరు కనిపిస్తోంది. లోతట్టు ప్రాంతాలైతే చెరువులను తలపిస్తున్నాయి.భారీ వర్షం కారణంగా ముంబైలోని వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. స్కూళ్లకు సెలవు ప్రకటించారు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు నిలిచిపోయాయి. చాలామంది ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆయా సంస్థలు కూడా కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాలతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. వర్షం కారణంగా ముంబైలో విమానసర్వీసులు రద్దు చేశారు. పట్టాలపై వర్షపు నీరు వచ్చి చేరడంతో ముంబై మీదుగా వెళ్లే అన్ని రైళ్లు రద్దయ్యాయి. పలు రైళ్లు కూడా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మరికొన్నింటిని దారిమళ్లించారు. ముంబైలోని దాదర్, అంధేరి, విల్లా, పార్లే, బాంద్రా, వర్లీ మొదలైన ప్రాంతాల్లో భారీ వర్షాలతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. వర్షంకారణంగా పలు చోట్ల చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై నిలిచిన నీటిని తొడేందుకు ముంబై మున్సిపల్ కార్పోరేషన్ పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఎక్కడికక్కడ సహాయ కేంద్రాలు ఏర్పాటు ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకుంటున్నారు.

2005 తర్వాత ఇదే తొలిసారి


ముంబైలో ఎడతెరపిలేకుండా భారీ వర్షం కురవడం ఇదే తొలి సారని వాతావరణ శాఖ తెలిపింది.2005లో మూడు రోజులపాటు ఎడతెరపి లేకుండా 50 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా.. జనజీవనం పూర్తిగా స్తంభించిందని... సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంకూడా అదే రీతిలో ఉందనిపేర్కొంది. 2005 వర్షాల కారణంగా వచ్చిన వరదలతో 500 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. రానున్న 48 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ముంబైలోని స్లమ్ ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలను అక్కడినుంచి సురక్షిత ప్రాంతాలక తరలిస్తున్నారు.

ముంబైలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆరా తీశారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ముంబై ప్రజలను ఆదుకునేందుకు కేంద్రం అన్ని సహాయ సహకారాలు అందజేస్తుందని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్లనుంచి బయటకు రాకూడదన్నారు. రెస్క్యూసిబ్బందిని రంగంలోకి దించి సహాయ కార్యక్రమాలు వేగవంతం చేయాలని ఫడ్నవీస్‌ను ఆదేశించారు.

రంగంలోకి ఫడ్నవీస్

ముంబైని వర్షాలు ముంచెత్తుతుండటంతో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రంగంలోకి దిగారు. పరిస్థితులపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. విపత్తు నిర్వహణ అధికారులతో భేటీ అయి...తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మాస్టర్ కంట్రోల్ రూం నుంచి పరిస్థితిని తెలుసుకుంటున్నారు. స్లమ్,లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

చెప్పింది చేస్తున్నాం..



(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించి, పరిష్కారాలు వెదకాలని అప్పుడే అభివృద్ధి పథాన పయనించగలమని ఆయన అన్నారు. తాను ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు రాజస్థాన్ అభివృద్ధికి దోహదపడి రాష్ట్ర ముఖ చిత్రాన్నే మార్చేస్తాయ న్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 11 జాతీయ రహదారులను మోడీ జాతికి అంకితం చేసారు. ఇవి 873 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వీటిలో కోటాలోని చంబల్ నది మీద ఆరు లేన్ల కేబుల్ బ్రిడ్జి కూడా ఉంది. దీంతో పాటు 556 కిలోమీటర్ల మేర నిర్మితమయ్యే ఆరు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ఆన్‌లైన్లోనే ఆయన నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఎన్నికల్లో భారీ వాగ్దానాలు చేయడం సంప్రదాయమైపోయిందని, అయితే.. అలాంటి వాటిని మాటలకే పరిమితం చేయకుండా అరిష్టాలను తొలగించి, దేశానికి బలాన్ని చేకూర్చడం చాలా కష్టమైన పని అని చెప్పారు. తమ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల వేగం పెంచడంతో పాటు స్థాయిని కూడా పెంచిందని చెప్పారు. రాజస్థాన్‌ను వీరుల రాష్ట్రంగా పేర్కొన్న మోడీ, తమ ప్రభుత్వం అభివృద్ధి తప్పితే రాజకీయాలు చేయదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఈ సందర్భంగా విరుచుకుపడిన మోడీ, కోటాలో బ్రిడ్జి నిర్మించడానికి ఆ ప్రభుత్వానికి 11 ఏళ్లూ సరిపోలేదన్నారు. తమ ప్రభుత్వం దీన్ని సవాల్ గా తీసుకుని పూర్తి చేసామని చెప్పారు. ఈ ప్రాజెక్టుతోనే తమకు, గత ప్రభుత్వానికీ తేడాను ప్రజలు గుర్తించవచ్చన్నారు. రూ. 15,000 కోట్ల ప్రజెక్టులు ప్రారంభం, పూర్తి కావడమనేది చరిత్రాత్మకమైనదని, రహదారుల వల్ల వ్యవసాయం, పర్యాటక రంగం, పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రోడ్లు బాగుంటే.. పూలు, టీ అమ్మే వారి దగ్గర నుంచి పారిశ్రామిక వేత్తల వరకూ అందరి ఆదాయాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మనందరి ఆదాయాలు మెరుగుపడతాయన్న ఆయన మాటలకు ప్రజలు కరతాళధ్వనులతో స్పందించారు. ఈ సందర్భంగా దేశంలో వరద బాధిత ప్రాంతాలపై మోడీ సానుభూతి చూపించారు. వారికి కేంద్రం అండగా ఉంటుందని చెప్పారు.

జీఎస్టీ అపూర్వం

తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ వ్యవస్థ అపూర్వమని మోడీ కొనియాడారు. రాత్రికి రాత్రి పన్ను వసూల వ్యవస్థను ప్రక్షాళించిన వ్యవస్థగా ఆయన దీనిని అభివర్ణించారు. ఈ వ్యవస్థ వల్ల రవాణా చార్జీలు తగ్గుతాయని, ట్రక్కులు, ట్రాలీల డ్రైవర్ల ఆదాయాలు పెరుగుతాయని మోడీ చెప్పారు. రవాణా వ్యవస్థలోనూ పెను మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ మీద అవగాహన కోసం 15 రోజుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని మోడీ అధికారులకు సూచించారు. అప్పుడు చిన్న వ్యాపారస్తులు కూడా జీఎస్టీ వల్ల ఎలా ప్రయోజనం పొందచ్చో తెలుసుకుంటారని అన్నారు. మోడీ అనంతరం మాట్లాడిన ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, తాము మూడేళ్లో చేసిన పనులు, కాంగ్రెస్ ప్రభుత్వం 50 ఏళ్లలోనూ చేయలేదన్నారు. గతంలో ప్రాజెక్టులన్నీ అనవసరమైన నిబంధనల వల్ల ఆగిపోయేవని, తాము వాటన్నింటినీ తొలగించామని చెప్పారు. యూపీఏ హయాంలో ఆగిపోయినవాటిని తాము మొదలెట్టడం లేదా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. అలా ఆగిపోయిన 57 ప్రాజెక్టులను తాము పూర్తి చేసామని, తాము పని చేస్తాం కానీ, అడ్డంకులను సృష్టించబోమని అన్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే మాట్లాడుతూ.. తాము అందరితో కలిసి అందరికీ అభివృద్ధి చేసి నవ భారత్‌ను నిర్మించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

చిన్నారులపై లైంగిక వేధింపులు ఆపాలి

నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులు అక్రమ రవాణాలకు వ్యతిరేకంగా పోరాడాలని నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి పిలుపు నిచ్చారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కైలాష్ మాట్లాడుతూ చిన్నారులపై వేధింపులు ,అక్రమ రవాణాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తూ భారత్ యాత్ర సెప్టెంబర్ 11న కన్యాకుమారి నుంచి ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. అక్టోబర్ 16న ఢిల్లీలో ఈ యాత్ర ముగుస్తుందన్నారు. సుమారు 11వేల కిలోమీటర్ల మేర ఈ యాత్ర సాగనుందన్నారు. మన పిల్లలకు సురక్షితమైన భారతదేశాన్ని ఏర్పరచే దృష్ట్యా ఆవిష్కరించబడిన ఈ యాత్రకు ప్రధాని నరేంద్రమోడి నుంచి సంపూర్ణ మద్దతు లభించిందని వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రస్తుతం తాండవమాడుతున్న చిన్న పిల్లల లైంగిక వేధింపు, అక్రమ రవాణా సమస్యలను అంచనా వేశారన్నారు. మైనర్లపై అత్యాచారాలు ఎక్కువగా వారికుటుంబ సభ్యులు, సన్నిహితుల ద్వారానే జరిగాయని ఇటీవలే వెలుగు చూశాయన్నారు.

పంథా మార్చిన సర్కార్

- పత్తి రైతాంగానికి ఆలంబన
- సకాలంలో కొనుగోలు కేంద్రాలకు కేంద్రంపై వత్తిడి
- త్వరలోనే హస్తినకు ప్రతినిధి బృందం

అమరావతి, ఆంధ్రప్రభ: గతంలోకన్నా భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు ఆలంబనగా నిలవాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలోనే సకాలంలో పత్తి కొనుగోలు కేంద్రాలు నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచాలని నిర్ణయించింది. త్వరలోనే వ్యవసాయ శాఖ మంత్రి నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి బృందం ఢిల్లీ వెళ్ళేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ప్రతి ఏటా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనుసరిస్తున్న జాప్యం ఫలితంగా రాష్ట్రంలోలక్షలాది సంఖ్యలో వున్నపత్తి రైతులు నష్టాలకు గురవుతున్నారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు వ్యూహాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. పత్తి రైతులకు సంబంధించిన సమస్యలన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి రావడంతో వత్తిడి పెంచాలనేది సర్కారు పంథాగా మారింది. ఈ నేపథ్యంలోనే సి.సి.ఐ కి ఆనవాయితీగా మారిన డిసెంబర్‌లో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కు బదులుగా వచ్చే అక్టోబర్ నెలాఖరులోగానే కొనుగోళ్ళు ప్రారంభించాలనేది ప్రభుత్వ యోచనగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా రైతాంగం ఇక్కట్లకు లోను కావడానికి కేవలం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనుసరిస్తున్న నిర్లక్ష్యమే కారణమని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సి.సి.ఐ విధానాలవల్ల దళారులకు వరంగా మారిందనే అభిప్రాయానికి రావడం జరిగింది. ఒకవైపు కోట్లాది రూపాయలకు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా, వాటి ఫలితాలను రైతులకు బదులుగా దళారులు అనుభవించడమేమిటని ఇటీవల జరిగిన ఒకసమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సైతం ప్రశ్నించారు. తాజా పరిణామాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తొలుత కేంద్ర ప్రభుత్వానికి ఒకలేఖ రాసి, అనంతరం మంత్రి నాయకత్వంలో ఒక ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి పంపాలని నిర్ణయించడం జరిగింది. క్షేత్రస్థాయిలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక సమర్పించగా, వచ్చే సీజన్ నుంచి క్రియాశీలకంగా వ్యవహరించి రైతాంగానికి బాసటగా నిలవాలని నిర్ణయించారు. రైతులకు తాము పండించిన పంటను నిల్వ చేసుకునే సామర్థ్యం కేవలం పది శాతం రైతులకు మాత్రమే వుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. కాగా కృష్ణా జిల్లాలో 47000 హెక్టార్లలో పత్తి పంటను సాగుచేస్తున్నారు. అదే విధంగా గుంటూరు జిల్లాలో 1.70 లక్షల హెక్టార్లు, కర్నూలు జిల్లాలో 2.20 లక్షల హెక్టార్లు, కడప జిల్లాలో 17,000 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 25,000 హెక్టార్లు, ప్రకాశం జిల్లాలో 40,000 హెక్టార్లలో సాగవుతోంది. ప్రాధాన్యతా క్రమంలో ఎంపికచేసిన మార్కెట్‌యార్డులలో సి.సి.ఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అధికార యంత్రాంగం ఒకనివేదిక సిద్ధంచేసింది. కాగా ఉమ్మడి రాష్ట్రంలోనూ కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా నిర్లక్ష్యం ఫలితంగా రైతాంగం అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం సమీప భవిష్యత్తులో అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

వేరుశనగపైనా దృష్టి

కాగా రాష్ట్రంలో, ప్రత్యేకించి రాయలసీమ జిల్లాలలో ప్రధాన పంటగా వున్న వేరుశనగ కొనుగోళ్ళపై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన నాఫెడ్ పై వత్తిడి తేవాలని సంకల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎకరాలలో వేరుశనగ పంట సాగు అవుతోంది. కడప జిల్లాలో 22,000 హెక్టార్లు, చిత్తూరు జిల్లాలో 1.05 హెక్టార్లు, కర్నూలు జిల్లాలో 90,000 హెక్టార్లు, అనంతపూర్ లో 3.50 హెక్టార్లలో వేరుశనగను సాగుచేస్తున్నారు. రానున్నఅక్టోబర్ 15 వ తేదీకల్లా పంట చేతికి అందనున్న తరుణంలో వేరుశనగ కేంద్రాలను ఏర్పాటుచేసే విధంగా చర్యలుతీసుకోవాలని, నాఫెడ్పై పెద్ద ఎత్తున వత్తిడి పెంచాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వత్తిడి తేనున్నది.

కాగా పత్తితోపాటు వేరుశనగ, ఇతర పంటలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వినూత్నమైన విధానానికి శ్రీకారం చుట్టింది. సర్వేనంబర్లు, రైత్తులవారీ, పంటలవారీగా వివరాలను నమోదు ప్రక్రియను రాష్ట్రంలోనే తొలిసారిగా పరిగణనలోకి తీసుకోవాలని సంకల్పించారు. ఇందుకు సంబంధించిన కసరత్తు ఇప్పటికే యాభై శాతం పూర్తయింది.

అన్ని జిల్లాలలోనూ 25 లక్షల హెక్టార్లకు సంబంధించిన పంటల వివరాలు ఇ.క్రాప్ బుకింగ్ విధానం ద్వారా వివరాలునమోదు అయ్యాయి. దీంతో ఏ పంటకు ఏ విధంగా గణాంకాలతో సహా ఎలాంటి ప్రాధాన్యత కల్పించాలనే అంశం ప్రభుత్వానికి ముందస్తుగానే తగిన వ్యవహరించేందుకు వెసులుబాటు కలుగుతుంది.

ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చు కోవాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ తాజాగా ఇ.క్రాప్ బుకింగ్ వంటి నూతన విధానానికి శ్రీకారం చుట్టడం జరిగింది. దీంతో ఎక్కడా ఒక ఎకరం పంట కూడా దుర్వినియోగం కాకూడదనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యూహం.

జీవో నెంబర్ 279 రద్దు చేయాలి



మంత్రికి సమ్మె నోటీసులను అందిస్తున్న దృశ్యం

అమరావతి, ఆంధ్రప్రభ : మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడుస్తూ విడుదల చేసిన జీఓ నెంబర్ 279ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను బానిసలుగా మర్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం తగదన్నారు. అభద్రతాభావంతో మున్సిపల్ కార్మికులు విధులను నిర్వహిస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రతను కల్పిస్తూ ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలను చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తూ జీఓ నెంబర్ 151 ప్రకారం ఎరియర్స్‌తో సహా జీతాలను పెంచి ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి పురపాలక సంఘాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్, హెల్త్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి ఈనెల 24న జీఓ నెం.591ని ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్న 582 పోస్టులకు సుదీర్ఘకాలంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అర్హులైన కార్మికులను నియమించాలన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారాలకై సెప్టెంబరు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించి నిరవధికసమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పురపాలక మంత్రి నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్, డీఎంఏ కన్నబాబులకు సమ్మె నోటీసులను జేఏసీ నేతలు ఎ.రంగనాయకులు, ఇ.మధుబాబు, ఎస్.శంకరరావు, సుమన్, రాందాస్, రమేష్‌లతో కలిసి అందజేసినట్లు తెలిపారు.

'వైద్యరంగ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి'

అమరావతి, ఆంధ్రప్రభ : వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సు విధానంలో చాలీచాలని జీతాలతో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతనాలను పెంచాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర సీఐటీయూ కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటణ విడుదల చేశారు. ప్రభుత్వ వైద్య రంగానికి చెందిన పారామెడికల్, యూరోపియన్ ఎఎన్ఎం, రెండవ ఎఎన్ఎం, అర్బన్ హెల్త్ సెంటర్లు, నేషనల్ హెల్త్ మిషన్, చంద్రన్న సంచార చికిత్స, 102, 108, ఎస్ఎన్‌సీయూ, ఆర్ఎన్‌టీపీసీ, ఏపీ సాక్స్, వైద్య విధాన పరిషత్, హైర్డ్ ఎఎన్ఎం, ఆర్‌బిఎస్ఐ, ఆయుష్, ట్రామాకేర్, ఆరోగ్యమిత్ర తదితర విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నా ఇంతవరకు వేతనాలు పెంచలేదన్నారు. గత ఏడాది శాశ్వత ఉద్యోగుల వలే ఒప్పంద ఉద్యోగులకు కూడా వేతనాలను పెంచుతూ సౌకర్యాలను కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సు ఉద్యోగులకు వేతనాలను పెంచాలని జీఓ నెంబర్ 151ని 08.08.2016న ప్రభుత్వం ఉత్తర్వులను కూడా జారీ చేసిందన్నారు. కానీ ఇంతవరకు ఆ ఉత్తర్వులను అమలు చేయలేదని, తక్షణమే జీఓను విడుదల చేసిన తేదీ నుంచి వేతనాలు, గ్రాస్ సాలరీలను పెంచాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్, డీఏ, హెచ్‌ఆర్ఏలతో కూడిన వేతనాలను కంటింజెంట్ ఉద్యోగులకు వర్తింపజేయాలని జీఓ నెంబరు 193ని జారీ చేయడం జరిగిందని, కానీ దీనిని కూడా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వ పాలకులు కనీసం ఇప్పుడైన హామీని అమలు చేయడం ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ గుంటూరు పర్యటన రేపు

అమరావతి, ఆంధ్రప్రభ : ఎస్సీ ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గురువారం గుంటూరులో పర్యటించనున్నారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట వరకు నవ్యాంధ్ర విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా పరిషత్ అతిథి గృహంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఏమిటీ అపరిశుభ్రత?

ఈదర గ్రామంలో పారిశుద్ధ్య లోపంపై మంత్రి శిద్దా రాఘవరావు ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి శిద్దా

దర్శి, కెఎన్ఎన్: ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఈదర గ్రామంలో విషజ్వరాలు ప్రబలకుండా పూర్తిస్థాయిలో అరికట్టడానికి వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి శిద్దా రాఘవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన గ్రామంలో విషజ్వరాల బారిన పడిన బాధితులను పరామర్శించి పలు వీధులను స్వయంగా సందర్శించారు. గ్రామంలో అపరిశుభ్రమైన వాతావరణం, ఎక్కడచూసినా మురుగునీరు రోడ్లపై ఉండటం, డ్రైనేజీ పూడిక తీయకపోవడంపై పంచాయతీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రబలిన విషజ్వరాలను అదుపుచేయడానికి చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రసాద్‌ను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వెంకటరావు గ్రామానికి 15 రోజుల కొకసారి రావడం జరుగుతుందని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నెలరోజుల నుంచి ప్రజలు జ్వరాల బారినపడి బాధపడుతుంటే డాక్టర్‌గా సేవలందించే విషయంలో నిర్లక్ష్యం వహించడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఇటువంటి డాక్టర్ల వల్లే చెడ్డ పేరు వస్తుందని, చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి డీఎంఅండ్ హెచ్ఓ నరేష్‌ను ఆదేశించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మంత్రి పరిశీలించి ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈదర గ్రామానికి అవసరమైన డ్రైనేజీ వ్యవస్థకు రూ.30 లక్షలు జిల్లా కలెక్టర్‌చే మంజూరు చేయిస్తానని, తన సొంత నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేస్తునట్లు వెల్ల డించారు. గ్రామంలో అంచలంచెలుగా సిమెంట్ రోడ్లు వేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.


కోర్కె తీరిస్తే.. వీసా ఇప్పిస్తా

- హైదరాబాద్‌లో ఓ ఏజెంట్ నిర్వాకం..
- బాధితురాలి ఫిర్యాదుతో కటకటాలపాలైన వైనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాయం చేయాలంటూ తనను ఆశ్రయించిన మహిళపై అత్యాచారయత్నానికి ఒడిగట్టాడో ప్రబుద్ధుడు.. వివరాల్లోకి వెళితే.. అనంతపురం గుంతకల్లుకు చెందిన ఓ వివాహిత తన భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు గల్ఫ్‌కు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఇదే క్రమంలో పాస్‌పోర్టు సంపాదించుకున్న ఆమె వీసా కోసం యత్నించింది. వీసా కావాలంటే హైదరాబాద్‌లో కరీముద్దీన్ అనే ఏజెంట్‌ను కలవాలని తెలిసిన వారు తెలిపారు. దీంతో 25 రోజుల కిందట హైదరాబాద్ వచ్చిన ఆ మహిళ కరీముద్దీన్ వద్దకు వెళ్లి వీసా కోసం అభ్యర్థించగా అతడు దుర్బుద్ధితో ప్రవర్తించాడు. వీసా ఇవ్వకుండా తన కోరిక తీర్చాలని బలవంతం చేశాడు. అందుకు ఆమె సుతరామూ అంగీకరించలేదు. దీంతో ఆమెపై అత్యాచారయత్నానికి యత్నించాడు. ఎలాగొలా కరీముద్దీన్ నుంచి తప్పించుకున్న బాధితురాలు తనకు న్యాయం చేయాలని కోరుతూ చార్మినార్ పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసులో నిందితుడు కరీముద్దీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారిని మోసం చేస్తూ మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న వారిని పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయని సౌత్ జోన్ డీసీపీ సత్యనారాయణ ఈ సందర్భంగా తెలిపారు.

అగ్నిమాపక శాఖలో సీడీఎంపీ

- తొలిగా విశాఖపట్నం
- తర్వాత అన్ని పట్టణాల్లో అమలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఎఫ్ఓ శ్రీనివాసులు

అమరావతి, ఆంధ్రప్రభ : అగ్నిమాపక శాఖలో 'సిటీ విపత్తు నిర్వహణ ప్రణాళిక'ను రూపొందిస్తున్నట్లు తూర్పు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి (ఈఆర్ఎఫ్ఓ) జి.శ్రీనివాసులు తెలిపారు. తొలి విడతలో విశాఖపట్టణంలో ఈ ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నామని, ఆ తర్వాత రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లోను అమలు చేస్తామని ఆయన చెప్పారు. తూర్పు ప్రాంతీయ అగ్నిమాపక అధికారిగా నూతన బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రణాళికలలో భాగంగా ముందుగా అగ్ని ప్రమాదాలు, వరదలు, విపత్తులు తరుచుగా సంభవించే ప్రాంతాలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో సంబంధిత విపత్తులు చోటు చేసుకున్నప్పుడు మానవ వనరులు, పరికరాల ఆవశ్యకతను ముందుగానే అంచనా వేసుకొని సిద్ధం చేసుకోవడంతో పాటు పోలీసు, రెవెన్యూ తదితర ఇతర శాఖలతో సమన్వయం చేసుకునే విధానాలు పొందుపరచడం జరుగుతుందన్నారు. ఏదైనా విపత్తు జరిగిన వెంటనే ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూడటంలో సిటీ విపత్తు నిర్వహణ ప్రణాళిక ఎంతగానో ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో అగ్నిమాపక నివారణ చర్యలపై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. ప్రతి జిల్లాలోను రోజుకు ఒక చోట అవగాహనా కార్యక్రమాలు జరుపుతామని ఆయన తెలిపారు. సమావేశంలో కృష్ణాజిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జి. నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా పేరుతో రైతులను మోసం చేస్తున్న బీజేపీ

జెట్టి గురునాథరావు

అమరావతి, ఆంధ్రప్రభ : బీజేపీ ఆర్భాటంగా రైతులకు మేలు చేస్తామని ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద నేటివరకూ ఒక్క రైతుకు కూడా ఇంత వరకు బీమా అందలేదని ఆంధ్రప్రదేశ్ కిసాన్‌ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ ఛైర్మన్ జెట్టి గురునాథరావు ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఈ మేరకు ఆయన ఏపిసిసి రాష్ట్ర కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతు పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. ఎం.ఎస్. స్వామి నాథన్ సిఫారసులను అమలు చేసే ఉద్దేశ్యం ఈ ప్రభుత్వాలకు ఉందా అని ప్రశ్నించారు. ఫసల్‌బీమా యోజన పేరిట సుమారు రూ. 8.61 లక్షల రైతుల దగ్గర నుంచి రూ. 5,077.13 కోట్లు ప్రీమియం క్రింద వసూలు చేశారన్నారు. రబీకి సుమారు లక్షా 38వేల మంది రైతుల దగ్గర నుండి రూ. 1, 039.23 కోట్లు ప్రీమియం కింద వసూలు చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు ఈ ఇన్సూరెన్స్ కంపెనీలనుండి ఒక్క రూపాయి కూడా రైతులకు చెల్లింపు జరగలేదని ఆరోపించారు. ప్రీమియం చెల్లించిన ఏ ఒక్క రైతుకు కూడా పంటనష్టం చెల్లించలేదన్నారు. ఈ డబ్బంతా కూడా పూర్తిగా ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రభుత్వానికి లాభం చేకూర్చేటటు వంటి పనిలా ఉందన్నారు. ఒక్క పోలవరంలో 300 ఎకరాలు పంటవేయలేదని, వర్షాభావ పరిస్థితులు అని చెప్పి ఆ ఏడీలు అందరూ కూడా నివేదికలు ఇచ్చి పంపినా ఇన్సూరెన్స్ కంపెనీలు చెకింగ్‌కు కూడా రాకుండా ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా రైతును నిట్టనిలువునా మోసం చేశాయన్నారు.

గ్రూప్-2 పరీక్షలను రద్దు చేయాలి

రేపు ధర్నా: నిరుద్యోగ ఐక్యవేదిక

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో జులై 15,16 తేదీలలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలలో అనేక అవకత వకలు జరిగాయని, అందువల్ల ఆ పరీక్షలను రద్దు చేయాలని నిరుద్యోగ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణ్ రావు, నిరుద్యోగ ఐక్య వేదిక నాయకుడు పరిమి కిరణ్ కుమార్, సుబ్రహ మణ్యం తదితరులు పాల్గొని ప్రసం గించారు. ఈపరీక్షలలో విశాఖ పట్నం, చీరాల తదితర కేంద్రాలలో మాల్ ప్రాక్టీస్ జరిగాయని వీటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, పరీక్షను రద్దుచేయాలని కోరారు. ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలుకూడా సిలబస్‌కు అనుగుణంగా లేవని, ప్రశ్నాపత్రంలో సమతుల్యత లోపించిందని పేర్కొన్నారు. ఈపరీక్షలకోసం విద్యార్థులు 5 సంవత్సరాలుగా ఎదురుచూశారని, కాని ఏపీపీఎస్సీ ఈపరీక్షలను నిర్వహణలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈపరీక్షను రద్దు చేసి ఆఫ్ లైన్ లో పరీక్షను నిర్వహించాలని వారు కోరారు. ఈడిమాండ్లపై తాము రేపు ధర్నా చౌక్ వద్ద ధర్నా చేస్తున్నామని ఐక్యవేదిక నాయకులు కిరణ్ కుమార్, సుబ్రమణ్యం తెలిపారు.

విశాఖలో ఘరానా దోపిడీ

- మూడు కేజీల బంగారు ఆభరణాలతో దోపిడీ దొంగలు ఉడాయింపు
- కోటి విలువైన నగల కోసం రంగంలోకి దిగిన పోలీసులు



విశాఖపట్నం, (మధురవాడ) కెఎన్ఎన్ బ్యూరో: విశాఖ నగరంలో క్రమేపీ దొంగతనాలు, హత్యల జోరు పెరుగుతూ వస్తోంది. తాజాగా మంగళవారం పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో ఘరానా మోసం చోటు చేసుకుంది. ఏకంగా మూడు కేజీల బంగారు ఆభరణాలను అయిదుగురు వ్యక్తులు దర్జాగా దోచుకెళ్లారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. ఇక్కడ పోతినమల్లయ్యపాలెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వెనుక సాయిలక్ష్మి నిలయం వుంది. ఇందులో ఒక ఫ్లాట్‌ను రాకేష్ అనే యువకుడు అద్దెకు తీసుకున్నాడు. సదరు రాకేష్ సిల్వర్ వ్యాపారి. అయితే రాకేష్‌కు గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంతానికి చెందిన వరలక్ష్మి జ్యుయిలరీ వర్క్‌షాప యజమాని బల్లా వెంకటరమణతో కొంతకాలంగా పరిచయాలు వున్నాయి. ఒడిశా జయపూర్‌లో వీరిద్దరికి పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి తరచూ బంగారు, వెండి వ్యాపారం చేస్తూ వుండేవారు. ఈ నేపథ్యంలోనే ఎప్పటిలాగే రాకేష్ మూడు కేజీల బంగారు ఆభరణాలు కావాలని బల్లా వెంకటరమణకు సమాచారం అందజేసి ఆయా నగలు తయారు చేసి విశాఖ తీసుకురావాలని కోరాడు. దీంతో రాకేష్ ఇచ్చిన వర్క్‌ఆర్డర్ మేరకు మూడు కేజీల బంగారు ఆభరణాలు తయారు చేసి మంగళవారం బల్లా వెంకటరమణ రత్నాచల్ ఎక్స్ ప్రెస్‌లో విజయవాడ నుంచి విశాఖ తీసుకుని వచ్చాడు. రైల్వే స్టేషన్ లో రాకేష్ రమణను కలుసుకుని ఇద్దరూ కలిసి పీఎం పాలెం లో వున్న రాకేష్ నివాసానికివెళ్లారు. అయితే అప్పటికే రాకేష్ గదిలో మరో నలుగురు గుర్తు తెలియన వ్యక్తులు మకాం వేసి వున్నారు. వీరు గదిలోకి ప్రవేశించగానే రాకేష్, మిగిలిన నలుగురు వ్యక్తులు కలిసి బంగారం వ్యాపారి వెంకటరమణను కత్తులతో బెదిరించి కుర్చీకి కట్టేశారు. ఆపై వెంకటరమణను భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో బెంబేలె త్తిన వెంకటరమణ బంగారం తీసుకుని తనను విడిచిపెట్టాలని ప్రాథేయపడ్డాడు. ఈమేరకు దోపిడీ దొంగలు వెంకటరమణకు కట్టిన తాళ్లు విప్పేసి అర గంట తరువాత బయటకు రావాలని బెదిరించారు. అంతేకాకుండా తాము తీసుకువెళుతున్న మూడు కేజీల బంగారంతోపాటు మరో కేజీ కలిపి నాలుగు కేజీలు బంగారం త్వరలో ఇస్తామని అప్పటివరకూ ఎటువంటి హడావుడి చేయవద్దని వెంకటరమణకు చెప్పి అక్కడ నుంచి దొంగలు పరారయ్యారు. ఈ సంఘటన నుంచి తేరుకున్న నగల వ్యాపారి వెంకటరమణ హడావిడిగా బయట పడి పక్కనేవున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. తదుపరి వారిచ్చిన సలహా మేరకు శాంతి భద్రతల విభాగానికి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే సీఐ లక్ష్మణమూర్తి తన సిబ్బందితో రంగంలోకి దిగి విచారణ ప్రారంభించారు. బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రైం డీసీపీ బాజ్‌పేయి సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. అయితే రాకేష్ కాకుండా మిగిలిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. నమ్మించి రాకేష్ తనను నట్టేట ముంచాడని బాధితుడు బల్లా వెంకటరమణ బోరుమంటున్నాడు. ఈ బంగారు ఆభరణాల విలువ సుమారు కోటి వరకూ వుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కేసును విశాఖ పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని దోపిడీ దొంగల కోసం ప్రత్యేక బృందాలను రంగంలో దింపారు.

కారులోనే మహిళను నరికిచంపిన ప్రియుడు

తనకల్లు పోలీస్‌స్టేషన్‌లో శవంతో ప్రియుడి లొంగుబాటు



మల్లీశ్వరీ (40)ను కారులోనే నరికిచంపిన దృశ్యం. (సర్కిల్‌లో) నిందితుడు అశోక్

తనకల్లు, (కె.ఎన్.ఎన్) : ఓ మహిళ సాగించిన వివాహేతర సంబంధాలు తుదకు ఆమె ప్రాణాలనే బలి తీసుకొన్నాయి. ఇరువురు వద్దు.. తనతోనే అక్రమ సంబంధం కొనసాగించాలంటూ ప్రియుడు నచ్చచెప్పాడో.. ఏమో.. తెలియదు. బెడిసి కొట్టిన వివాదం తుదకు.. ప్రియుడు కారులోనే ప్రియురాలిని నరికి చంపి, ఏకంగా మహిళ శవంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయిన సంఘటన మంగళ వారం రాత్రి తనకల్లు పోలీస్‌స్టేషన్‌లో సంచలనంగా మారింది. కదిరి పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీకి చెందిన మల్లీశ్వరీ (40) తనకల్లు సమీపంలోని మండ్లిపల్లి మిట్టవద్ద దారుణ హత్యకు గురైంది. మల్లీశ్వరీ ప్రియుడు అశోక్ కారులోనే కొడవలితో నరికి చంపాడు. ఆపై కారుతో సహా తనకల్లు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని లొంగిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అశోక్ తిరుపతి పట్టణంలో కారుడ్రైవర్‌గా పనిచేస్తుండగా, మంగళవారం మధ్యాహ్నం తిరుపతి నుంచి కారులో తనకల్లుకు వచ్చి కదిరి నుంచి మల్లీశ్వరీని పిలుపించుకొన్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం అశోక్ వద్దకు చేరుకొన్న మల్లీశ్వరీ అశోక్ ఇరువురు మండ్లిపల్లి మిట్ట వద్ద కారును ఆపి అందులోనే ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ సమయంలోనే మల్లీశ్వరీకి కుమార్ అనే వ్యక్తితో ఉన్న అక్రమ సంబంధాన్ని మానివేయాలని, తనతోనే ఉండాలంటూ అశోక్ ఎంత నచ్చజెప్పినా వినకపోగా, తుదకు అశోక్ కారులోనే మల్లీశ్వరీని నరికి చంపినట్లు తెలిపారు. అనంతరం కారుతో పాటు మల్లీశ్వరీ శవంతో కారును తనకల్లు పోలీస్‌స్టేషన్‌కు చేర్చి నిందితుడు అశోక్ లొంగిపోయినట్లు హెడ్ కానిస్టేబుల్ సూరి తెలిపారు. ఈ విషయమై నిందితుడు అశోక్ మాట్లాడుతూ కుమార్‌తో అక్రమ సంబంధాన్ని ఆపివేయాలని కోరినా.. మల్లీశ్వరీ ససేమిరా అనడంతోనే తాను హతమార్చినట్లు పేర్కొన్నారు. ఇంకొకరితో ఇటువంటి అక్రమ సంబంధం నెరపకూడదనే ఉద్దేశ్యంతోనే హతమార్చినట్లు తెలిపాడు. కాగా నిందితుడు అశోక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నట్లు తెలుస్తుండగా గతంలోనే మల్లీశ్వరీ అక్రమ సంబంధం విషయంలో అశోక్, కుమార్‌ల మధ్య గొడవలు చోటు చేసుకొని పోలీసుల వద్దకు వెళ్లి పరస్పరం ఫిర్యాదు చేసుకొన్నట్లు కూడా తెలుస్తోంది. ఇరువురి గొడవ సద్దుమణగకపోగా, తుదకు మల్లీశ్వరీ హతమయ్యేదాకా రావడం సంచలనంగానే ఉంటోంది. అశోక్ కదిరి పట్టణ వాసిగానే ఉంటుండగా, తిరుపతిలో ఓ యజమాని వద్ద డ్రైవర్‌గా పనిలో ఉంటూ అక్కడనే భార్య, పిల్లలతో ఉంటున్నట్లు తెలిసింది. ఏదీ ఏమైనా మహిళను హతమార్చి ఏకంగా శవంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు లొంగిపోవడం అక్రమ సంబంధాల విషయం మరోసారి చర్చనీయాంశంగానే మారింది.

రోడ్డు భద్రతపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: రఘువీరా

మడకశిర, (కెఎన్ఎన్): రాష్ట్రప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి ఆరోపించారు. మంగళవారం అనంతపురం జిల్లా మడకశిర పట్టణంలోని నీలకంఠాపురం కావేరప్ప వెటర్నరీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సందీప్ రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఏపిసిసి అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి మంగళవారం కళాశాలలను పర్యటించి విద్యార్థి ప్రమాదానికి గురైన సంఘటనను గురించి విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంతో సందీప్ మృతి చెందడం చాలా బాధకరమని.. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు నిత్యం కృత్యమవుతున్నాయని రోడ్లు మరణమృదంగంగా మారుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రమాదాలు జరిగిన తరువాత ప్రభుత్వాలు స్టేట్ మెంట్లు ఇస్తున్నాయో తప్పా.. ముందుగా వాటి నివారణకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కళాశాలలు, పాఠశాలలు ఉన్న చోటవేగ నిరోధకాలు వేయించాలన్న కామన్‌సెన్స్ కూడా ఈ పభుత్వాలకు లేకపోయిందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబానికి రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. నంద్యాలలో కూడా రోడ్డులోనే బీరు బాటిళ్లతో వేలాది మంది కనిపించారని.. అయినా పోలీసులు ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని.. అసలు ఏవరూ ఏమి పట్టించుకోవడం లేదని ప్రభుత్వ పాలన మొత్తం అస్తవ్యస్తంగా ఉందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సంతకం బెల్టుషాపుల రద్దు అనేది ఈ మూడు సంవత్సరాలు చేయలేదు కానీ.. ఇప్పుడు మద్యం డోర్ డెలవరీ చేస్తూ మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఆయన ఆరోపించారు. అనంతరం మృతిచెందిన విద్యార్థి సందీఫ్ కుమార్ ఇంటికి వెళ్లి మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

'వ్యవసాయ డిప్లొమా విద్యార్థుల భవిష్యత్ ఆశాజనకం'

అమరావతి, ఆంధ్రప్రభ : వ్యవసాయ డిప్లొమా చదివే విద్యార్థుల భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుందని వీరికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వి.దామోదర నాయుడు అన్నారు. యూనివర్శిటీ ప్రాంగణంలో మంగళవారం జరిగిన రెండవ విడత కౌన్సిలింగ్‌సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని స్వంతంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలు, వ్యవసాయ సలహా కేంద్రాలు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అగ్రిసెట్, అగ్రి ఇంజరీరింగ్ సెట్ పరీక్షలు నిర్వహించి తద్వారా బీఎస్సీ వ్యవసాయం, బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్లు కల్పిస్తున్నామన్నారు. డిప్లొమా చదివిన విద్యార్థులు బీఏ, బీకాం, బీబీఏ కోర్సులు చదివేందుకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో ఉన్న మల్టీపర్పస్ వర్కర్స్ మూడు వేల మందిలో సగానికిపైగా డిప్లమా కోర్సులు చదివిన వారికే ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సంపాదించాలని ఉపకులపతి ఆకాంక్షించారు. మంగళవారం జరిగిన కౌన్సిలింగ్‌లో 300 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించి, వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ అధికారులు వి.సత్యనారాయణ, రమేష్‌బాబు, కో-ఆర్డినేటర్ జి.సునీల్‌కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంపన్నులకు కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వం

సువరం సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం పేదల ప్రభుత్వం కాదని, సంపన్నుల ప్రభుత్వమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. పనామా పేపర్స్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సురవరం డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్ర ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు దాటిన ఇప్పటి వరకు నల్లధనం దొంగల పేర్లు ఎందుకు బయటపెట్టలేదని ఆయన ప్రశ్నించారు. రెండు రోజుల పాటు ముగ్దుమ్‌భవన్‌లో జరగున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను సురవం సుధాకర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ, జాతీయ రాష్ట్ర రాజకీయాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్పోరేట్ సంస్థలకు చెందిన రూ. 20 లక్షల 60 వేల కోట్లను నరేంద్రమోడి ప్రభుత్వం మాఫి చేసిందని, అదే రైతుల రుణాల విషయానికి వచ్చేసరికి నిబంధనలు అడ్డున్నాయని చెపడం శోచనీయమన్నారు. రాజ్యాంగ పదవులన్నీ ఒకే పార్టీ చేతిలో ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. మతపరమైన విభజనను విస్తృతం చేస్తూ వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో టీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్‌పాషా, పార్టీ నేతలు పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు.

తెలుగు భాష, సంస్కృతి వారసత్వ సంపద

• గిడుగు రామ్మూర్తి పంతులను ఆదర్శంగా తీసుకోవాలి • రాష్ట్ర వ్యాప్తంగా ఏడు తెలుగు అకాడమీలు : సీఎం చంద్రబాబునాయుడు • మమ్మీ, డాడీ సంస్కృతి వద్దు • అమ్మా, నాన్న పిలుపే ముద్దు : డిప్యూటీ స్పీకర్ మండలి

అమరావతి, ఆంధ్రప్రభ : తెలుగు భాషను, సంస్కృతి వారసత్వ సంపద అని, ఈ సాంప్రదాయాలను కాపాడటంతో పాటు భావి తరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, దీనికి ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలను ప్రభుత్వం తెలుగుభాషా దినోత్సవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికోసం ప్రతి తెలుగు వ్యక్తి కృషి చేయాలని, గిడుగు రామ్మూర్తి పంతులను ఆదర్శంగా తీసుకుని పునరంకితం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భాషా పరిరక్షణకోసం ప్రభుత్వ పరంగా అన్ని చర్యలను చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తెలుగుభాష పరిరక్షణకు స్వర్గీయ నందమూరి తారక రామారావు చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. ఎంతోమంది ప్రముఖులు తెలుగు భాషాభివృద్ధికి విశిష్ట కృషి చేశారని, వీరిలో కృష్ణా జిల్లాకు చెందిన విశ్వనాథ సత్యనారాయణ ఉండటం గర్వకారణమన్నారు. ప్రపంచలో ఏ మూలకు వెళ్లినా తెలుగు వ్యక్తులు కనిపిస్తారని, వారి మాటలు విన్నప్పుడు ఎంతో ఆనందం కలుగుతుందన్నారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో ఎంతో మంది తెలుగువారు నివసిస్తూ అధిక ఆదాయం ఆర్జిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సిలికాన్ వ్యాలీలో తెలుగుభాషను కాపాడేందుకు వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఎంతో వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలోని పర్వతాల పేటలో జన్మించిన గిడుగు రామ్మూర్తి పంతులు బ్యాచిలర్ డిగ్రీ సాధించినా ఎంతో సరళమైన వాడుక భాషనే ఉపయోగించేవారన్నారు. ఆ ప్రాంతంలోని సవర భాషకు విశేష ప్రాముఖ్యాన్ని కల్పించిన ఘనత రామ్మూర్తి పంతులదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తణుకులో



ఆయన నాలుగు గంటల పాటు తెలుగుభాష గొప్పతనాన్ని చాటారని కొనియాడారు. రామ్మూర్తి పంతులు కృషికి రావుబహుదూర్ పురస్కారం, కైజర్ ఇ హింద్ బంగారు పతకాలు పొందారన్నారు. తెలుగుదేశం పార్టీలోనే తెలుగు ఉందని, ప్రతి తెలుగు వ్యక్తి దీనిని గుర్తుంచుకునేందుకు ఆ పేరును పెట్టినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శ్రీకృష్ణదేవరాయులు, క్షేత్రయ్య, అన్నమయ్య, రాయప్రోలు, గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, ఆరుద్ర లాంటి వారితో పాటు నేటి తరంలోని సి నారాయణరెడ్డి లాంటి మహనీయులు తెలుగుభాష అభివృద్ధి కోసం విశిష్ట కృషి చేశారని కొనియాడారు. తెలుగుభాష పరిరక్షణకు ప్రభుత్వం తరపున ఒక కమిటీని ఏర్పాటు చేశామని, కమిటీ సిఫారసుల మేరకు ఏడు అకాడమీలు ఏర్పాటు చేయటంతో పాటు తెలుగుభాషాభివృద్ధి సాధికారిత సంస్థను నెలకొల్పామన్నారు. భాషాసంస్కృతులు మానవ మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. మన కుటుంబ వ్యవస్థను మనమే కాపాడుకోవాలని, అభివృద్ధితో పాటు ఆనందం కూడా ప్రతి ఒక్కరికి అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కుటుంబ ఆనందం కోసం ఆనందలహరి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో శని, ఆదివారం నిర్వహిస్తున్నామన్నారు. డేరా బాబా లాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వ్యక్తులు సమాజంలో చాలా మంది ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధుకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చామని, ఆమె రాష్ట్రానికి, దేశానికి విశిష్టమైన పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్నారని ప్రశంసించారు. తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు సంబంధించిన పలు జ్ఞాపికలు మద్రాసు, లండన్ మ్యూజియంలలో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞాన సహకారంతో తెలుగుభాషను, నాగరికతను ప్రభుత్వం ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. అనంతరం శాసన సభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మమ్మీ, డాడీ అన్న సంస్కృతికి స్వస్థిపలికి అమ్మా, నాన్న అన్న పిలుపుకు స్వాగతం పలుకుదామన్నారు. ప్రపంచ తెలుగు రథసారధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని, తెలుగు భాషాభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. వాడుక భాషకు పట్టంకట్టిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులని కొనియాడారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవసరాల కన్యాకుమారి రచించిన అమరావతి రాగం సీడీని ఆవిష్కరించారు. జొన్నవిత్తుల, కన్యాకుమారిలను సన్మానించారు. భాషాకోవిదులు, సాహితీవేత్తలు, భాషా సేవకులుగా ఎంపికైన వారికి అవార్డులు ప్రధానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు తెలుగు అకాడమీలు ఏర్పాటుకు సంబంధించిన జీవోను సభాముఖంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ, విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్, కృష్ణాజిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సాంస్కృతిక సమితి సిఇవో డాక్టర్ విజయభాస్కర్, పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు, కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, వివిధ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కరణ బాటలో అటవీ సంస్థ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర విభజన అనంతరం నిర్వీర్యమైపోయి ఉన్న అటవీ అభివృద్ధి సంస్థ సంస్కరణల బాట పట్టింది. మార్కెటింగ్ కమిషనర్‌గా వ్యవహరించిన పి.మల్లికార్జునరావు అటవీ అభివృద్ధి సంస్థ ఎండీగా నియామకం కావడంతో సంస్థ రూపురేఖలే మారిపోయాయి. గతంలో విజయవాడలో ఉన్న సంస్థ కార్యాలయాన్ని గుంటూరు నగరంలోని గోరంట్లలో గల విశాలమైన భవనంలోకి తరలించారు. సంస్థ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు ఎండీ మల్లికార్జునరావు అనేక నూతన ప్రణాళికలు, పథకాలను రూపొందించారు. ఈ నేపథ్యంలో ఈ ఆర్థికసంవత్సరం చివరినాటికి సంస్థ ఆధ్వర్యంలోని సుమారు 4 లక్షల టన్నుల యూకలిప్టస్‌ను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా సంస్థకు రూ.20 కోట్ల వరకు ఆదాయం చేకూరనుంది. ఇప్పటికే లక్షన్నర టన్నులను విక్రయించగా, రాబోయే ఆరు నెల్లలో విక్రయించే యూకలిప్టస్ కోసం సెప్టెంబర్‌లో ఈ-టెండర్లను పిలువనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 75 వేల ఎకరాల్లో యూకలిప్టస్ సాగు జరుగుతోంది. ఇప్పటి వరకు నర్సరీలను ప్రైవేటు సంస్థలే నడుపుతుండగా నూతనంగా అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తొలి విడతగా రాష్ట్రంలోని రాజమండ్రి, బాపట్ల, కావలిలో నర్సరీలను ఏర్పాటుచేసి తద్వారా అన్ని రకాల పూలు, పండ్ల మొక్కలు విక్రయించనున్నారు. అలాగే రాష్ట్రంలో 1500 ఎకరాల్లో వెదురు, యూకలిప్టస్ ప్లాంటేషన్ చేయనున్నారు. అదేవిధంగా 2 లక్షల కాఫీ మొక్కలను నాటడంతోపాటు వాటి నీడ కోసం మరో 2 లక్షల సిల్వర్‌ఓక్, పనస తదితర చెట్లను కూడా నాటాలని యోచిస్తున్నారు. ప్రయోగాత్మకంగా 225 ఎకరాల్లో టేకు, జీడిమామిడి, టామరిక్స్ మొక్కలను నాటేందుకు రంగం సిద్ధం చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఏపీ ఎన్జీవో నాయకులు

• ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల అశోక్‌బాబు ధన్యవాదాలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించినందుకు ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి. అశోక్‌బాబు నేతృత్వంలో పలువురు ఎన్‌జిఓ నాయకులు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలియజేయడంతో పాటు సంధ్యారాణి శాసనమండలి ఎన్నికలలో గెలుపొందడం పట్ల అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కారుణ్య నియామకాల్లో ఇంటర్మీడియట్ విద్యార్హతను కల్పించడం, కారుణ్య నియామకం అవసరంలేని వారికి ఎక్స్‌గ్రేషియాను పెంచడంతో పాటు మచిలీపట్నం, శ్రీకాకుళం, చిత్తూరు పట్టణాలలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి అద్దెభత్యాన్ని 20శాతానికి పెంచడం, సచివాలయ ఉద్యోగులతో సమానంగా హెచ్‌వోడి కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు సిఆర్‌డిఎ పరిధిలో ఓపెన్ బస్‌పాస్‌ల మంజూరు వంటి ఉద్యోగుల పట్ల సానుకూల నిర్ణయాలను తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన అశోక్‌బాబు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపిఎస్‌ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఏర్పడి 50సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 12వ తేదిన విజయవాడలో గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నారు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గల పద్మావతి ఘాట్‌లో నిర్వహించే గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఎన్ఎంయు సంఘం ఆహ్వానించిందని అశోక్‌బాబు ముఖ్యమంత్రికి తెలిపారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొంత జాప్యం జరిగినప్పటికి ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉంటానన్నారు. 12వ తేదిన ఏపిఎస్‌ఆర్టీసీ ఎన్ఎంయు గోల్డెన్ జూబ్లీ వేడుకలకు తాను తప్పక హాజరవుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగ సంఘ నాయకులకు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో పి. అశోక్‌బాబు తో ఆటు ఎపిఎన్‌జివో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి వీరంద్రబాబు, సంఘ నేతలు ఎ. విద్యాసాగర్, కోనేరు శ్రీనివాసకుమార్, వి. జగదీష్, ఎపిఎస్ ఆర్టీసీ ఎన్ఎంయు సంఘ నాయకులు వై. శ్రీనివాసరావు, వి. శివారెడ్డి, టి. వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నిధులున్నా నిర్లక్ష్యమే...

• సంక్షేమశాఖ తీరుపై ఆర్థికశాఖ మండిపాటు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ప్రజల సంక్షేమానికి, అభివృద్ధే ధ్యేయంగా ప్రారంభించిన పథకాలు అమలు తీరుతెన్నులు ఆర్థికమంత్రిత్వశాఖను ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. ప్రభుత్వం సంక్షేమశాఖలకు కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు చేయడం లేదని ఆర్థికశాఖా మంత్రి యనమల రామకృష్ణుడు ఆయాశాఖలకు చెందిన ఉన్నతాధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినా.. ఫలితం కలనిపించడం లేదు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, కాపు, బీసీ, బ్రాహ్మణ కార్పొరేషన్, గృహనిర్మాణం తదితర సంక్షేమ శాఖల పనితీరుపై పర్యవేక్షణ సమీక్షించడానికి నియమించిన మంత్రివర్గ ఉప సంఘం తన పూర్తి అసహనాన్ని వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమశాఖలకు కేటాయించిన నిధులను ఆయా శాఖలు త్వరితగతిన ఖర్చుచేయకుండా, తమశాఖకు మరిన్ని అదనపు నిధులు అవసరమని ప్రతిపాదనలు సమర్పించడం ఆర్థికశాఖను మరింత ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. గడచిన మూడేళ్లలో ప్రభుత్వం కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు చేయకపోవడానికి గల కారణాలను తక్షణమే ఆర్థికశాఖకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆదేశించి ఇప్పటికి రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఇంత వరకూ ఏఒక్కరూ తమ నివేదికను సమర్పించకపోవడం పరిశీలిస్తే.. అధికారుల అలసత్వం ఏమేరకు ఉందో స్పష్టం అవుతోంది. పథకాల అమలులో ఏమైనా క్షేత్రస్థాయిలో అధికారులకు ఎదురవుతున్న ఇబ్బందులను కూడా ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదేశించారు. అధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొని ప్రకటించిన పథకాలకు తగిన నిధులు విడుదల చేస్తామని, వాటిని సరైన రీతిలో అమలు చేయవలసిన బాధ్యత క్షేత్రస్థాయిలోని అధికారులపైనే ఉందని మంత్రి యనమల సమీక్షా సమావేశంలో స్పష్టం చేశారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని పదేపదే చెబుతున్నప్పటికీ ఎక్కడో ఒక చోటు ఇంకా అవినీతికి చోటు ఉందన్న అనుమానాలు ఉన్నట్ల ఉన్నతాధికారులు వ్యాఖ్యానించారు. ప్రతీ నెలా లబ్ధిదారులకు ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేస్తున్న విధంగానే విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు కూడా మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని, ఇదుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాల్సిందిగా ప్రాథమిక, ఉన్నతవిద్యాశాఖ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్థికశాఖ ఉన్నతాధి కారులు వెల్లడించారు. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి జాప్యం లేకుండా స్కాలరషిప్‌లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించనుననారు.

నత్తనడకన గృహనిర్మాణాలు

రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాలకు నిర్దేశించి రూపొందించిన గృహనిర్మాణ పథకంపైనా ఆర్థికశాఖ కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఇప్పటి వరకూ జరిగిన పనుల తీరును పరిశీలిస్తే ఆశించిన రీతిలో పనులు జరగడం లేదన్నది వాస్తవమని ఆర్థికశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. గృహనిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని, రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు 26 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించామని, ఆ పథకాలను సక్రమంగా అమలు చేసి ఫలితాలను లబ్ధిదారులకు చేర్చాలని కోరారు. త్వరలో అన్ని పథకాల నిధులు లబ్ధిదారులకు ఆన్‌లైన్‌లోనే చేరనున్నాయని, ఆయా పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. జ్ఞానభూమి పథకం పరిధిలో ప్రభుత్వ సంక్షేమశాఖలకు, కళాశాలలకు అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. 16 లక్షల స్కాలర్‌షిప్పుల దరఖాస్తులను పరిశీలించడానికి ఎక్కువ సమయం పడుతుందని, అందువల్ల ఇక నుండీ ఆధార్‌తో అనుసంధానం చేస్తూ కళాశాల స్థాయిలోనే పరిశీలించి, స్కాలర్‌షిప్‌లను త్వరగా విడుదల చేయాలని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. నవంబరు నుండి కొత్త పథకాల గృహనిర్మాణాలు చురుగ్గా జరుగుతాయని అధికారులు వివరించారు.

రాష్ట్రంలో 19 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

• రూ. 263 కోట్ల నిధులు కేటాయింపు • 1968 ఉద్యోగాల కల్పనే ధ్యేయం • ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ వెల్లడి

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో 263 కోట్ల రూపాయల విలువైన 19 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేష్‌కుమార్ వెల్లడించారు. ఈ యూనిట్ల కల్పనతో రాష్ట్రంలోని సుమారు 1968 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సీఎస్ తెలిపారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధికల్పన కమిటీ సమీక్షా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ఎంతో ప్రాధ్యాన్యత ఇస్తోందని దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. పారిశ్రామికాభివృద్ధితోనే ఉపాధికల్పన సాధ్యమవుతుందని, అదే సమయంలో పరిశ్రమలకు పలు సబ్సిడీల రూపంలో అందజేసే ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ఉన్నాధికారులపై ఉందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రాష్ట్రంలో ఎంతో అనుకూలమైన వాతావరణ ఉందన్నారు. హార్టికల్చర్ రంగం అభివృద్ధికి ఫుడ్ ప్రాజెసింగ్ యూనిట్లు ఎంతో కలక పాత్ర పోషిస్తాయన్నారు. అయితే ఈ యూనిట్ల మంజూరు చేసే సమయంలో ఆయా పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలను స్థానికంగా లభ్యమవుతున్నాయా..? లేదా? అనే అంశాన్ని పరిశీలించాన్నారు. ముఖ్యంగా రైతులకు ఈ యూనిట్ల వల్ల లబ్ధి చేకూరాలని, అదే సమయంలో స్థానిక యవతకు ఉపాధి అవకాశాలు కూడా లభ్యం కావాలని సీఎస్ అన్నారు. ప్రభుత్వ సబ్సిడీలతో పాటు భూములు తీసుకొని ఉత్పత్తి ప్రారంభించని సంస్థలపై మరింత కఠినంగా వ్యవహరించాలని సీఎస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయదలచిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల వివరాలను స్టేట్ లెవెల్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేష్‌కుమార్‌కు వివరించారు. ఆయా యూనిట్ల వివరాలు, వాటి వల్ల ఎంత మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయా అనే అంశాలను సీఎస్ దృష్టికి తీసుకు వచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనతో హార్టికల్చర్ రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని సిఎస్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఆయా యూనిట్ల వారీగా చర్చించారు. అనంతరం రూ.263.43 కోట్ల విలువైన 19 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సీఎస్ అనుమతులు మంజూరు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాద్, హార్టికల్చర్ కమిషనర్ చిరంజీవి చౌదరి, స్టేట్ లెవెల్ ఎంపవర్ కమిటీ కార్యదర్శి ప్రసాద్, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పనులు

• అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూంలు
• సీఎం ఆదేశాలను త్వరలో అమలు చేస్తాం: మునిసిపల్ ముఖ్యకార్యదర్శి కరికల్

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతమైనా అభివృద్ధికి దూరంగా ఉంటే దానిని కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా అభివృద్ధి పథంలోకి నడిపిస్తామన్న ముఖ్యమంత్రి హామీలను నెరవేర్చేందుకు వీలుగా రాష్ట్ర మున్సిపల్‌శాఖ అడుగులు వేస్తోంది. వెలగపూడి సచివాలయంలోని 2వ బ్లాక్‌లో రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ ఆధ్వర్యంలో కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్‌లో రోజు రోజుకూ ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ సందర్భంగా మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి కరికల్ వెల్‌వేన్ 'ఆంధ్రప్రభ' ప్రతినిధితో మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని పంచాయితీరాజ్, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పనితీరుపై సమర్థవంతంగా పనులు నిర్వహించేందుకు వీలుగా ఈ 'సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్' తన పని తీరును తీర్చిదిద్దుతోందని వెల్లడించారు. ప్రతీ రోజుకూ కనీసం 200 నుంచి 275 ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిలో ప్రభుత్వం తక్షణమే సమస్య పరిష్కారానికి వీలుగా సంబంధితశాఖ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో 60 శాతం నుండి 73 శాతం వరకూ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. రాష్ట్ర మున్సి పల్ పరిపాలనాశాఖ తన పనితీరును దశల వారీగా 'ఆన్‌లైన్' విధానాన్ని అమలుచేయడంతో అవినీతికి దూరంగా పనులు వేగంగా జరిగే అవకాశాలున్నాయని మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి కరికల్ వెల్‌వేన్ వెల్లడించారు. ఈ కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని పనుల పురోగతిని, సమస్యల పరిష్కారానికి అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, వానిరి తగిన సహాలు సూచనలు అందిస్తూ సమస్య సత్వర పరిష్కారానికి సిబ్బంది కృషి చేస్తున్నట్లు కరికల్‌వెల్‌వేన్ వెల్లడించారు. 'ఏయే గ్రామాల్లో బ్లాక్‌స్పాట్స్ ఉన్నాయో వాటిని కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా సమీక్షించి కేవలం ఒక్కరోజులోనే వాటిని గ్రీన్‌స్పాట్‌గా మార్చడానికి ఈ సెంటర్ దోహదపడుతుందని మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి కరికల్ వెల్‌వేన్ తెలిపారు. స్థానిక సమస్యలు సెంట్రల్ కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా వెలుగు లోకి వస్తాయని, ప్రజలు తమ సమస్యలను ఎప్పటికప్పుడు ఈ కేంద్ర యాప్ సమస్యలను తమ దృష్టికి తీసుకొని రావచ్చున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ భారత్‌లో భాగంగా కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ పనితీరు ఉంటుదన్నారు. త్వరలో 13 జిల్లాల్లోనూ కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, త్వరలో వాటిని జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల ఆధ్వర్యంలోనే ప్రజా సమస్యలను పరిష్కరించేందుక వీలుగా ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. అంతేకాకుండా, ఇప్పటికే రాష్ట్ర మున్సిప ల్‌శాఖ ఇంటిపన్ను, మంచినీటి సరఫరాకు సంబం ధించిన బిల్లుల వసూళ్లు ఆన్‌లైన్ ద్వారా చేపట్టడంతో అవినీతిని అరికట్టగలిగామని సిఎం స్ప ష్టం చేశారు. అన్ని మున్సిపాల్టీలను త్వరలో స్మార్ట్ సిటీలుగా మారుస్తామని వెల్లడించారు. కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా పార్కుల అభివృద్ధి, గ్రీనరీ, రోడ్ల డివైడర్లు, , వీధిదీపాలు, గ్రామీణ రోడ్ల అభివృద్ధి పనులు చేపడతామని కరికల్ వెల్‌వేన్ స్పష్టం చేశారు.

బీహార్ వరద బాధితులను ఆదుకునేందుకు

ముందుకొచ్చిన ముస్లిం మత గురువులు

• కృష్ణా జిల్లాలో సమావేశం • రూ. 70 వేల నగదు సేకరణ



అమరావతి, ఆంధ్రప్రభ : రానున్న బక్రీద్ పండుగ నమాజ్ సమయంలో ప్రతి మసీదు నుంచి దాతల ద్వారా విరాళాలు, బియ్యం, దుస్తులు వంటివి సేకరించి బీహార్ రాష్ట్రానికి పంపి సహకరించాలని ముస్లిం మత గురువులు పిలుపునిచ్చారు. బీహార్ వరద బాధితులను ఆదుకోవడం కోసం కృష్ణాజిల్లా కొండపల్లి షాబుకారీ మసీదు ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఉల్ మాయే ఆహలేసున్నత్ మతగురువుల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. బీహార్ రాష్ట్రంలో వరద బీభత్సానికి బలైనా చాలా మంది తమ ఇళ్లు, నిత్యావసర వస్తువులు సహా సర్వం కోల్పోయి నిరాశ్రయులైనట్లు సమావేశంలో పాల్గొన్న మత గురువులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సమావేశానికి హాజరైన ఈమమ్ మత గురువులు తమ జీతాల నుంచి శక్తిమేరకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బీహార్ వరద బాధితులను తక్షణమే ఆదుకోవాలని మత గురువులు కోరారు. భారత దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఇలాంటి విపత్తుల సమయంలో సహృదయంతో స్పందించి సాయం చేయాలని, ఇది ప్రతి భారతీయుని బాధ్యత అని వారు అభిప్రాయపడ్డారు. ఈమామ్‌లు, మత గురువులు మసీదులకు మాత్రమే పరిమితం కారని, దేశ సేవ, మానవ సేవ విషయంలో కూడా ముందుంటారని వారీ సందర్భంగా తెలిపారు. ఇస్లాంలో పేదవారి ఆకలి బాధ తీర్చడం, ఎదుటి వారిని ఆదుకోవడం నిజమైన పండుగగా పవిత్ర ఖురాన్‌లో ప్రవక్త చెప్పిన మాటలను వారు గుర్తు చేశారు. అందుకే రంజాన్, బక్రీద్, మిలాదున్నబీ వంటి పవిత్ర పర్వదినాల్లో పేదవారిని ఆదుకోవడమే పరమావధి అనే లక్ష్యం మిళితమై ఉందన్నారు. సమావేశంలో పాల్గొన్న మహ్మద్ అల్తాఫ్ రాజా తన వంతు విరాళంగా రూ.31వేలు ప్రకటించగా, మిగిలిన మత గురువులు తమ తమ విరాళాలు ప్రకటించి సేవా తత్పరతను చాటుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా బీహార్ వరద బాధితుల సహాయార్థం రూ.70వేల విరాళాల రూపంలో సేకరించారు.

నేడు చివరి వెబ్ కౌన్సెలింగ్

• ఎంబీబీఎస్ 24, బీడీఎస్ 211 సీట్లు భర్తీ

అమరావతి, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష మెరిట్ ఆధారంగా రాష్ట్రంలో తొలిసారిగా చేపడుతున్న ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకొంది. బుధవారం కన్వీనర్ కోటా సీట్లకు ఐదవ విడత వైబ్ కౌన్సిలింగ్‌ను నిర్వహించనున్నారు. 2017-18 వైద్య విద్యా సంవత్సరానికి గాను డాక్టర్ ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా సీట్ల భర్తీకి యూనివర్శిటీ అధికారులు గత నెల రోజులుగా కసరత్తు చేస్తున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు గాను జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షకు రాష్ట్రం నుంచి 44,640 మంది ఇంటర్మీడియట్ అర్హత గలిగిన విద్యార్థులు హాజరు కావడం జరిగింది. ఈ పరీక్షల్లో 32,392 మంది అర్హత సాధించగా, వారిని సర్టిఫికేట్‌ల పరిశీలన కోసం యూనివర్శిటీ అధికారులు పిలవడం జరిగింది. జులై 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వారం రోజుల పాటు ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయంలో జరిపిన ధృవపత్రాల పరిశీలన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రభుత్వ, 15 ప్రైవేటు ఎంబీబీఎస్ కళాశాలల్లోని 4,050 ఎంబీబీఎస్ సీట్లకు, 2 ప్రభుత్వ, 13 డెంటల్ కాలేజీల్లోని 1,340 బీడీఎస్ సీట్లకు కౌన్సిలింగ్‌ను నిర్వహించడం జరిగింది.

నిబంధనలు కఠినతరం..

గత నెల రోజుల కాలంలో ఏ,బీ,సీ కేటగిరీలకు నాలుగు విడతలుగా కౌన్సిలింగ్ నిర్వహించి, విద్యార్థులకు కోరుకున్న కళాశాలల్లో సీట్లను అలాట్ చేయడం జరిగిందన్నారు. ప్రతి కౌన్సిలింగ్‌లో సీట్లను పొందుతూ కేటాయించిన కళాశాల్లో చేరకుండా మెరుగైన కళాశాలలకోసం ఇతర రాష్ట్రాల కౌన్సిలింగ్‌లకు హాజరవడం విద్యార్థులకు పరిపాటిగ మారింది. దీనితో ఏటా కొన్ని సీట్లు ఖాళీలుగానే ఉండేవి. కానీ ఈసారి ఎట్టిపరిస్థితిల్లో ఖాళీలకు అవకాశం లేకుండా యూనివర్శిటీ అధికారులు నిబంధనలు కఠినతరం చేశారు. గత మూడు కౌన్సిలింగ్‌లకు హాజరైన విద్యార్థుల్లో సీటు అలాట్ మెంట్ పొందిన కళాశాలలకు గైర్హాజరు కావడంతో నాలుగవ విడత కౌన్సిలింగ్‌కు వారిని హాజరుకాకుండా నిషేదించడం జరిగింది. ఈ విధంగా 60 మంది ఎంబీబీఎస్, 320 మంది బీడీఎస్ ఏ కేటగిరీ సీట్లకు కోల్పోయారు. వాటికోసం ఆదివారం నిర్వహించిన నాలుగవ విడత వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా 36 ఎంబీబీఎస్, 109 బీడీఎస్ సీట్లను అర్హులైన నూతన నీట్ ర్యాంకర్లకు కేటాయించడం జరిగింది. ఇక మిగిలిన 24 ఎంబీబీఎస్, 211 బీడీఎస్ సీట్ల కోసం బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా అర్హులైన విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

జాయిన్ కాకపోతే రూ.3 లక్షల ఫైన్ - రిజిస్ట్రార్ అప్పల నాయుడు..

ఐదవ విడత వైబ్ కౌన్సిలింగ్ ద్వారా ఏ కేటగిరీ ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను పొందిన విద్యార్థులు వారికి కేటాయించిన కళాశాలల్లో 31 తేదీన తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. సీటు అలాట్ మెంట్ పొంది, కేటాయించిన కళాశాలకు గడువులోగా హాజరు కాకపోతే వారి నుంచి రూ.3 లక్షలను అపరాధ రుసుముగా వసూలు చేయడంతోపాటు రెండు సంవత్సరాల పాటు వెబ్ కౌన్సిలింగ్స్‌లో పాల్గొనకుండా డీబార్ చేయడం జరుగుతుందని రిజిస్ట్రార్ హెచ్చరించారు.

ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగుతున్న అల్పపీడనం

• ఉత్తర కోస్తాకు భారీ వర్ష సూచన

విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో: ఒడిశా తీరం సమీపంలోని వాయువ్య బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనం ఛత్తీస్‌ఘడ్ మీదుగా ముందుకు సాగుతుంది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కూడా అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం వుందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గంటకు 17 కిలో నాట్స్ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం వుందని, వర్షంతోపాటు కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం వుందని కూడా అధికారులు చెబుతున్నారు. అల్పపీడనం సముద్ర మట్టానికి 7.6 కిలో మీటర్ల ఎత్తులో వున్న ఉపరితల ఆవర్తనంతో కలిసి ముందుకు కదులుతోందని అధికారులు స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాలతోపాటు అనేక ప్రాంతాల్లో వర్ష ప్రభావం అధికంగా వుంటుందని తెలియజేశారు. ఇప్పటికే రాష్ట్రం మీదుగా ద్రోణి కొనసాగుతుందని, దీని ప్రభావం వల్ల గడిచిన రెండు రోజుల్లో వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఇప్పటివరకూ కుప్పంలో 16 సెంటీమీటర్లు, పలాసలో 12, కొమరాడ, గరుగుబిల్లి, పాడేరులలో 9 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయ్యింది. సీతానగరం, పాతపట్నం, పార్వతీపురం, టెక్కలిలో 8, వేపాడ, జియ్యమ్మవలసలలో 7 సెంటీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదయ్యింది.

విశాఖ జిల్లాలో ప్రమాద స్థాయికి చేరుకున్న పెద్దేరు రిజర్వాయర్

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మాడుగుల మండలంలోని పెద్దేరు రిజర్వాయరు నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. ఈ రిజర్వాయర్ ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 1000 క్యూసెక్కులుగా వుందని అధికారులు తెలిపారు. పెద్దేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 138 మీటర్లు కాగా, ఇందులో ఇప్పటికే 136 మీటర్ల నీరు వుండడంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

శ్రీకాకుళం వరద పరిస్థితిపై

సీఎం చంద్రబాబు సమీక్ష

అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగానికి ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ : గడిచిన రెండు రోజులుగా ఒరిస్సాలో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీకాకుళం జిల్లాలోని నాగావళి, తోటపల్లి, వంశధార రిజర్వాయర్లకు భారీగా వరదనీరు చేరుకుంటుంది. దీంతో శ్రీకాకుళం జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు సమకూర్చాలని అధికార యంత్రాంగానికి సూచించారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా ఈ సహాయక చర్యల్లో భాగస్వాములను చేయాలన్నారు.

తుంగభద్ర డ్యాంలో పెరిగిన నీటిమట్టం

• 17,443 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ఉరవకొండ, కెఎన్ఎన్: తుంగభద్రడ్యాంకు వరదనీరు చేరుతుండటంతో తుంగభద్రడ్యాంలో నీటి మట్టం పెరిగి నీటితో కళకళలాడుతుంది. మంగళవారం తుంగభద్ర ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురువడంతో వరదనీరు చేరడంతో 1621.27 అడుగులుగా ఉంది. డ్యాంలో ప్రస్తుతం నీటి సమార్థ్యం 61.740 టీయంసీలుగాను, ఇన్‌ఫ్లో 17443 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లోటో 769 క్యూసెక్కులుగా ఉంది. దీంతో ఆంధ్ర, కర్నాటక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డ్యాంలో నీటి మట్టం పెరుగుతుండటంతో హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత నెల రోజుల నుంచి డ్యాంలో నీటి మట్టం పెరగకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఒక్కసారిగా తుంగభద్రడ్యాంలో పెరిగిన నీటి మట్టం వల్ల ఆయకట్టు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అత్యుత్తమంగా ఆడాను: సింధు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జపాన్ షట్లర్ ఒకుహరతో జరిగిన ఫైనల్లో తాను అత్యుత్తమ ప్రదర్శన చేశానని పీవీ సింధు చెప్పింది. ప్రతి ఒక్కరికి ఒక శైలి అంటూ ఉంటుంది. అలాగని చైనా వాళ్లు భిన్నంగా ఆడతారని కాదు. టోర్నీలో వారు మెరుగ్గా ఆడారు. కానీ ప్రతి ఒక్కరికి ప్రత్యేక శైలి ఉంటుంది'' అని సింధు అంది. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజతం గెలిచి సింధు, కాంస్యం గెలిచి సైనా నెహ్వాల్ తిరిగి హైదరాబాద్ రావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో తెలంగాణా బ్యాడ్మింటన్ అధికారులు ఘనస్వాగతం పలికారు. కోచ్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను పతకం గెలవగలిగానని సింధు చెప్పింది. ''తాను బాగా పోరాడాను, కానీ ఆరోజు నాకు కలిసి రాలేదు'' అని చెప్పింది. ''కఠినంగా ప్రాక్టీసు చేశాం. టోర్నీలకు మధ్య ఎక్కువ విరామం లేదు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ముందు మాకు ఒకటిన్నర నెల మాత్రమే సమయం దొరికింది'' అంది. ''మానసికంగా,. శారీరకంగా చాలా అలసిపోయా. కానీ మ్యాచ్‌ల దగ్గరకొచ్చేసరికి ఆడాలన్న ఆలోచన తప్ప ఇంకేమీ ఉండదు. చాలా సుదీర్ఘ ర్యాలీలు ఆడా. దీంతో శక్తిని కాపాడుకోలేకపోయాను'' అని వివరించింది. ''అభిమానులు హర్షధ్వానాలు చేసినా నేను ఇబ్బంది పడలేదు. నాకు కూడా చాలా మద్దతుదారులు ఉన్నారు. ఆటపైనే దృష్టిపెట్టా'' అని సింధు తెలిపింది.



ఇంకా ఎన్నో పతకాలు గెలుస్తుంది: గోపి

హైదరాబాద్: పీవీ సింధు తన కెరీర్ ముగిసేసరికి ఎన్నో స్వర్ణాలు గెలుస్తుందని బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపిచంద్ అన్నాడు. ''ఆమెకిపుడు 22 ఏళ్లు. వరుసగా నాలుగేళ్లుగా పతకాలు గెలుస్తోంది. ఈ లెక్కన సింధు తన కెరీర్ ముగిసే సరికి ఎన్నో పతకాలు వశం చేసుకుంటుంది. సింధు, సైనా లాంటి వాళ్లు ఉండడం మన అదృష్టం. వీరి వల్ల మన ఫిట్‌నెస్ స్థాయులు పెరిగాయి.'' అన్నాడు. ఆయన మంగళవారం సైనా, సింధు తదితరులతో కలిసి గ్లాస్గో నుంచి నగరానికి తిరిగి వచ్చాడు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ తమకు గర్వకారణమన్నాడు. యావత్తు బృందం మెరుగైన ప్రదర్శన ఇచ్చిందని, ఇది చీఫ్ కోచ్‌గా తనకు తృప్తినిచ్చిందని తెలిపాడు. సింధు కెరీర్ ముగిసేసరికి మరెన్నో పసిడి పతకాలు దక్కించుకుంటుందని చెప్పాడు.

ఆటగాళ్లు షెడ్యూలుకు అలవాటు పడాలి:

మ్యాచ్‌ల షెడ్యూలుకు క్రీడాకారులు అలవాటు పడాలని గోపీచంద్ అన్నాడు. ఆదివారం ముగిసిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో షెడ్యూలు విషయంలో తలెత్తిన వివాదాన్ని ప్రస్తావిస్తూ గోపి ఆ విధంగా వ్యాఖ్యానించాడు. ''ఇది ఒకరకంగా సమస్యే. కానీ కొన్నిసార్లు మనం దీనివల్ల నష్టపోతాం. పీవీ సింధు సెమీఫైనల్ మ్యాచ్ శనివారం అర్థరాత్రి వరకు సాగింది. దాదాపు 1.30 గంటలైంది. ఆ సమయానికి ఆమె నిద్రపోవాలి. ఎందుకంటే మర్నాడు ఉదయమే ఫైనల్ మ్యాచ్ ఉంది. కానీ కొన్నిసార్లు మ్యాచ్‌లు సుదీర్ఘంగా సాగినపుడు అదనపు శక్తిని వెచ్చించాల్సివుంటుంది. అపుడే చిన్న విషయాలు కూడా మ్యాచ్‌పై ప్రభావం చూపుతాయి'' అన్నాడు.


విమానాశ్రయంలో సైనా


సింధుతో చాముండి

సింధు, సైనాలకు గవర్నర్ అభినందన

ప్రపంచ ఛాంపియన్‌షిప్ నుంచి పతకాలతో తిరిగి వచ్చిన పీవీ సింధు, సైనా నెహ్వాల్‌లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణా గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అభినందించారు. భవిష్యత్తులో వారు మరిన్ని పతకాలు గెలవాలని ఆయన ఆకాంక్షించారు.


రాష్ట్రపతి నుంచి ఖేల్‌రత్న అందుకుంటున్న జఝూరియా, సర్దార్


ధ్యాన్‌చంద్ అవార్డు విజేత సయ్యద్ షాహిద్ హకీం


ద్రోణాచార్య జీఎస్ఎస్‌వీ ప్రసాద్


అర్జున.. సురేఖ, సాకేత్, కౌర్


క్రీడా పురస్కార గ్రహీతలతో రాష్ట్రపతి కోవింద్

ఖేల్‌రత్న అందుకున్న జఝూరియా, సర్దార్

న్యూఢిల్లీ: జావెలిన్ త్రోయర్ దేవేంద్ర జఝూరియా, హాకీ జట్టు కెప్టెన్ సర్దార్ సింగ్.. అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ ఖేల్‌రత్న అందుకున్నారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఇక్కడి రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా వీరు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. వీరితో పాటు 17 మంది అర్జున, ఆరుగురు ద్రోణాచార్య, ముగ్గురు ధ్యాన్‌చంద్ అవార్డు విజేతలు కూడా పురస్కారాలను అందుకున్నారు. అర్జున విజేత క్రికెటర్ పుజారా ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో కౌంటీలు ఆడుతుండడంతో అవార్డు ప్రదాన కార్యక్రమానికి హాజరు కాలేకపోయాడు. 2004, 2016 ఒలింపిక్స్‌లో రెండు స్వర్ణాలు గెలుచుకున్న జఝూరియా ప్రతిష్ఠాత్మక ఖేల్‌రత్న పురస్కారం అందుకున్న తొలి పారాథ్లెట్‌గా చరిత్రకెక్కాడు. 22 ఏళ్లకే 2008లో యువ కెప్టెన్‌గా సుల్తాన్ అజ్లాన్‌షా కప్‌లో భారత జట్టుకు సర్దార్ సింగ్ సారథ్యం వహించాడు. పారా అథ్లెటిక్స్‌లో మరియప్పన్ తంగవేలు, వరుణ్ భాటి కూడా అర్జున అవార్డుతో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. మరియప్పన్ రియోలో (ఎఫ్ 46) హైజంప్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. భాటి ఇదే ఒలింపిక్స్‌లో రజతం గెలిచాడు.

ఖేల్‌రత్న: దేవేంద్ర జఝూరియా, సర్దార్ సింగ్

అర్జున: జ్యోతి సురేఖ (ఆర్చరీ), సాకేత్ మైనేని (టెన్నిస్), ఖుష్‌బీర్ కౌర్ (అథ్లెటిక్స్), అరోకియా (అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), పుజారా (క్రికెట్), బెంబెమ్ దేవి (ఫుట్‌బాల్), చౌరాసియా (గోల్ఫ్), హర్మన్‌ప్రీత్ (క్రికెట్), సునీల్ (హాకీ), జస్వీర్ (కబడ్డీ), పీఎన్ ప్రకాశ్ (షూటింగ్), అమల్ రాజ్ (టీటీ), కదియన్ (రెజ్లింగ్), మరియప్పన్ తంగవేలు (పారా అథ్లెట్), వరుణ్ భాటి (పారా అథ్లెట్).

విండీస్ అద్భుత విజయం


హోప్

లీడ్స్: ఎస్‌డి హోప్ (118 నాటౌట్, 211 బంతుల్లో, 14 ఫోర్లు) అద్భుతంగా ఆడి అజేయ సెంచరీ సాధించడంతో రెండో టెస్టులో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌పై గెలిచింది. 322 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 91.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి (322) అందుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో 490-8 స్కోరు వద్ద ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి విండీస్ ఎదుట 322 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (147) చేసిన హోప్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా విజృంభించి ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో శతకం సాధించిన ఓపెనర్ బ్రాత్‌వైట్ సెంచరీకి (95) ఐదు పరుగుల దూరంలో ఔటయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 258 పరుగులు, విండీస్ 427 పరుగులు చేశాయి. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమమైంది.

గౌరవ్‌కు పతకం ఖాయం


ప్రపంచ బాక్సింగ్‌లో సెమీస్‌కు

హాంబర్గ్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో గౌరవ్ బిదురికి పతకం ఖాయమైంది. అతను మంగళవారం సెమీ ఫైనల్ చేరాడు. బాంటమ్ వెయిట్ విభాగం (56 కిలోలు) క్వార్టర్స్‌లో గౌరవ్.. ట్యునీషియా బాక్సర్ బిలెల్ మహ్మదిపై స్ప్లిట్ డెసిషన్‌లో విజయం సాధించాడు. ప్రపంచ బాక్సింగ్‌లో పతకం సాధించిన నాలుగో భారత బాక్సర్‌గా గౌరవ్ రికార్డు సృష్టించాడు. సెమీస్‌లో బుధవారం అతను అమెరికా బాక్సర్ డ్యూక్ రగన్‌తో పోరాడతాడు.

మెరిసిన షరపోవా

● తొలి రౌండ్లో హెలెప్‌పై గెలుపు



న్యూయార్క్: రష్యా భామ మరియా షరపోవా.. యుఎస్ ఓపెన్‌లో మెరిసింది. తొలి రౌండ్లో ఆమె 6-4, 4-6, 6-3తో రెండో సీడ్ సిమోనా హెలెప్ (రొమేనియా)ను మట్టికరిపించింది. మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో వీరిద్దరి పోరు ఫైనల్‌ను తలపించింది. నిషేధిత ఉత్ప్రేరకాలు వాడిన ఆరోపణలపై గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా 15 మాసాల నిషేధానికి గురైన షరపోవా.. యుఎస్ ఓపెన్‌లో వైల్డ్‌కార్డ్ ప్రవేశం లభించిన సంగతి తెలిసిందే. కిక్కిరిసిన ఆర్థర్ ఆష్ స్టేడియంలో సోమవారం రాత్రి 30 ఏళ్ల షరపోవా రెండు గంటల 44 నిమిషాల పాటు పట్టుదలతో పోరాడింది. గత 18 మాసాలుగా మానసిక క్షోభకు గురైన మాజీ నెంబర్ వన్ షరపోవాకు ఈ విజయం నూతనోత్సాహం ఇచ్చింది. గాయాలతో బాధపడిన షరపోవా ఫామ్‌లో ఉన్న హెలెప్‌ను ఎదుర్కోవడంలో ఎలాంటి ఇబ్బందులు పడలేదు. ఆమెపై మరియా విజయాల రికార్డును 7-0కు పెంచుకుంది.


మంగళవారం కొలంబోలో ప్రాక్టీసు సందర్భంగా ధోని, విరాట్

అందులో ధోని ఘనాపాఠి: కుల్‌దీప్

కొలంబో: తనలాంటి యువ బౌలర్లపై మాజీ కెప్టెన్ ధోని ప్రభావం ఎంతో ఉందని స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అన్నాడు. కొలంబోలో గురువారం 300వ వన్డే ఆడబోతున్న ధోని.. బౌలర్ల సత్తాను అంచనా వేయడంలో మేటి అని కుల్‌దీప్ చెప్పాడు.

గెలుపు దిశగా ఆసీస్

ఢాకా: బంగ్లాదేశ్‌తో రసవత్తరంగా జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా గెలుపు దిశగా పయనిస్తోంది. 265 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ మంగళవారం మూడో రోజు ఆట ఆఖరుకు రెండు వికెట్లు నష్టపోయి 109 పరుగులు చేసింది. ఆసీస్ మరో మరో 156 పరుగులు చేయాలి. ఇంకా 8 వికెట్లు చేతిలో ఉన్నాయి. ఓపెనర్ వార్నర్ 75 పరుగులతో, కెప్టెన్ స్మిత్ 25 పరుగులతో క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులు చేసిన బంగ్లా.. ఆసీస్‌ను 217 స్కోరుకు ఆలౌట్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా 221 పరుగులు చేసి ఆసీస్ ఎదుట 265 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది.

కొంటాకు షాక్

● యుఎస్ ఓపెన్లో క్రునిక్ తొలి సంచలనం

● సిలిక్ ముందంజ

న్యూయార్క్: ఈ ఏడాది యుఎస్ ఓపెన్‌లో తొలి సంచలనం నమోదైంది. మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ బ్రిటన్ క్రీడాకారిణి జొహన్న కొంటాకు అలెక్సండ్రా క్రునిక్ (సెర్బియా) షాకిచ్చింది. సోమవారం రాత్రి జరిగిన తొలి రౌండ్ పోరులో క్రునిక్ 4-6, 6-3, 6-4 తేడాతో కొంటాను ఓడించింది. గతంలో ఇక్కడ రెండు సార్లు తొలి రౌండ్లోనే వెనుదిరిగిన క్రునిక్‌కు మరోసారి అదే ఫలితం ఎదురయ్యేలా కనిపించింది. ఆమె తొలి సెట్‌లో సునాయాసంగా ఓడింది. కానీ 2014లో పెట్రా క్విటోవాను కంగుతినిపించి ప్రిక్వార్టర్స్ చేరిన ఈ 78వ ర్యాంకర్ రెండో సెట్‌లో పుంజుకుని స్కోరును సమం చేసింది. నిర్ణయాత్మక మూడో సెట్లో క్రునిక్ ఒత్తిడిని తట్టుకొని సెట్‌ను, మ్యాచ్‌ను వశం చేసుకుంది. ''నేను పోరాడిన తీరు నాకు తృప్తినిచ్చింది'' అని క్రునిక్ సంతోషం వ్యక్తంచేసింది.


క్రునిక్ సంబరం

పోరాడి గెలిచిన సిలిక్: హోరాహోరీగా పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ పోరులో క్రొయేషియా ఆటగాడు మార్టిన్ సిలిక్ చెమటోడ్చి గెలిచాడు. ఈ ఏడాది వింబుల్డన్ ఫైనల్లో ఓడిన తర్వాత తొలి మ్యాచ్ ఆడిన సిలిక్ 6-4, 6-3, 3-6, 6-3తో అమెరికా ఆటగాడు టెన్నిస్ సండగ్రెన్‌పై గెలిచాడు. 2014 యుఎస్ ఓపెన్ విజేత సిలిక్ దాదాపు మూడు గంటల పాటు శ్రమించాడు. వింబుల్డన్ ఫైనల్లో గాయాల వల్ల వరుస సెట్లలో ఫెదరర్ చేతిలో ఓడినప్పటికీ సిలిక్‌లో ఆత్మస్థైర్యం సన్నగిల్లలేదు. ''నాలో కాస్త బద్ధకం ఆవహించినట్లు అనిపించింది. లయను అందుకోవడానికి నాకు మరికొన్ని మ్యాచ్‌లు అవసరం. మెరుగైన షాట్లు ఆడాను. ఐతే కొన్ని అనవసర తప్పిదాలు చేశాను'' అని సిలిక్ అన్నాడు. మరో పోరులో బ్రెజిల్ ఆటగాడు రొగెరియోను 7-5, 0-6, 6-3, 6-4తో ఓడించిన ఫ్లోరియన్ మేయర్ (జర్మనీ)తో సిలిక్ రెండో రౌండ్లో తలపడతాడు.

జంకొవిచ్‌ను ఓడించిన క్విటోవా: రెండుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ పెట్రా క్విటోవా (చెక్) రెండో రౌండ్లోకి దూసుకుపోయింది. మహిళల సింగిల్స్ పోరులో ఆమె 7-5, 7-5తో మాజీ నెంబర్ వన్ జెలెనా జంకోవిచ్(సెర్బియా)ను ఓడించింది. 13వ సీడ్ క్విటోవా.. జంకోవిచ్‌తో పోరులో కాస్త శ్రమించాల్సివచ్చింది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: M Satish Chandar, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వినాయకుడు...తెలుగుప్రజల గుండెల్లో మరచిపోలేని ఒక భక్తిజ్ఞాపకం. కళ్లనిండుగా కనిపించే భారీ రూపం... మనసునిండుగా కొలిచే వారి కోర్కెలు తీరుస్తాడనే పేరున్న దైవం. విఘ్నేశ్వరుని అనేక రూపాల్లో ఖైరతాబాద్ వినాయకుడు కూడా ఒక రూపమేమో అన్నంతగా ప్రాచుర్యం పొందిన భగవానుడు. అలాంటి మూర్తిని దర్శించుకుంటేనే తమ జన్మ సార్థకమవుతుందని భక్తులు భావిస్తుంటారు. మరి స్వయంగా ఆ మూర్తిని రూపొందించిన శిల్పికి ఆ దేవుడు ఇంకెంత దగ్గరనుకోవాలి. ఆ దగ్గరితనాన్ని, అపురూపమైన ఆ బంధాన్ని ఆంధ్రప్రభకు వివరించారు ఖైరతాబాద్ వినాయకుని రూపశిల్పి ....సి. రాజేంద్రన్. 1954లో ఖైరతాబాద్ వినాయకుని నిలబెట్టిన తరువాత ఎక్కువ సంవత్సరాలు వినాయకుని మలచిన శిల్పి ఆయనే. భక్తులకు ప్రీతిపాత్రుడిగా మారిన ఖైరతాబాద్ వినాయకునితో తన బంధాన్ని...ఆ క్రమంలో చోటుచేసుకున్న అనేక ఆసక్తికరమైన సంగతులను రాజేంద్రన్ ఆంధ్రప్రభ లైఫ్‌తో పంచుకున్నారు. ఆ విశేషాలను మీకందిస్తున్నాం-



ఖైరతాబాద్ మహాగణపతి రూపశిల్పి సి. రాజేంద్రన్‌తో ఆంధ్రప్రభ లైఫ్ ప్రతినిధి ప్రత్యేక సంభాషణ

నేను మలచిన దైవం నన్ను

ఖైరతాబాద్ వినాయకుడు నా జీవితంలో ఒక భాగంగా మారిపోయారు. ఆయన మూర్తిని తయారుచేసే అవకాశం యాదృచ్ఛికంగా నాకు దక్కినా...ఆ తరువాత స్వామితో నాకు విడదీయలేని అనుబంధం ఏర్పడింది. తనను మలచే అవకాశాన్ని స్వామే నాకు కల్పించారని భావిస్తాను. నేను సినీరంగంలో ఎంతో విస్తృతంగా పనిచేశాను. ఎన్నో మంచి చిత్రాల్లో నా వంతు కళా నైపుణ్యాన్ని ప్రదర్శించగలిగాను, కానీ..ఖైరతాబాద్ వినాయకుని శిల్పిగానే నాకు అమితమైన పేరు గుర్తింపు వచ్చాయి. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను.

50పైసల వేతనం నుండి...సినిమా సెట్టింగ్స్ కళాకారుడిగా...

తమిళనాడు పెరంబళూరు జిల్లాలో పుదువెట్టై కుడి గ్రామం మా సొంత ఊరు. ఐదో తరగతి వరకు చదువుకున్నాను. చాలా బీదకుటుంబం. ఏదో ఒక పనినేర్చుకోవాలని.. చెన్నై వెళ్లాను. ఒక హోటల్‌లో పనిచేస్తుండేవాడిని. అక్కడికి వేలూస్వామి అనే ఆర్టిస్ట్ వస్తుండేవారు. ఆయన చెన్నైలోనే పేరున్న కళాకారుడు. సినిమాల్లో సెట్టింగ్స్ విభాగంలో శిల్పాలు చేసేవారు. ఆయన నా స్థితి చూసి బాధపడ్డారు. ఈ వయసులో ఇలాంటి పనులు చేయకూడదు...నీకు పని నేర్పిస్తాను... అంటూ తీసుకువెళ్లారు. వేలూ స్వామి విజయా స్టూడియోలో పర్మనెంట్ ఆర్టిస్ట్‌గా ఉండేవారు. నా పని ఉదయం ఎనిమిది నుండి రాత్రి పన్నెండు వరకు ఉండేది. 50పైసలు కూలిగా ఇచ్చేవారు. వేలూస్వామి డ్యూటీకి వెళ్లిపోయాక మేమంతా పనిచేసేవాళ్లం. ఆయన సాయంత్రం ఆరుకి వచ్చి...ఇక్కడ పనిచేసిన ఆర్టిస్టుల పనికి కరెక్షన్లు చేసేవారు. ఇదంతా 1968 నాటి సంగతి. ఆరుపైసలకు కడుపునిండా అన్నం దొరికేది. అలా ఆయన దగ్గర మూడేళ్లు ఉన్నాక...1971లో ఎన్‌టి రామారావు గారి దగ్గరకు ఆయనే పంపారు. చెన్నైలో రంగరాజపురంలో ఎన్‌టి రామారావుకి సంబంధించిన ఒక వర్క్ షాపు ఉండేది. అందులో సినిమాలకోసం ఆభరణాలను తయారుచేయించేవారు. వాటికి రాళ్లను అతికించే పనిని చిన్నపిల్లలు చేసేవారు. దాంతో నేనా పనిలో చేరాను. అప్పుడే యశోదా కృష్ణ సినిమాకు పనిచేయడానికి నన్ను మైసూరుకి పంపారు. యశోదా కృష్ణసినిమాకు సుబ్బరాయన్ అనే ఆర్టిస్టు వద్ద అసిస్టెంటుగా పనిచేశా. ఆ తరువాత నుండి సహాయకుడిగా కాకుండా నేరుగా కళారంగంలో పనిచేయటం మొదలుపెట్టాను. అలా తమిళ కన్నడ తెలుగు సినిమాలను పనిచేశాను. తెలుగులో మహాకవి క్షేత్రయ్యకు సొంతంగా సెట్టింగ్స్ వేశాను.

ఎన్‌టిఆర్‌ని మెప్పించి...

నేను సినిమాలకు సొంతంగా పనిచేయటం మొదలుపెట్టినప్పుడే ఎన్‌టిరామారావు గారు హైదరాబాద్‌లో స్టూడియో కట్టి దానవీరశూర కర్ణ సినిమా మొదలుపెట్టారు. ఆ సినిమాకు పనిచేయడానికి చెన్నై నుండి ఆరువందలమంది హెల్పర్లుగా వచ్చారు. అందులో నేనూ ఒకడిని. సెట్టింగ్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవాడిని. అయితే అదే రోజుల్లో తమిళనాడులో పెను తుఫాను వచ్చింది. నాకు చెన్నైలో ఎవరూ లేరు... కానీ మిగిలిన వారందరికీ అయినవాళ్లు అక్కడే ఉండటంతో అందరూ వెనక్కు వెళ్లిపోయారు. మాతో పాటు విజయవాడకు చెందిన నాగయ్య అనే ఆర్టిస్టు పనిచేసేవారు. పనిచేసేవాళ్లంతా వెళ్లిపోవటంతో సినిమా పని ఎలా జరుగుతుంది...అని ఎన్‌టిఆర్ గారు అన్నపుడు...నాగయ్య నా పేరు చెప్పాడు. అతను ఒక్కడే పనిమొత్తం చేయించగలడని చెప్పటంతో ఎన్‌టిఆర్ నన్ను పిలిచి అడిగారు. నేను చేస్తానన్నాను. అప్పుడు చుట్టుపక్కల ప్రాంతాల్లో పదో తరగతి చదువుకున్న కుర్రాళ్లందరినీ పెట్టుకుని దానవీరశూర కర్ణ ప్యాచ్ వర్క్ మొత్తం పూర్తి చేసి ఇచ్చాను. అప్పుడు రామారావు గారు..హరికృష్ణగారిని పిలిచి...తరువాత సినిమాకు రాజేంద్రే పనిచేస్తాడని చెప్పి...నేను హైదరాబాద్‌కి రావడానికి డబ్బులు కూడా ఇచ్చారు. అలా చాణక్య చంద్రగుప్త...అక్బర్ సలీం అనార్కలి, శ్రీరామ పట్టాభిషేకం సినిమాలకు పనిచేశాను. ఆ తరువాత ఆయన సిఎం అయ్యాక సినిమా సెట్టింగ్స్ నుండి వారి సొంత ఇల్లు నిర్మాణం పనులకు మార్చారు. ఇళ్లు, సినిమా థియేటర్లు, ఆహ్వానం హోటల్...వీటన్నింటికీ సంబంధించిన పనులను చేశాను. అలా అక్కడితో సినిమా రంగం నుండి బిల్డింగు పనులకు వచ్చేశాను.

నేను చేసిన మొదటి ఖైరతాబాద్ వినాయకుడు...

ఇదిలా ఉండగా 1978లో రామకృష్ణా స్టూడియోలో పనిచేస్తున్నప్పుడే... రిజర్వుబ్యాంకులో ఉద్యోగిగా ఉన్న ఏసుపాదం...అనే ఆయన ...ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ మొదటి ఛైర్మన్ ఫౌండర్ అయిన శంకరయ్యగారిని కలిసి...ఆ సంవత్సరం వినాయకుని విగ్రహం తాను ఇస్తానని అడిగారు. 14 అడుగుల వినాయకుని పెట్టాలని నిర్ణయించుకుని...రామకృష్ణ స్టూడియోలో పనిచేస్తున్న నా దగ్గరకు వచ్చి...విగ్రహం తయారుచేసిపెట్టమని అడిగారు. అప్పుడు సంతోష్‌నగర్ కాలనీలో ఆయన ఇంటి వద్ద మొదటిసారి వినాయకుని విగ్రహాన్ని నేను తయారుచేశాను. ఖైరతాబాద్‌లో వినాయకుని బయటపెట్టటం కూడా అప్పుడే మొదలైంది. నాటి వినాయకుని కర్రలతో నిర్మాణం చేశాం. ఇనుము వాడలేదు. దాంతో విగ్రహం కాస్త దెబ్బతింది...దాన్ని ఖైరతాబాద్ వచ్చాక సరిచేశాను. శంకరయ్యగారికి నేను చేసిన విగ్రహం బాగా నచ్చింది. అయినా ఇతను కొత్తవాడు...ఎలా చేస్తాడోనని...ధూల్‌పేటలో కూడా మరొకటి తయారుచేయించారు. అలా ఆ సంవత్సరం ఇద్దరు వినాయకులకు పూజలు జరిగాయి.

ఇక ఆగని ప్రస్థానం...ఆ అనుబంధం అనంతం

రామకృష్ణస్టూడియోలో పని అయిపోతే...తిరిగి చెన్నై వెళ్లిపోతుండేవాడిని. అలాగే వినాయకచవితి తరువాత కూడా వెళ్లిపోయాను. దాంతో వారికి 1979లో నన్ను వెతికి పట్టుకోవాల్సివచ్చింది. అలా ఆ ఏడాది కూడా నేను వినాయకుని చేశాను. సారథి స్టూడియోలోనే 24 అడుగుల విగ్రహాన్ని రెండు భాగాలుగా తయారుచేశాము. అలా తయారుచేసి ఖైరతాబాద్ తీసుకొచ్చి అతికించేవాళ్లం. 1980లో కూడా సారథిలోనే రెండు భాగాలుగా 25 అడుగుల విగ్రహాన్ని తయారుచేశాను. 1981లో శంకరయ్యగారు విగ్రహాన్ని ఖైరతాబాద్‌లోనే తయారుచేయమన్నారు. అలా పంచముఖ వినాయకుని 26 అడుగుల ఎత్తులో తయారుచేశాం. అప్పుడు నిమజ్జనం సమయంలో ట్రాలీ విరిగిపోవటంతో.... వినాయకుని నెలరోజులపాటు ట్యాంక్‌బండ్‌మీదే ఉంచి పూజలు చేసి ఆ తరువాత నిమజ్జనం చేశాం. ఆ తరువాత 1982లో ఎలుకరథం వినాయకుని తయారుచేశాం. ఈసారి ట్రాలీ లేకుండా తయారుచేసి.... పూజ అనంతరం క్రెయిన్‌తో లేపి పెద్ద ట్రాలీమీద పెట్టి తీసుకువెళ్లాం. ఇలా చేయటం ఆ సంవత్సరం మొదలైంది. ఆ వినాయకుడికి కూడా జనంలో బాగా పేరొచ్చింది. ఆ విగ్రహం దగ్గర సాగరసంగమం షూటింగ్ కూడా తీశారు. 1982లో గణేష్ ఉత్సవ కమిటి వారు నాకు డబ్బు ఇవ్వకపోవటంతో...నేను కొన్నిరోజులు ఇక్కడే ఉండిపోయాను. ఇక విగ్రహాలు చేయనని కూడా చెప్పేశాను. అప్పుడు సికిందరాబాద్‌లోని ఒక రాజకీయ ప్రముఖుడు నాకు టికెట్ కొనిచ్చి చెన్నై పంపారు. 1983లో బ్రహ్మంగారనే ఆర్టిస్టు చేత చేయించారు. ఆయనకూడా మంచి ఆర్టిస్టే. అయితే పండుగ మూడు రోజులు ఉన్నదనగా కూడా విగ్రహం పూర్తి కాకపోవటంతో...మళ్లీ నా వద్దకే వచ్చారు. రాత్రి పగలు కష్టపడి పూర్తిచేసి ఇచ్చాను. అలా 1984 నుండి 1992 వరకు ఇతర ఆర్టిస్టుల సహకారం తీసుకోకుండా పూర్తిగా నేనే చేశాను. 1993నుండి 99 వరకు రామోజీ ఫిల్మ్ సిటీలో డెవలప్‌మెంట్ వర్క్ ఒప్పుకుని అక్కడికి వెళ్లటంతో నాకు విగ్రహ తయారీ కుదరలేదు. ఆ క్రమంలో శిల్పి, సినిమా ఆర్ట్ డైరెక్టర్ అయిన రంగారావు గారు విగ్రహాలు తయారుచేశారు. 2000వ సంవత్సరంలో రామోజీ ఫిల్మ్ సిటీ ప్రారంభం అయ్యాక తిరిగి ఇక్కడ వినాయకుని తయారుచేయటం మొదలుపెట్టాను. ఇక అప్పటినుండి ఆగింది లేదు. రామోజీ ఫిల్మ్‌సిటీలో ఉన్నపుడు కూడా చెప్పల్ బజార్ కోసం 20 అడుగుల వినాయకులకు చేసేవాడిని. అంటే 1978 నుండి వినాయకుని చేస్తూనే ఉన్నా. వినాయకునితో నాకున్న అనుబంధం ఏమని, ఎంతని చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా భక్తుల కోరికలు తీరుస్తున్న స్వామి ఆయన. నేను మలచిన ఆ దైవం.... నా జీవితాన్ని ...ఖైరతాబాద్ వినాయకుని శిల్పిగా మలిచారనిపిస్తుంది...



నన్ను మార్చిన నా స్వామి...మరింత నిష్ఠగా విగ్రహాల తయారీ...రాజేంద్రన్

1984లో వివాహం అయ్యాక హైదరాబాద్‌లోనే ఉంటున్నాను. నాకు ఇద్దరు పిల్లలు ఇద్దరూ కంప్యూటర్ ఇంజినీర్లే. 1982నుండి వినాయకుని విగ్రహతయారీలో నా దృక్పథం మారిపోయింది. ఇక డబ్బు అడగకూడదని...వాళ్లు ఇస్తే...తీసుకుంటాను తప్ప నేను అడగను అని నిర్ణయించుకున్నాను. 1986లో నాకు పెద్ద యాక్సిడెంట్ అయ్యింది. అప్పుడు వినాయకుడినే తలచుకున్నాను. అప్పటినుండి దీక్షలో తయారుచేయటం మొదలుపెట్టాను. 2002లో సురేంద్ర పురి పని ఒప్పుకోవటంతో ఆ సంవత్సరం కుదరదని చెప్పేశాను. వేరే వ్యక్తిని కూడా మాట్లాడాను. ఆ సమయంలో భువనగిరినుండి వస్తుండగా... అదే వ్యక్తి కాల్‌చేస్తే బండిమీద ఉండి ఫోన్ లిఫ్ట్ చేశాను. అంతే తరువాత ఏం జరిగిందో తెలియదు. బండిమీద నుండి కిందపడిపోయాను. అప్పుడు కూడా నేను తలచుకుంది వినాయకుడినే. ఈ యాక్సిడెంట్‌లో బండి నుజ్జయింది కానీ..నాకు ఒక్కగీత కూడా పడలేదు. యాక్సిడెంట్ తరువాత నేరుగా ఇక్కడికే వచ్చి...వినాయకుని నేనే చేస్తానని చెప్పాను. అప్పటి నుండి నాలో మరింత మార్పు వచ్చింది. వినాయకుని రూపకల్పనని చాలా నిష్ఠగా..ఒక్క పూట భోజనంతో..ఎలాంటి వ్యసనాలను దగ్గరికి రానీయకుండా చేయటం మొదలుపెట్టాను. అప్పటినుండి..ఖైరతాబాద్ వినాయకుని ప్రభ కూడా మరింతగా వెలగటం మొదలైంది. భక్తులు ఎక్కువగా రావటం, స్వామి పూజకి కొరత లేకుండా అన్నీ సమకూరటం...ఇలాంటివన్నీ జరుగుతున్నాయి. దాంతో నా నమ్మకం మరింతగా పెరిగింది. నేను ఎంత భక్తిశ్రద్ధలతో వినాయకుని తయారుచేస్తే...భక్తులకు అంతగా మేలు జరుగుతుందని బలంగా నమ్మటం మొదలుపెట్టాను. ఆ తరువాత మరొక విధానం కూడా పాటించడం మొదలుపెట్టాము. సిద్ధాంతి విఠల్‌శర్మని సంప్రదించి... వినాయకుని ఎలా తయారుచేస్తే భక్తులకు మంచి జరుగుతుందో తెలుసుకుని అలాగే చేస్తున్నాం. ఈ సంవత్సరం వినాయకుడు ఇలా ఉండాలని ఆయన చెప్పగానే స్వామి పూర్తి రూపం ఆ రాత్రే నా మెదడులోకి వచ్చేస్తుంది. తెల్లారి గ్రాఫిక్ అతని దగ్గర కూర్చుని డిజైన్ చేయిస్తాను.

అడుగు అడుగుతో పెరిగి..అందరివాడైన దైవం

సింగిరి సుదర్శన్ ముదిరాజ్, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఫౌండర్, ఛైర్మన్



బాలగంగాధర్ తిలక్ 1908లో గణేశ ఉత్సవాలు దేశవ్యాప్తంగా జరపాలని పిలుపు ఇచ్చారు. స్వాతంత్ర్యం తరువాత పార్లమెంటులో గణేశపూజల నిర్వహణపై అమెండ్‌మెంట్ వచ్చింది. దాంతో మా అన్నగారు సింగిరి శంకరయ్య 1954లో మొదటిసారి గణేశ ఉత్సవాలను ప్రారంభించారు. ఆయన స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్. శంకరయ్య తెలంగాణ అంతా తిరిగి వినాయక ఉత్సవాలపై ప్రచారం చేశారు. మొదట ఒక్క అడుగుతో మొదలుపెట్టారు. ఏడు అడుగులు...ఆపై 11 అడుగుల విగ్రహాలు పెట్టాము. ధురుసింగ్ అనే ఆర్టిస్టు ధూల్‌పేటలో వీటిని చేశారు. తరువాత సారధి స్టూడియోలో రంగారావు అనే ఆర్ట్ డైరక్టర్ చేత 16 అడుగుల విగ్రహాన్ని చేయించాము. దాన్ని మూడు భాగాలుగా చేసి ఇక్కడికి తెచ్చి అతికించాము. అక్కడినుండి విగ్రహం ఎత్తుని పెంచుతూ పోయాము. రంగారావుతో పాటు బ్రహ్మంగారు అనే శిల్పి కూడా చేశారు. దాదాపు 28 సంవత్సరాలు అలా జరిగాక ....రాజేంద్రన్ వచ్చారు. ఇంత సుదీర్ఘప్రయాణంలో ఆటంకాలు ఎన్నో వచ్చాయి. తీవ్రమైన అనారోగ్యాలనుండి కోలుకున్నాను.

ఒకసారి ఒక ముస్లిం వ్యక్తి ఫ్లవర్ డెకరేషన్ చేస్తున్నాడు. అప్పుడు 40 అడుగుల విగ్రహం. హైటెన్షన్ వైర్లవలన ప్రమాదం జరిగింది. చనిపోతాడనుకున్నాం. కానీ అతనికేమీ కాలేదు. అతనే వచ్చి 21 కొబ్బరికాయలు కొట్టి పూజ చేశాడు. పదేళ్ల క్రితం ఇలాగే ఒకసారి...క్రెయిన్ లేపగానే వైర్లు తెగాయి. వినాయకుడు పడిపోయాడు... కానీ ఎలాంటిప్రమాదమూ జరగలేదు. ఆ దేవుడు ఇప్పటివరకు ఎవరికీ ఎలాంటి హానీ జరగకుండా తన ఉత్సవాలను జరిపించుకుంటున్నాడు. ఇప్పుడు 160మంది కార్మికులు పనిచేశారు. 60నుండి 70 లక్షల వరకు ఖర్చవుతోంది. నేను ఎవరినీ డొనేషన్లు అడగటం లేదు. భక్తులు ఇవ్వాలనుకుంటే ఇక్కడికే వచ్చి ఇస్తారు. ఇదంతా సింగిరి శంకరయ్య కృషితోనే నిలబడి...నేటికీ కొనసాగుతోంది. రూపాయి రూపాయి చందాలతో నిలబడిన దేవుడు ఖైరతాబాద్ వినాయకుడు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించి మాకు మరింత తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా కోరుతున్నాం. ఆ భగవంతుడే నాతో తన ఉత్సవాలు చేయించుకుంటున్నాడని అనిపిస్తుంది. ఈ ఉత్సవంలో ఏదైనా మిగిలితే...ప్రజాసేవా కార్యక్రమాలకు వినియోగించడం జరుగుతుంది.

వడ్లమూడి దుర్గాంబ

బరువు తగ్గినా... తేజస్సుగా!

బరువు తగ్గేందుకు సలహాలు ఇచ్చే డైటీషియన్లు అధికబరువు పైనే దృష్టిపెడతారు. దాంతో వారు ఎక్కువ సందర్భాల్లో ఆహారంలో కొవ్వుని తగ్గించుకోవాలనే చెబుతుంటారు. అయితే శరీరంలోంచి ఇలా కొవ్వుని తగ్గించివేయడం సరికాదంటుంది ఆయుర్వేదం. మన శరీరంలోని ఏడు ధాతువుల్లో కొవ్వుకూడా ఒకటి. శరీర నిర్మాణంలో ఇది ప్రధాన పాత్రని పోషిస్తుంది. మరి అలాంటప్పుడు తెలిసో తెలియకో ఎవరైనా సరే...శరీరంనుండి కొవ్వుని తగ్గించుకున్నపుడు శరీరంలోని సమతౌల్యస్థితికి హాని చేస్తున్నట్టు గానే భావించాలి. శరీరం సమతౌల్యస్థితిని కోల్పోయినప్పుడు అనారోగ్యాలు, వయసుమీరిన లక్షణాలు దాడిచేస్తాయి. అసహజ పద్ధతుల్లో బరువుని తగ్గించుకున్నవారు శరీరం కృశించిపోవటం, ఎముకలు, జుట్టుకి సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటుంటారు.

అందుకే శరీర సమతౌల్యస్థితికి ఏమాత్రం హాని కలగని రీతిలో శరీర బరువుని తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఒక మనిషి శరీర తీరు, నిర్మాణానికి అనుగుణంగా బరువు తగ్గాల్సి ఉంటుంది. బరువు తగ్గుతూనే జీవితమంతా యవ్వనవంతంగా కనిపించాలంటే...ఆయుర్వేద వైద్యం తోనే అది సాధ్యమవుతుంది. ఇందులో పలురకాల ఔషధాలు, మూలికలు, వంటలు, సాధనలు మిళితమై ఉంటాయి.

అందుకే ఆయుర్వేద వైద్యం రోగాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకుని కాకుండా....శరీరాన్ని సమతౌల్యస్థితిలోకి తేవడమే ప్రధానంగా పనిచేస్తుంది. ఆయుర్వేదం అంతా ప్రకృతితో అనుసంధానమైన వైద్యం. ఇది మనిషిలోని దోషాలు ధాతువులు అన్నింటినీ సమతౌల్య స్థితిలో ఉండేలా చేసి...తద్వారా అనారోగ్యాన్ని తగ్గిస్తుంది. అయితే ఈ సమతౌల్యస్థితి అనేది అందరికీ ఒకేలా ఉండదు. మనిషి శరీర నిర్మాణం, తీరు, పనిచేసే విధానాలను...బట్టి ఇది ప్రతి మనిషికి మారుతుంది. శరీరంలో వ్యాధి వచ్చిం దంటే అర్థం దాని సమతౌల్యస్థితి తగ్గిపోయిందనే. శరీరంలోని పూర్తి వ్యవస్థలో మార్పులు తేవటం ద్వారా ఈ స్థితిని తిరిగి తీసుకురావచ్చు. 'సనాతన్ క్రియ: ది ఎజ్‌లెస్ డైమెన్షన్' అనే పుస్తకంలోని దీపన్ క్రియలో ఈ అంశాలన్నీ వివరించడం జరిగింది.



యోగి అశ్వినీ

జన్మోద్ధారక పారాయణ

స్వధర్మ పాలనలో మోసాలు వంటి పాపాల వల్ల నీచ జన్మలు వస్తాయి. వాటి నుంచి తరించడానికి రకరకాల ప్రక్రియలు ఉంటాయి. అయితే గీతా పారాయణ కూడా అటువంటి ఫలాన్నిచ్చేదేనని పురాణ వాక్యం.



భగవద్గీతలోని ఒక్కో అధ్యాయం పారాయణ వల్ల ఒక్కో ఫలం లభి స్తుందని తెలుసుకుంటూ వస్తున్నాం. స్వధర్మాన్ని వదలడం. స్వధర్మ పాలనలో మోసాలు వంటి పాపాల వల్ల నీచజన్మలు వస్తాయి. వాటి నుంచి తరించడానికి రకరకాల ప్రక్రియలు ఉంటాయి. అయితే గీతా పారాయణ కూడా అటువంటి ఫలాన్నిచ్చే దేనని పురాణ వాక్యం. ఏడవ అధ్యాయం పారాయణ వల్ల నీచజన్మల నుంచి విముక్తి పొందవచ్చని గత వారం కథలో తెలుసుకున్నాం. అలాంటి కథే ఎనిమిదో అధ్యాయం పారాయణ గురించీ చెప్పబడింది. దానికి సంబంధించిన పురాణ కథ ఇది.

పూర్వం దక్షిణ దేశంలో అమర్ధకం అనే పట్టణం ఉండేది. ఆ పట్టణంలో భావ శర్మ అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు చెడు స్నేహాలతో పూర్తిగా తన బ్రాహ్మణ ధర్మాలను మరిచి ఎన్నో అనుచిత కార్యకలాపాలకు పాల్పడుతూ నీచకార్యాలు చేస్తూ, చివరకు శీలాన్ని సైతం కోల్పోయి విచక్షణారహితుడై ప్రవర్తించడం మొదలుపెట్టాడు. చివరి రోజుల్లో రోగపీడితుడయ్యాడు. అతను ప్రాణం విడిచేసమయంలో తాటి కల్లు పైకి మనసు వెళ్ళింది. చివరి క్షణంలో మన అధీనంలోలేని మనసు దేనిపైకైనా మళ్ళ వచ్చు. ఆ క్షణంలో మనసు దేనిపైకి వెడుతుందో అదై పుడతారని చెప్పినట్లుగా అతను ఆ జన్మలో తాటి చెట్టుగా జన్మించాడు. అదే కాలంలో కుశీ వలుడనే మరో బ్రాహ్మణుడు మితిమీరి ఎక్కువగా దానాలు అందుకుంటూ, వాటికి తగిన రీతిలో మంత్రాలు పఠించక మోసం చేస్తూ, దానధర్మాలు కొంచెమైనా చేయక డబ్బు అంతా కూడబెడుతూ పాపానికి పాల్పడ్డాడు. ఆ పాప ఫలితంగా అతను మరణానంతరం బ్రహ్మ రాక్షసి అయ్యాడు. అతడి భార్య కుమతి సైతం ఒక బ్రహ్మ రాక్షసి అయింది. వారిద్దరూ ఒక తాటి చెట్టును ఆశ్రయించుకుని ఉండేవారు. ఆ తాటి చెట్టే పూర్వ జన్మలో భావ శర్మ. ఒకరోజు కుమతి తన జన్మతో విసిగిపోయి ఈ స్థితి నుంచి విముక్తి లభించే మార్గమేదైనా ఉందాని అడిగింది. దానికి కుశీవల రాక్షసుడు తనకు అంతకు ముందు జన్మలోని విద్య గుర్తుండి, 'బ్రహ్మ విద్యోపదేశం చేతా, అధ్యాత్మ విచారణ చేతా, కర్మ రహస్యాన్ని తెలుసుకోవడం వల్ల మాత్రం ఈ జన్మ నుంచి విముక్తి కలుగుతుందని అన్నాడు. దానికి కుమతి తాను గతంలో విన్న జ్ఞానం గుర్తున్నందున వివరణ కోరగోరి భగవద్గీతలోని **'కిం తద్బ్రహ్మ, కిమధ్యాత్మం, కిం కర్మ పురుషోత్తమ? (బ్రహ్మం అంటే ఏమిటి, అధ్యాత్మం అంటే ఏమి, కర్మ తత్వమేమిటి)** అనే గీతా శ్లోకాన్ని అర్థంతో సహా చదివింది. ఆ గీతా వాక్యాన్ని విన్నంత మాత్రాన భావ శర్మ, బ్రహ్మ రాక్షసి రూపంలో ఉన్న కుశీవలుడు, అర్థ శ్లోకార్థ స్మరణం చేత కుమతి కూడా ఆ రూపాలను వదిలారు. గీతశ్లోకం చివరి వాక్యం అర్థాన్ని పూర్తి చేయగానే ఆ పుణ్యం వల్ల స్వర్గ లోకం నుంచి ఒక విమానం వచ్చింది. దానిలో బ్రహ్మ రాక్షసి రూపం పోయిన కుశీవల, కుమతులు ఎక్కి స్వర్గలోకానికి వెళ్లారు. భావశర్మ తన కర్మ ఫలం చేత మళ్లీ తన పూర్వ రూపమైన బ్రాహ్మణుడయ్యాడు. అతను ఆ శ్లోకాన్ని, దాని అర్థాన్ని వ్రాయించుకుని కాశీ వెళ్లి నిత్య పారాయణ చేయ సాగాడు. భగవంతుని స్మరిస్తూ, ముక్తి గురించి తలు స్తూ, కాలం గడపసాగాడు. కొంత కాలానికి విష్ణువు అతని ఏకాగ్ర చిత్తానికి సంతసించి అతడికి ముక్తిని ప్రసాదించాడు. ఇలా భగవద్గీత ఎనిమిదవ అర్థ శ్లోకాన్ని చదవగానే పుణ్యం లభిస్తుందని తెలు స్తోంది.

జపన్‌గీతాష్టమాధ్యాయశ్లోకార్థం
నియంతేంద్రియః
సంతుష్టవా సహం దేవి తదీయ తపసా భృశం


భగవద్గీత అష్టమాధ్యాయ పారాయణ ఫలం వల్ల బ్రహ్మ రాక్షసి జన్మ, వృక్షాలకు సైతం సమస్త దోషాలు నశించి విముక్తి కలుగుతుందని తెలుస్తోంది.

- సేకరణ, రచన :
ఆదూరి హైమావతి

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అజ్ఞాత భక్తుడు



శ్రీ రమణాశ్రమం

16-8-46

ఆశ్రమానికి ఈ ఉదయం వచ్చిన ఉత్తరాలలో జకోస్లోవేకియా నుంచి ఒక అజ్ఞాత భక్తుడు ఇంగ్లీషులో వ్రాసిన జాబు ఉన్నది. అది చూచి వాత్సల్య పూరితులై భగవాన్ ఆ జాబు సంగతి అందరికీ చెప్పి హాల్లో చదివించారు. విషయ సారాంశం ఏమంటే ''నా శరీరం అరుణాచలమునకు బహుదూర మందున్నా ఆధ్యాత్మిక దృష్టిలో భగవాన్ పాదమందే వుండి వున్నది. చిన్న వెంకటరమణుడు తిరువణ్ణామల వచ్చి ఈ సెప్టెంబర్ ఒకటవ తేదీకి ఏబదేండ్లు నిండగలవని భక్తితో నేను తలచెదను. భగవానుని యొక్క యథార్థమైన జన్మదిన మదియేనని నేను ఉత్సవమొనర్చుటకు అనుజ్ఞ వేడుచున్నాను. భగవాన్ పాదధూళిలో అపారమగు భక్తి శ్రద్ధ, వినయములతో నణిగి భగవద్వాణిని నా హృదయమున నాలింప యత్నించుచు ఈ వుత్సవము చేయగలను''.

అది చదివి అందరూ ఆమోదం చూపిస్తూ వుంటే భగవాన్ మందహాస ముఖారవిందులై ''ఈయన ఎవరో, అతని వూరూ, పేరూ, మనకు తెలియదు. ఎన్నడూ ఇక్కడికి వచ్చినవాడు కాడు. ఎట్లా తెలుసుకున్నాడో నేనిక్కడికి వచ్చి ఏబదేండ్లు నిండినవని? ఎంతో భక్తితో జాబు వ్రాశాడు. మన చరిత్రంతా చదివి అవగతం చేసుకున్నట్లే వున్నది. వ్రాత చూస్తే, సర్, యస్.రాధాకృష్ణన్ గారి వ్యాసమునకై భక్తులు ఎదురుచూస్తూ వుంటే ఇంతవరకు రానేలేదు. వస్తే మొదటే అది వేయాలని వీరి తలంపు. యస్.దొరసామి నడిగితే 'బాబో నా వల్లనవుతుందా, మౌనంగా వుంటా'నని వూరుకున్నాడు. డి.యస్.శాస్త్రీ అంతే చేశాడు. తలవని తలంపుగా యీ జాబు వచ్చింది. ఇట్లాగే వుంటవి సంభవాలు. వారి వ్యాసాలకోసం, అందులో ముఖ్యంగా రాధాకృష్ణన్ గారి వ్యాసం కోసం, ఎదురుచూస్తున్నారు వీరు. తలవని తలంపుగా ఇది వచ్చింది. చూడండి చిత్రం. ఎక్కడి జకోస్లోవేకియా, ఎక్కడి తిరువణ్ణామల? ఎప్పుడూ చూడని వాడు ఇట్లా వ్రాశాడంటే ఏమనుకోవాలి!'' అని విరమించాను.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

గజం ఎన్నిటికో ప్రతీక



బలమైన ఏనుగు కూడా చిన్న అంకుశంతో నియంత్రించబడటం దైవత్వానికి ప్రతీక. భగవంతుడు తనను కట్టేసే 'భక్తి' అనే తాడును ఎలాగైతే తానే ఇస్తాడో అదేవిధంగా గజం కూడా తనను కట్టే తాడును తానే ఇస్తుంది. ఎలాగైతే ఏనుగు తనపై ఎక్కించుకోదలచిన వారి కోసం కాలు ముందుకు చాస్తుందో అదేవిధంగా పరమాత్మ కూడా తనను చేర దలుచుకున్న వారికి తన పాదాలను ఆశ్రయించమని సూచించి తద్వారా తన వద్దకు చేర్చుకుంటాడు.

గణపతి నవరాత్రుల ప్రత్యేకం


గజం దైవత్వానికి, మానవత్వానికి, రాక్షసత్వానికి, జ్ఞానానికి, అజ్ఞానానికి ప్రతీక. మదమెక్కిన ఏనుగు అంతా ధ్వంసం చేస్తే, అదే మంచిగా ఉన్న ఏనుగు మావటి మాట వింటుంది. నీటిలోకి దిగిన గజం స్నానమాచరించిన వెంటనే తొండంతో మట్టిని తనపై తానే పోసుకుంటుంది. ఈ గజ స్నానం అజ్ఞానానికి ప్రతీక. సర్వశక్తిమంతుడు, సర్వ రక్షకుడు, జగన్నియంత అయిన భగవానుడు భక్తి అన్న చిన్న అంకుశంతో భక్తసులభుడయ్యాడు. అదేవిధంగా బలమైన ఏనుగు కూడా చిన్న అంకుశంతో నియంత్రించబడటం దైవత్వానికి ప్రతీక. భగవంతుడు తనను కట్టేసే 'భక్తి' అనే తాడును ఎలాగైతే తానే ఇస్తాడో అదే విధంగా గజం కూడా తనను కట్టే తాడును తానే ఇస్తుంది. ఎలాగైతే ఏనుగు తనపై ఎక్కించుకోదలచిన వారి కోసం కాలు ముందుకు చాస్తుందో అదే విధంగా పరమాత్మ కూడా తనను చేరదలు చుకున్న వారికి తన పాదాలను ఆశ్రయించమని సూచించి తద్వారా తన వద్దకు చేర్చుకుంటాడు.

పరమాత్మ నిత్య పరిశుద్ధుడై కూడా అనంతమైన కల్మషం నిండి వున్న ఈ ప్రపంచంలోకి తనకు తానే కోరి చేరి దైవత్వం, మానవత్వం, రాక్షసత్వం, జ్ఞానం, అజ్ఞానం ఇలా వీటన్నిటికి ప్రతీకగా నిలిచాడు. గజాసురుడు స్వార్థం, ఆశతో పొట్టలో భగవంతుడిని దాచుకుని రాక్షసత్వాన్ని చూపాడు. పరమాత్మ సందర్శనతో దాచుకున్న భగవంతుణ్ని మరల ఇచ్చి మానవత్వాన్ని చాటాడు. కడుపులోని చెడును తలలోని బుద్ధి మారుస్తుంది, ఆ తల ఆదిదంపతుల తలపులతో దైవత్వాన్ని నింపుకున్నది.


తల కాదు తలపులే పేరు మారుస్తాయి

శంకరుడు త్రిశూలంతో గణపయ్య శిరస్సు తీసి గజ శిరస్సును ఏర్పరిచి అందరికీ కరచరణాది ఆకారము ఒక్కటేనని ఒక్క తల మాత్రమే పేరును మారుస్తుందని తెలియజేశాడు. మరికాస్త లోతుకు వెళితే తల ఏదైనా తలలోని తలపులను బట్టి పేరు వస్తుంది. అందువల్ల భగవంతుడిని తలచుకుంటున్న ఒక రాక్షసుడి తలను ఆ జగత్పతి తన కుమారునికి అతికించాడు. రాక్షసత్వం, మానవత్వం, దైవత్వం అనేవి తలపులను బట్టే కాని తలను బట్టి కాదని లోకానికి సందేశమందించాడు శంకరుడు. తన తల లోకపూజ్యం కావాలని, సదాశివ ధ్యానం చేయాలని కోరుకున్న వాడు కావున దేవీపుత్రునికి రాక్షసుడైన గజాసురుని శిరస్సును అమర్చారు. కొన్ని సన్నివేశాలను లోతుగా విశ్లేషిస్తే అనంతమైన సత్యాలు ఆవిర్భవిస్తాయి. భగవంతుడ్ని తనలోనే దాచుకోవాలన్న స్వార్థం కలిగిన ఒక రాక్షసుడికి భగవంతుడు వచ్చి తన కడుపున చేరగానే తన తల లోకపూజ్యం కావాలనే ఆలోచన కలిగింది. ఇంతమంచి ఆలోచన కలిగిన ఆ దేహం దేవాలయమైంది. దేవాలయానికి గోపురం ఎలాగో దేహానికి తల అలాంటిది.

దేవాలయ గోపురాన్ని దర్శిస్తే పునర్జన్మ ఉండదని పురాణాలు చాటుతున్నాయి. మనలోనే భగవంతుడున్నాడనే భావన స్వార్థాన్ని పారద్రోలి పరమార్థాన్ని సూచిస్తుంది. భగవంతుని ధ్యానం ఏదో ఒక రీతిలో భగవత్సంబంధానికి, లోకకళ్యాణానికి ఏవిధంగా దారి తీస్తుం దో తెలియజేయటానికి గజానన అవతారం ఒకపెద్ద నిదర్శనం.



- డా॥ కందాడై రామానుజాచార్య



అధ్యాయం 4
శ్లోకం 35:

యద్ జ్ఞాత్వా న పునర్మోహమ్
ఏవం యాస్యసి పాండవ ।
యేన భూతాన్యశేషేణ
ద్రక్ష్యస్యాత్మన్యథో మయి ॥

తాత్పర్యం :ఆత్మదర్శియైన మహాత్ముని నుండి నిజమైన జ్ఞానమును పొందినపుడు ఆ జ్ఞానముచే సమస్త జీవులు పరమాత్ముని అంశలని, అనగా నాకు సంబంధించిన వారని చూడటం వలన నీవు ఎన్నడు ఎటువంటి మోహానికి గురికావు.

అన్నిటిలో పరమాత్ముని చూస్తే మోహం దూరం

భాష్యం :గురువు నుండి జ్ఞానము పొందినవాడు, అన్ని జీవరాశులనూ దేవాదిదేవుడైన శ్రీ కృష్ణుని అంశలుగా చూడగలుగుతాడు. నేను స్వతంత్రుడిని, నాకూ భగవంతునికి ఎటువంటి సంబంధము లేదు అని భావించేవారు మాయలో ఉన్నట్లే లెక్క. కొంతమంది తాత్వికులు కూడా కృష్ణుణ్ని ఒక గొప్ప వ్యక్తిగా భావిస్తారే గాని అతడు పరబ్రహ్మమని అర్థం చేసుకోలేరు. సంపూర్ణ జ్ఞానం ఏమిటంటే దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు అందరికీ ఆశ్రయమునిచ్చే శ్రేయోభిలాషి. దానిని మరచి జీవుడు స్వతంత్రుడనని భావించుటచే భౌతిక ప్రకృతిచే మోహం పొందుతున్నాడు. గురువు ద్వారా మాత్రమే లభించే ఈ జ్ఞానాన్ని పొందినట్లయితే, జీవుడు భగవంతునితో 'సమానుడని' గాని, 'స్వతంత్రుడని' గాని అనే భావము నుండి బయటపడగలడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేష రాశి
కోర్టు సంబంధిత వ్యవహారాల్లో సానుకూలత ఉంటుంది. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి
అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించ గలగుతారు.

మిథున రాశి
వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి.

కర్కాటక రాశి
దూర ప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబ రీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచన దోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి
ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమయిన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి
ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకొంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు.

తులా రాశి
విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమయిన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి
వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది.

ధనూ రాశి
ఉద్యోగ ప్రయత్నాలు లభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేక పోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి
ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికిపోయి చెడు కోరి తెచ్చుకుంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి
నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభ వార్తలు వింటారు. ఆరోగ్య శ్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి
విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్య ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.

31.8.2017, గురువారం

మేష రాశి
గృహ విషయాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. రుణ వత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. రుణ ఒత్తిడులు అవమానాన్ని కలిగిస్తాయి. ఆదాయంలో నూతన అవకాశాలు ఏర్పడతాయి.

వృషభ రాశి
మానసిక చిరాకులు తగ్గుతాయి. విద్యా ప్రయత్నాలు కలసి వస్తాయి. వాహన కొనుగోళ్లు ఉపకరిస్తాయి. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ప్రయాణాలు సుఖవంతం. ఆర్థిక ఇబ్బందులు పరిష్కరింపబడతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది.

మిథున రాశి
ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు లభిస్తాయి. ఆరోగ్య రక్షణ పాటించాలి. స్థిరాస్తి విషయాల్లో జాగ్రత్తలు తప్పనిసరి. పనులను అనుకొన్న సమయానికి పూర్తిచేయలేకపోతారు. అసహన వైఖరి ద్వారా అవమానాలను ఎదుర్కోవలసి వస్తుంది.

కర్కాటక రాశి
ఆర్థిక లావాదేవీలు కలసి వస్తాయి. ఆరోగ్యం క్రమశిక్షణ పెరుగుతుంది. శత్రు భీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి
ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యరక్షణ తప్పనిసరి. వృత్తిలో గుర్తింపు లభిస్తుంది. ఒత్తిడులు అన్నిరకాలుగా పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు ఉక్కిరి, బిక్కిరి చేస్తాయి. ఆదాయ మార్గాలు మూసుకుపోతాయి.

కన్యా రాశి
వాహన కొనుగోళ్లు ఉపకరిస్తాయి. దూరప్రయాణాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. ప్రత్యర్థులు బలపడతారు. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి
నూతన కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. విద్యా ప్రయత్నాలు కలసి వస్తాయి. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. సినీరంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు ఉన్నా అంతిమ విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది.


వృశ్చిక రాశి
గృహకార్యాలు, కార్యక్రమాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఉద్యోగ యత్నాలు అనుకూలం. శుభవార్తలు వింటారు. మానసిక రుగ్మతలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి
శారీరిక శ్రమ అధికమవుతుంది. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. శ్రమ తగ్గుతుంది. పనులు వేగవంతంగా పూర్తిచేయలేకపోతారు. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. నిర్ణయాల విషయంలో తొందరపాటు చర్యల ద్వారా విమర్శలు ఉంటాయి.

మకర రాశి
కోర్టు వ్యవహారాల్లో ఊరట లభిస్తుంది. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక విస్మయాలు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయంలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభ రాశి
వ్యాపార విస్తరణలు కలసి వస్తాయి. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఆర్థిక ప్రయత్నాలు కలసి వస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి.

మీన రాశి
ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. విధులను సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఆరోగ్య రక్షణ ఉంటుంది. ముఖ్యమైన పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com


ఆంధ్రప్రభ నాయిక

 లడఖ్ పర్వత ప్రాంతంలో ఉదయాన్నే కనబడే దృశ్యాలివే. సూర్యుడు తన లేత కిరణాల వెలుతురును లడఖ్ పర్వత శ్రేణుల మీద వ్యాపింపచేస్తుంటాడు. బౌద్ధసన్యాసులు తమ ప్రార్థనలు చేసుకుంటున్నారు. గ్రామస్థులు నెమ్మదిగా తమ ఇండ్లను శుభ్రపరచుకుని పనులు ముగించుకుని గోధుమ, బార్లీ పంటలను పండించడానికి పొలాలకు వెళుతున్నారు. కొంతమంది మేకలను కొండమీదకు తోలుకునిపోతున్నారు. ఇక్కడ ఎత్తయిన కొండల మీద దేవుని ఆలయాలు, ఆ ఆలయాల గోడలు మంత్రాలతో నిండిపోయి ఉంటాయి. ఇప్పటికీ ఆ ప్రాంతాలను చూస్తుంటే టిబెటన్ బౌద్ధసన్యాసులుకాని, లడఖ్ లోని ప్రజలు గాని నూతనత్వాన్ని అంగీకరించలేదనే విషయం తెలుస్తుంది. అలాంటి ప్రాంతంలో తెల్లవారుజామునుంచే తమ శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్నారు కొంతమంది బౌద్ధసన్యాసినులు. ఆ శిక్షణ ఏమిటి? ఎవరికి ఈ శిక్షణ ఇస్తున్నారనే వివరాలు మీకోసం...



కుంగ్‌ఫూ నేర్పే 'నన్స్'

ఈ లడఖ్ పర్వత శ్రేణుల్లో మెరూన్ కలర్ ప్యాంట్‌లు వేసుకుని బౌద్ధ సన్యాసినులు కొంతమంది యువతులకు ఆత్మరక్షణార్థం కుంగ్‌ఫూ, మార్షల్ ఆర్ట్స్‌ను నేర్పిస్తున్నారు. వాళ్లు ఆత్మరక్షణకోసం ఈ వర్కింగ్ షాపును నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ మనం పేపర్లలో, టివి ఛానళ్లలో స్కూళ్లో విద్యార్థులను లైంగికవేధింపులకు గురిచేస్తున్న వార్తలను వింటున్నాం, చూస్తున్నాం. ఆటోలు, టాక్సీల్లో ప్రయాణించే మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు, పనిచేసే కార్యాలయాలలో లైంగికవేధింపులకు గురిచేస్తున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం 2015లో 34,651 అత్యాచార కేసులు నమోదయ్యాయి. గంటకు నాలుగు అత్యాచారాలవుతున్నాయి. 2011సంవత్సరంలో ఉన్నదాని కంటే నేటికి 43 శాతం ఈ ఘోరాలు పెరిగిపోయాయని అధ్యయనకారులు చెబుతున్నారు. అలాగే లైంగిక వేధింపుల కేసుల సంఖ్య కూడా పెరిగిందని వారు తెలిపారు. ఈ కేసుల వివరాలు సముద్రంలో తేలే మంచుపర్వతంలా ఉంటున్నాయని ఉద్యమకారులు అంటున్నారు. చాలామంది బాధితులు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి కేసు నమోదు చేయడానికి భయపడుతున్నారు. సమాజంలో తమ పరువు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కుటుంబసభ్యులు కూడా అలాగే వారిని వెనుకకు లాగుతున్నారు. 2012 ఢిల్లీ బస్‌లో గ్యాంగ్‌రేప్ జరిగినప్పుడు దానికి నిరసనోద్యమాలు ఒక వెల్లువలా సాగాయి. ఆ కేసుకి మాత్రం మంచి తీర్పుని అమలుపరిచారు. ఆ తరువాత మళ్లీ అటువంటి కేసుల పట్ల ఉదాసీనత కనబడుతుంది. మీడియా ఇలాంటి సంఘటనలకు నిరసనగా ఉద్యమాలు చేస్తూ మహిళా హక్కులు, సంరక్షణ మార్గాల పట్ల ప్రజల్లో అవగాహనను కల్పిస్తోంది. కాని ఎన్ని చేసినా ఈ అఘాయిత్యాలకు మాత్రం అంతం లేదు. వీటన్నిటిని పరిశీలించినపుడు ఎవరో వచ్చి రక్షించడం కాదు ఎవరివారే రక్షించుకునేలా తయారుచేస్తే బాగుంటుందనిపించింది ఒక సన్యాసినికి. ఆ ఆలోచనను 28సంవత్సరాల జిగ్మి యెషె లామో ఐదు రోజుల వర్క్‌షాపులో హెమిస్ మోనిస్టరీ గుడి దగ్గర చర్చించారు. ఈ చర్చకు 13 నుండి 28 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువతులు వందమంది వరకు వచ్చారు. ఈ చర్చ



ఉదయం ఆరుగంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు జరిగింది. ఈ శిక్షణ ద్వారా ఎవరైనా వెనుకనుండి దాడిచేసినప్పుడు వారిని ఎలా ఎదిరించాలి, మనల్ని మనం ఎలా సంరక్షించుకోవాలనే కుంగ్‌ఫూ టెక్నిక్స్‌ను వాళ్లకు తెలియజేస్తున్నారు.

సన్యాసినులుగా మారిన అమ్మాయిలు కొంతమంది గ్రూపుగా మారి ఆ ప్రాంతంలో ఉన్న బాలికలకు ఆత్మరక్షణకోసం కుంగ్‌ఫూ విద్యను ఉచితంగా నేర్పిస్తున్నారు. వాళ్లు ఇప్పటి వరకు వందమంది అమ్మాయిలకు నేర్పించారు. రోజురోజుకీ మహిళల పట్ల పెరిగిపోతున్న అత్యాచారాల నేరాలను చూసి వారు ఈవిధమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ విద్య నేర్చుకోవడం ద్వారా మహిళ తన మాన, ప్రాణాలను రక్షించుకోగలదని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. ఎంతో ప్రశాంతమైన పర్వతాల మీద ప్రపంచానికి కొంచెం దూరంగా ఈ శిక్షణను వారికి అందజేస్తున్నారు. వీరు అందరిలాంటి సన్యాసినులు కారు. వారి ప్రార్థనలు, ఆరాధనలు పంచ్‌లతో, కిక్‌లతో మొదలవుతుంది. మెడిటేషన్ సమయంలో వాళ్లు మహిళలు చేయగల పంచ్‌లేమిటో చెప్పేవారు. వాళ్లు ఈశిక్షణ కోసమని సాంప్రదాయాన్ని పాటించకుండా లేరు. మెరూన్ కలర్ దుస్తులనే ధరిస్తున్నారు. శిక్షణలో సౌకర్యం కోసం బ్లాక్ బెల్టులు పెట్టుకుంటున్నారు. ఆ దుస్తులలో చూడడానికి వాళ్లు చాలా సాధారణంగా కనబడతారు. చాలామంది ప్రజలు సన్యాసినులంటే కూర్చొని ప్రార్థనలు చేసేవారని అందరూ అనుకుంటారని విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవారిలో ఒకరైన 19సంవత్సరాల జిగ్మే వాంగ్‌చుక్ లాహ్మో అన్నారు. లెహ్ ప్రాంతానికి 40కిలోమీటర్ల దూరంలో ఉన్న హెమ్ గ్రామానికి వెళ్లి రెండు గంటలు విద్యార్థులకు శిక్షణను ఇస్తున్నారు. సన్యాసినులే ఈవిధంగా కుంగ్‌ఫూ విద్యను నేర్చుకోగలిగినపుడు సాధారణ యువతులు ఎందుకు నేర్చుకోలేరు అని ప్రతి ఒక్కరూ ఆలోచించి ప్రతి యువత దీనిని తప్పనిసరిగా నేర్చుకోవాలని కుంగ్‌ఫూ విద్య శరీరాన్ని దృఢంగా చేయడమే కాకుండా మనసుకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని అందజేస్తుంది. ఈ విద్య నేర్చుకున్న వారూ ఆత్మరక్షణను చేసుకోవడమే కాదు ఆపదలో ఉన్న ఎదుటి మహిళలను కూడా కాపాడగలరని ప్రతి గ్రామం తిరుగుతూ చెబుతున్నామని ఒక సన్యాసిని చెప్పారు.

700మంది సన్యాసినుల్లో వాంగ్‌చుక్ ఒకరు. దేశభక్తిగల బౌద్ధ సన్యాసిని. బౌద్ధసన్యాసులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో వీరికి అంతే ప్రాధాన్యం ఉంటుంది. సాంప్రదాయకంగా సన్యాసినులు ఆశ్రమంలో వంట చేయడానికి, పరిసరాలను శుభ్రపరచడం లాంటి పనులు చేయడానికే అవకాశం ఉంటుంది. వారు ఎక్సర్‌సైజ్‌లు అలాంటివి చేయకూడదు. దీనికి అక్కడ సన్యాసులు అంగీకారం లేదు. కాని ఈ లడఖ్ సన్యాసులలో చాలా మార్పు వచ్చింది. ఒక దశాబ్దం కిందటే వెయ్యి సంవత్సరాల పాత శాఖ నాయకుడు, అతని ఆత్మ గ్యాల్వాంగ్ ద్రంక్‌పా, సన్యాసినులను కుంగ్‌ఫూ నేర్చుకోమని ప్రోత్సహించేవారని అక్కడి వారు తెలిపారు. బౌద్ధ సన్యాసినులు ఎక్కడ ఉన్నా చాలా ఉత్సాహంగా ఉంటూ పరిసరాలను కూడా ఉత్తేజితం చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన జంతువులకు వైద్యసదుపాయాలను అందజేయడం, నేత్ర చికిత్సా శిబిరాలను గ్రామాల్లో ఏర్పాటుచేయడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వాళ్లు సైకిళ్లమీదే వేలాది కిలోమీటర్లు ప్రయాణించి హిమాలయ పర్వతాలకు ఆ వైపున ఉన్న గ్రామాలకు వెళ్లి వాళ్లలో పర్యావరణ కాలుష్యం, కిడ్నాపుల గురించి వివరించి వాటి నుంచి ఎలా బయటపడాలో అని వివరిస్తున్నారు. 2015లో నేపాల్‌లో పెద్ద ఎత్తున భూకంపం సంభవించింది. అప్పుడు ఆ సన్యాసినులు అక్కడి నుండి వెళ్లిపోవడానికి అంగీకరించలేదు. ప్రతి గ్రామానికి వెళ్లి శిథిలాలను తొలగించి మార్గాలను ఏర్పాటు చేశారు. అలాగే బాధితులకు ఆహారాన్ని అందించారు.

లివ్ అండ్ లవ్ ఇంటర్నేషనల్ సంస్థకు అధ్యక్షుడిగా కేరీ లీ పనిచేస్తున్నారు. ఇది ఒక చారిటీ సంస్థ. యువతులకు కుంగ్‌ఫూ శిక్షణ ఇవ్వడాన్ని హిమాలయన్ కమ్యూనిటీలు మద్దతును తెలియజేసాయి. వీళ్ల పనితీరు చూసి ఎందరో వీరిని రోల్ మోడల్స్‌గా చేసుకుంటున్నారు. కుంగ్‌ఫూ సన్యాసినులు హిమాలయాల హీరోలు అని కేరీలీ అన్నారు.

వారందరూ కరుణాస్వభావం కలవారు మాత్రమే కాదు ధైర్యవంతురాళ్లు కూడా. భూకంపాలలోనే కాదు, హిమసంపాతాలలో, రుతుపవనాలలో, అనుకోకుండా వచ్చే తుఫాన్లలో ధైర్యంగా నిల్చుని బాధితులకు సహాయాన్ని



అందజేస్తున్నారు.

''ఈ విద్య నేర్చుకోవడం కష్టతరమైనా సరే ఎంతో ప్రయోజనకరమైనది. ఇది చేస్తున్నప్పుడు నా శరీరమంతా నొప్పులు మొదలయ్యాయి. కాని వాటినన్నిటిని తమ స్ఫూర్తిదాయకమైన మాటలతో సన్యాసినులు తగ్గించారు. ప్రతి మహిళ తప్పకుండా కుంగ్‌ఫూ నేర్చుకోవలసిందేనని'' అక్కడ శిక్షణ తీసుకుంటున్న 23 సంవత్సరాల సెరింగ్ యాంగ్‌చెన్ అన్నారు. నేను ఇదివరకు మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చాలా భయపడుతూ వెళ్లేదాన్ని. ఎందుకంటే అక్కడ మగపిల్లలు నిల్చుని విజిల్స్ వేయడం, కామెంట్లు చేయడం, చేసేవారు. నాకు చాలా అసహ్యంగా అనిపించేది. కాని ఈ శిక్షణ పొందాక నేను ధైర్యంగా మార్కెట్‌కి వెళుతున్నాను. ఎందుకంటే వారు ఏమన్నా అన్నా నన్ను నేను రక్షించుకోగలననే ఆత్మవిశ్వాసం నాలో ఏర్పడిందని ఆమె గర్వంగా చెప్పారు. మహిళల ఆత్మరక్షణ కోసం పాటించాల్సిన కుంగ్‌ఫూ ట్రిక్స్‌ను నిరంతరం శిక్షణల ద్వారా తెలియజేస్తున్న ఈ బౌద్ధ సన్యాసినులకు ప్రతి మహిళా అభినందనలు తెలియజేయాల్సిందే!

విజేత

రన్...రన్...రన్

ఆధునిక జీవితంలో ఎవరి పనిలో వాళ్లు బిజీ అయిపోయి ఒత్తిడికి గురై అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారు. ఇటువంటి ఒత్తిడిని కొద్దిగానైనా తగ్గించాలనే ఉద్దేశ్యంతో చాలాచోట్ల వీకెండ్స్‌లో మారథాన్లను నిర్వహిస్తున్నారు. మారథాన్ రేసులంటే మనం చూస్తూనే ఉంటాం. అందరూ ఒకేలాంటి దుస్తులను వేసుకుని పరిగెడుతుంటారు. కాని దీనికి భిన్నంగా చీరతో కూడా సురక్షితంగా మారథాన్ చేయవచ్చునని నిరూపించారు శ్రీమతి జయంతి. ఆమె చీరతో పరుగెత్తడానికి గల కారణాలేమిటో తెలుసుకుందాం.



షూస్ లేకుండా...

కాళ్లకు చెప్పులు లేక పోతే ఒక అడుగు కూడా ముందుకు కదలని పరిస్థితులు గల సమాజంలో మనం జీవనం సాగిస్తున్నాం. నడవడానికి చెప్పులు కావాల్సినప్పుడు ఇక పరుగు పందెంలో ఎంత అవసరమో కదా! అయినా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనే లక్ష్యంతో కాళ్లకు షూస్ లేకుండా మూడువేల మీటర్లు పరుగెత్తి స్వర్ణాన్ని సాధించింది సయాలి. ఆ వివరాలేమిటో తెలుసుకుందాం.

ఆమెకు రన్నింగ్ రేసులంటే చాలా ఇష్టం. ఇందులో విభిన్నంగా ఏదో చేయాలనే తపనతో కాళ్లకు షూస్ లేకుండా పరిగెత్తడంలో ప్రాక్టీసు చేసి రేసులో పాల్గొని స్వర్ణాన్ని గెలుచుకుంది. విజయం సాధించిన సందర్భంలో మాట్లాడుతూ -''ఆకాశంలోని చుక్కల ప్రకాశవంతాన్ని మనం గుర్తించాలంటే ఆకాశం నల్లగా ఉంటేనే సాధ్యం కదా. అలాగే ఏదో ఒకసాహసం చేస్తేనే మనం వెలుగులోకి వస్తామని'' అందుకే నేనీ మార్గం ఎంచుకున్నానని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పింది. ఆమె ఈ రేసును 12నిమిషాల 27.8సెకన్లలో అండర్-17 ఈవెంట్‌ను పూర్తిచేసింది. అంతేకాదు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీస్ ఇంటర్ స్కూల్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో కూడా పాల్గొని విజయాన్ని సాధించింది. ఆమె తండ్రి మంగేష్. ఆయన పాతబూట్లను కుట్టి తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నెలకు 3000నుండి 10000వరకు సంపాదిస్తున్నాడు. అతను ఎంత సంపాదించినా వాళ్ల ఇద్దరు కూతుర్ల చదువులకే అయిపోతుంది. సయాలి తొమ్మిదవ తరగతి చదువుతుంది. ఆమె తన శిక్షణను నైగావ్ పోలీస్ గ్రౌండ్ ట్రాక్‌లో పొందింది. ఎక్కువగా మట్టిలోనే పరుగెత్తి ప్రాక్టీసు చేసేది. కాని అసలైన పోటీలో ఆమె చాలా సమస్యలను ఎదుర్కొంది. రోడ్డు చాలా రఫ్‌గా ఉండేది. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనేది. అయినా పట్టువదలకుండా ప్రాక్టీసుని నిర్వహించింది. ఆమె అకుంఠిత దీక్షే ఆమెను స్వర్ణ పతకం గెలుచుకునేలా చేసింది. నేను ఈ పతకం సాధిస్తానని అనుకోలేదని ఆమె అన్నారు. పతకం తీసుకున్నప్పుడు ఆమె ఉద్వేగానికి గురయ్యారు. మమ్మల్ని ప్రోత్సహిస్తున్న మానాన్నకు ఎంతో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అందామె. ఆమె తండ్రి తన పనుల ఒత్తిడి వల్ల ఈ రేసును చూడలేక పోయినా తన పిల్లలు ఏమి చేయదలచుకుంటే అది చేయడానికి ఎప్పుడూ తన ప్రోత్సాహాన్ని అందజేస్తానని, ఏదో ఒకరోజు మనదేశానికి ప్రతినిధిగా సయాలి విదేశీపోటీలలో పాల్గొంటుందని ఎంతో గర్వంగా చెప్పారాయన.

చీరకట్టుతో...



హైదరాబాద్‌లో నిర్వహించిన ఫుల్ మారథాన్‌లో (42కిలోమీటర్లు) జయంతి సంపత్ కుమార్ చీర కట్టుకుని, చెప్పులతో పరిగెట్టి విజయం సాధించి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఆమె ఈ దూరాన్ని 5గంటల్లో పూర్తిచేసింది. ఆమె వయసు 44సంవత్సరాలు. ఈ మారథాన్ రేసుల్లోకి ఆమె ఎనిమిది సంవత్సరాల క్రిందటే వచ్చింది. 2015లో ఆమె మొదటిసారిగా హైదరాబాద్ మారథాన్ 10కెలో పాల్గొన్నారు. కాని ఆ రేసులో ఆమె ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నారు. ఆ అడ్డంకులను తొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి మారథాన్లలో పాల్గొన్నప్పుడు వాటిని ఎలా అధిగమించాలో తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో 2016 జనవరిలో ఆమె హైదరాబాద్ రన్నర్స్‌లో శిక్షణకోసం చేరారు.

ఆమె శిక్షణ తీసుకున్న ఒక్క సంవత్సరంలో 5 కిలోమీటర్ల మారథాన్ నుండి 42 కిలోమీటర్ల మారథాన్ వరకూ పరిగెత్తగల సామర్థ్యాన్ని పొందారు. ఈవిజయంపై ఆమె స్పందించి ఇలా అన్నారు...''ఇది సాధారణమైన ఆటకాదు. అంకితభావముంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించగలం.

ఫుల్ మారథాన్ అంటే చాలా కష్టతరమైనది. మొదట్లోనే నేను ఫుల్ మారథాన్‌లో పాల్గొని ఉంటే నేను న్యాయం చేయలేకపోయేదాన్ని. అందుకనే మొదట హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నాను. అది పూర్తిచేసిన మరుక్షణమే నాలో ఫుల్ మారథాన్‌లో పాల్గొని విజయం సాధించగలననే ఆత్మవిశ్వాసం కలిగింది'' అని ఆమె తెలిపారు. ఈ మారథాన్‌లో ఆమెతో పాటు భర్త, కుటుంబ సభ్యులు కూడా పరిగెట్టారు. ఈ రేసులో పాల్గొనక ముందు ఆమె చీరలోనే చాలా సార్లు రన్నింగ్ చేసేవారని చెప్పారు. అలా పరిగెడుతున్నప్పుడు ఎన్నో ఛాలెంజెస్‌ను నేను ఎదుర్కొన్నాను. చీరతో పరుగెత్తడమంటే గాలి పీల్చుకున్నంత సులువు కాదు. దీనికోసం నేను ఐదు నెలల ముందు నుండే ప్లానింగ్ చేసుకున్నాను. నేను ముందుగా మహారాష్ట్రీయన్ల పద్ధతిలో మాడిస్సార్ స్టైల్‌లో చీరకట్టుకుని పరిగెట్టాను. దాని వల్ల నేను పరిగెట్టేటప్పుడు జారిపోవడమే కాదు చాలాసార్లు పడిపోయాను కూడా.

చీరతోనే పరిగెత్తడానికి గల కారణమేమిటని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానంగా- ''2016 మార్చిలో నేను ఒక ఆర్టికల్ చదివాను. ఒకతను బిజినెస్ సూట్‌తో హాఫ్ మారథాన్ చేసి విజయం సాధించాడు. అది చదివిన తరువాత నాలో ఈ లక్ష్యం మొదలైంది. అప్పటి నుంచి ప్రాక్టీసు చేసి నేను చీరలో ఫుల్ మారథాన్‌ని చేయగలిగానని ఎంతో గర్వంగా చెప్పారు. అలాగే నా చిన్నప్పుడు మా అమ్మ, అమ్మమ్మ రోజూ చీరలతోనే ఎన్నో పనులను చేసేవాళ్లు. వాళ్లు చీరకట్టుకున్నా సరే అసౌకర్యంగా ఉండకుండా ఎంతో సులభంగా తమ పనులను తాము చేసుకునే వారు. వాళ్లే అలా చేస్తున్నప్పుడు మరి నేను అనుకున్న పనిని ఎందుకు చేయలేను అని ఆలోచించాను. అంతేకాదు ప్రయత్నించాను కూడా. నా ప్రయత్నం విజయవంతమైంది అని ఎంతో హుందాగా చెప్పారామె. నేను ఈవిధంగా చీర కట్టుకుని పరిగెట్టడం వలన కూడా చాలా దేశాల నుండి ఎంతోమంది భారతీయుల అభిమానాన్ని సంపాదించుకున్నానని గర్వంగా చెప్పారామె.

మహిళలే సారథులుగా 'జనధాన్య'

చైతన్యం

మహిళల్లో చైతన్యం పెరుగుతున్నదనడానికి మరొక నిదర్శనం ఈ జనధాన్య వెబ్‌సైట్. ఈ వెబ్‌సైట్ ఏమిటి, దీనినెవరు ప్రారంభించారు. లక్ష్యమేమిటో తెలుసుకుందాం.

బెంగళూరు శివార్లలో ఉన్న కనకపురా గ్రామంలో ఉన్న కొంతమంది మహిళా రైతులు స్వయం ఉపాధిగా ఏదో ఒక సంస్థను ప్రారంభించాలనుకున్నారు. అందులో భాగంగానే జనధాన్య వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.


37సంవత్సరాల నాగరత్న దేశీయ విత్తనాలను, వరి వంగడాలను ఇంటిలోనే నిల్వ చేసుకుని సమయానుసారంగా అమ్మకానికి పెట్టేది. దానివల్ల ఆమెకు సరిపడినంత ధనం వచ్చేది. కాని ఆమెలాగే ఇంకా 13మంది చుట్టుప్రక్కల గ్రామాల మహిళలు కూడా ఈవిధంగా చేయడం ఆమె దృష్టికి వచ్చింది. ఇలా విడివిడిగా వ్యాపారం చేసుకోవడం వల్ల కలిగే లాభం నామమాత్రమేనని, అందరం కలిసి సంఘటితంగా చేస్తే మరిన్ని లాభాలు పొందవచ్చుననే ఒక ఆలోచన వచ్చిందామెకు. అందరితో మాట్లాడి అందరం సమైక్యంగా ఒక సంస్థను ఏర్పాటు చేసుకుందామని ఒప్పించారు. ఆ అంగీకారానికి ప్రతిఫలమే జనధాన్య వెబ్‌సైట్. ఇది విత్తనాలను ఆన్‌లైన్ అమ్మకాలు జరిపే ఒక వెబ్‌సైట్. ఈవిధంగా వాళ్లు దీనిని ప్రారంభించడం వల్ల ప్రతి మహిళా సంవత్సరానికి 80వేల నుండి 90వేల వరకు లాభాన్ని పొందుతున్నారు. అలా ప్రారంభమైన సంస్థలో నేడు 2750మంది సభ్యులు ఉన్నారు. రైతుల కోసం ఏర్పడిన ఈ అసోసియేషన్ పర్యావరణ పరిరక్షణకోసం కూడా పాటుపడుతుంది. ఇది వినియోగదారులకు, రైతులకు వారధిగా పనిచేస్తుంది. ఈ సంస్థ వల్ల మధ్య తరగతి రైతుల సమస్యలను తొలగించి వారికి తగిన ధరను నిర్ధారించి ఇవ్వడం జరుగుతుంది.

బెంగళూరులో ఉన్న మైండ్‌ట్రీస్ హెడ్‌క్వార్టర్స్‌కి నాగరత్న తన 13మంది గ్రూపు సభ్యులతో వచ్చారు. అలా వచ్చినప్పుడు తన స్ఫూర్తిదాయకమైన ప్రయాణం గురించి చెబుతూ....నేను దేశీయ విత్తనాలను అమ్మడం మొదలు పెట్టినప్పుడు, నేను ఎక్కువ లాభాన్ని పొందలేదు. ఆ తరువాత నా చుట్టుప్రక్కల మహిళలను కలిసి మాట్లాడినప్పుడు వారు ఈవిధంగానే చేస్తున్నారని తెలిసింది. అందరం కూర్చుని ఆలోచించి కలిసి పనిచేద్దామనే ఆలోచనను రూపొందించాం. మా ప్రయత్నం సఫలమయ్యింది. మా ఈ పనిలో మా భర్తలు కూడా ఎంతో జాగ్రత్త, శ్రద్ధలను తీసుకుంటున్నారని చెప్పారు. మేము మా వ్యాపారాన్ని ఇంకా పెంపొందించాలనుకుంటున్నామని ఆమె ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు.




నయనతార


రాజుగారి గది 2


శివ

నాడు సైకిల్ చెయిన్... నేడు రుద్రాక్షమాల

అక్కినేని నాగార్జున నటిస్తున్న రాజుగారి గది 2 ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. మంగళవారం నాగార్జున పుట్టినరోజు కావడంతో యూనిట్ లుక్ రిలీజ్ చేసింది. చేతిలో రుద్రాక్ష మాలతో నాగార్జున కనిపిస్తున్నాడు. ఈ లుక్ చూస్తుంటే నాగార్జున నటించిన శివ సినిమా గుర్తుకువస్తోంది. 1989లో రిలీజైన శివ సినిమా అప్పట్లో సంచలన విజయం నమోదు చేసింది. ఇందులో నాగార్జున సైకిల్ చెయిన్ పట్టుకున్న సీన్ హైలెట్ అయింది. సినిమా ప్రచారంలో వీటినే పోస్టర్స్ కోసం ఉపయోగించారు. ఇప్పటికే సైకిల్ చెయిన్ ఫైట్ అంటే శివ సినిమానే గుర్తుకువస్తుంది.

రాజుగారి గది 2లో శివను పోలిన లుక్‌ను విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. 28 ఏళ్ళ తర్వాత కూడా నాగ్ లుక్‌లో గ్లామర్ అలాగే ఉందని వారు ముచ్చటపడతున్నారు. ఓంకార్ దర్శకత్వం వహిస్తున్న రాజుగారి గది 2లో నాగార్జున కీలక పాత్రని చేస్తున్నారు. ఆయనది మెంటలిస్టిక్ క్యారెక్టర్. అంటే ఎదుటివారు మనసులో ఏముందే ఇట్టే గ్రహిస్తారన్నమాట.


నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం యుద్ధం శరణం. నాగార్జునకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం లుక్ విడుదల చేశారు. చిత్రంగా ఇందులో సైకిల్ చెయిన్ పట్టుకున్న ఓ చెయ్యి హైలెట్‌గా కనిపిస్తోంది. ఇటీవలే యుద్ధం శరణం పాటలను విడుదల చేశారు.


యుద్ధంశరణంలో నాగచైతన్య

శరవేగంగా రంగస్థలం

రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్‌ల కలయికలో రూపొందుతున్న రంగస్థలం-1985 చిత్రం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లో ప్రత్యేకంగా నిర్మించిన గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే సెట్లో షూటింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు అల్లు అర్జున్, మహేష్‌బాబు, జూ.ఎన్టీఆర్, రామ్, నాగచైతన్య వంటి హీరోలతో సినిమాలు చేసిన దర్శకుడు సుకుమార్ తొలిసారిగా రామ్‌చరణ్ కలయికలో ఈ చిత్రం చేస్తున్నారు.

మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం తొలి, మలి షెడ్యూల్స్‌ను రాజమండ్రి, పోలవరం పరిసరాల్లో జరుపుకున్న విషయం తెలిసిందే. కాగా హైదరాబాద్‌లో జరుగుతున్న తాజా షెడ్యూల్లో కీలక సన్నివేశాల చిత్రీకరిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన సమంత నాయికగా నటిస్తున్న ఈ చిత్రం పల్లెటూరి ప్రేమకథ నేపథ్యంలో పీరియాడికల్‌గా సాగనుంది. ముఖ్యంగా వీరిద్దరి పాత్రలను సుకుమార్ విభిన్నంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో ఆది పినిశెట్టి, జగపతిబాబు నటిస్తుండగా, దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని, రత్నవేలు ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.


రామ్‌చరణ్

తదుపరి చిత్రంపైనా ఆసక్తి

స్టార్ హీరోల తదుపరి చిత్రంపై సహజంగా ఎనలేని ఆసక్తి ఏర్పడుతుంటుంది. రంగస్థలం చిత్రం షూటింగ్ పూర్తయిన తర్వాత రామ్‌చరణ్ తన తండ్రి మెగాస్టార్ చిరంజీవి నటించే సైరా నరసింహారెడ్డి చిత్రంపై దృష్టిపెడతారని అంటున్నారు. తమ సొంత బేనర్ కొణిదెల ప్రొడక్షన్స్‌లో రామ్‌చరణే నిర్మాతగా ఆ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో ఆ బరువు, బాధ్యతలను భుజాన వేసుకుంటారని, ముఖ్యంగా ఆ చిత్రం షూటింగ్ జరిగే రోజులలో తనకు సంబంధించిన ఏ చిత్రం షూటింగ్ లేకుండా రామ్‌చరణ్ ప్లాన్ చేసుకున్నారట. ఇప్పటికే కొరటాల శివ దర్శకత్వంలో ఓ చిత్రం చేసేందుకు అంగీకరించిన రామ్‌చరణ్ ఇంకా బోయపాటి శ్రీను, మురుగదాస్‌ల కలయికలో కూడా సినిమాలు చేయాలని కోరుకుంటున్నట్లు సమాచారం.

అక్కడా...ఇక్కడా హవా!

నయనతార

తమిళంలో ఎంత బిజీగా ఉన్నా ఇప్పుడు తెలుగులో కూడా ఒకటికి రెండు సినిమాలు చేస్తోంది. అవి కూడా ఇద్దరు పెద్ద హీరోల సరసన ఆమె రెండు ప్రతిష్టాత్మక సినిమాలను చేస్తుండటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ప్రస్తుతం తమిళంలో నెంబర్‌వన్ కథానాయికగా పిలవబడుతున్న ఆమె లోగడ తెలుగులో పలువురు పెద్ద హీరోల సరసన కొన్ని విజయవంతమైన చిత్రాలలో నటించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి తన నిజజీవితంలో ఏర్పడిన కొన్ని పరిణామాలు ఆమె కెరీర్‌పై ప్రభావం చూపవచ్చునన్న అభిప్రాయాలు అప్పట్లో వ్యక్తమయ్యాయి కూడా. అయినా వాటన్నింటినీ తట్టుకుని ఆమె కెరీర్‌ను విజయవంతంగానే కొనసాగిస్తుండటం ఎప్పటికప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఏదోరకంగా తరచూ వార్తలలో ఉండటం ఆమెకే చెల్లింది. బాబు బంగారం తర్వాత తెలుగులో భారీ అవకాశాలు రావడంతో ఆమె పేరు టాలీవుడ్‌లో మరోసారి మారుమోగుతోంది. లోగడ బాలకృష్ణ సరసన ఆమె నటించిన సింహా, శ్రీరామరాజ్యం చిత్రాలు ఘన విజయం సాధించడంతో వారిది హిట్ కాంబోగా పేరొచ్చింది. ఈ నేపథ్యంలో ముచ్చటగా మూడోసారి వారిద్దరూ జంటగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే నయనతార షూటింగ్‌లోకి అడుగుపెట్టారు. ఇక మెగాస్టార్ చిరంజీవి నటించే సైరా నరసింహారెడ్డి చిత్రంలో ప్రధాన నటీమణిగా ఎవరిని ఎంపిక చేస్తారన్న అంశం ఇటీవలి వరకు ఆసక్తికరంగా మారింది. అయితే నయనతార పేరును ఇటీవల ఆ చిత్రం ప్రారంభోత్సవం సందర్భంగా అధికారికంగా ప్రకటించడంతో ఎట్టకేలకు సస్పెన్స్ వీడింది. చిరంజీవి చిత్రంలో నయనతార నటించడం ఇదే మొదటిసారి. మొత్తంమీద ఈ రెండు చిత్రాలతో నయనతార టాలీవుడ్‌లో ఎంతటి పేరు సంపాదించుకుంటుందో ముందు ముందు చూడాలి. ఇక తమిళంలో మాయ చిత్రం తర్వాత హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలు ఆమె తలుపు తడుతున్నాయి. డోర సినిమా బాక్సాఫీసు వద్ద ఆశించినరీతిలో ఆడకపోయినా ఆమె హవా మాత్రం కొనసాగుతూనే ఉంది. ఆరమ్, ఇమైకా నోడిగళ్, కొలైయూర్ కాలం వంటి కథానాయిక ప్రధాన చిత్రాలతో పాటు శివకార్తికేయన్ సరసన వేలైక్కారన్ అనే కమర్షియల్ కథాచిత్రంలో కూడా ఆమె నటిస్తోంది. ఇదిలావుండగా...కోకో అనే కథానాయికి ప్రధాన పాత్రలో రూపొందబోయే చిత్రంలో కూడా నటించేందుకు ఆమె అంగీకరించినట్లు సమాచారం. లైకా సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు, త్వరలోనే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వినిపిస్తోంది.

మరోసారి పోలీస్ పాత్రలో..!


రవితేజ

మాస్ మహారాజా రవితేజ మరోసారి పోలీస్ పాత్రలో నటించనున్నాడు. రవితేజ నటించిన బెంగాల్ టైగర్ తర్వాత దాదాపు రెండేళ్ళ గ్యాప్ వచ్చింది. తనకుతానే ఈ గ్యాప్ తీసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత ఒకే సారి రెండు సినిమాలకు సైన్ చేశారు. రాజా ది గ్రేట్, టచ్ చేసి చూడు టైటిల్స్‌తో రవితేజ కథానాయకుడిగా రెండు సినిమాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటికి అనీల్ రావిపూడి, విక్రమ్ సిరికొండ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాల నిర్మాణం చివరిదశలో ఉన్న నేపథ్యంలో రవితేజ మరొక కొత్త చిత్రంలో నటించడానికి అంగీకరించినట్టు తెలిసింది. తమిళంలో విజయవంతమైన బోగన్ అనే చిత్రంలో రవితేజ నటిస్తాడని సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. బోగన్ చిత్రంలో జయం రవి హీరోగా నటించాడు. జయం రవి నటించిన తను ఒరువన్ తెలుగులో ధృవగా రీమేక్ అయిన విషయం తెలిసిందే.

బోగన్ చిత్రంలో హీరో పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తాడు. ఈ సినిమా గత ఏడాది విడుదలై విజయం సాధించింది. ఇప్పుడు రవితేజతో రీమేక్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. విక్రమార్కుడు, పవర్ చిత్రాల్లో రవితేజ పోలీస్ ఆఫీసర్‌గా నటించగా, ఇవి భారీ విజయాన్ని నమోదు చేశాయి. ఇక బోగన్ కథలో కొంత మార్పులు చేసి తెలుగులో నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

హెబ్బా కోలీవుడ్ ఎంట్రీ..!


హెబ్బా పటేల్

సినీ కథానాయికలు ఒక చోట విఫలమైతే మరో చోట అవకాశాలు తలుపుతడుతుంటాయి. తెలుగులో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశించిన హెబ్బా పటేల్ కెరీర్ కొంత గందరగోళంగా ఉంది. అలా ఎలాతో కెరీర్ మొదలుపెట్టి కుమారి 21 ఎఫ్‌తో పుంజుకుంది. ఆ తర్వాత కూడా ఆడోరకం ఈడోరకం, అంధగాడు ఎక్కడికి పోతావు చిన్నవాడా తాజాగా మిస్టర్ సినిమాల్లో నటించింది. అయితే ఇవేమి ఆమె కెరీర్ మనుగడకు తోడ్పాటు ఇవ్వలేదు. మరోవైపు హెబ్బా పటేల్ లావెక్కిందనే కామెంట్స్ వినిపించసాగాయి. తెలుగు నాయికలు లావెక్కితే మాత్రం ఇబ్బందే. ఇదిలా ఉండగా

హెబ్బాపటేల్‌కు కోలీవుడ్ నుండి పిలుపు వచ్చిందట. అక్కడి స్టార్ హీరో విజయ్‌తో నటించే అవకాశం దక్కిందనే మాట వినిపిస్తోంది. పైగా విజయ్ చిత్రాన్ని మురగదాస్ నిర్మించి, దర్శకత్వం వహిస్తారని తెలిసింది. ముగ్గురు హీరోయిన్లు నటించే ఈ చిత్రంలో హెబ్బాను ఎంపికచేశారనేది ఫిల్మ్‌నగర్ సమాచారం.

ఉత్కంఠను కలిగించే దెయ్యం కథతో

కిరణ్, దివ్య నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం మళ్లీ వచ్చిందా..!.కె.నరేంద్రబాబు దర్శకుడు. సి.వి.ఫిలింస్ పతాకంపై వెంకటేశ.సి. నిర్మిస్తున్నారు. చిత్రీకరణతో పాటు నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. కాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న టి.ప్రసన్నకుమార్ విడుదలచేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ క్రేజ్ ఉంటుంది. ఈ మధ్య గంగా, రాజుగారిగది, ఆనందోబ్రహ్మ చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో అలరింపజేశాయి. ఇది కూడా ఆ తరహా కథే. తప్పకుండా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందన్న నమ్మకం ఉంది అని అన్నారు.


కిరణ్, దివ్య

దర్శకుడు నరేంద్రబాబు మాట్లాడుతూ, దెయ్యానికి పగలు, రాత్రి అని ఏమీ తేడా ఉండదు. మనిషి నుంచి మనిషికి వెళ్లలదు.ఓ దెయ్యం ఫోన్ నుంచి ఫోన్‌కి వెళ్లి మనుషుల్ని భయపెట్టగలదని తెలిపే సినిమా ఇది. ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుంది. కథ వినగానే నిర్మాతకు నచ్చి, షూటింగ్ మొదలుపెట్టారు. హైదరాబాద్, బెంగళూరు, మున్నార్ వంటి ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. కన్నడంలో ఏడు సినిమాలు తీస్తే అందులో నాలుగు సినిమాలు విజయవంతమయ్యాయి. తెలుగులో మంచి దర్శకుడిగా స్థిరపడాలనే ఈ తొలి ప్రయత్నం చేస్తున్నాను. నిర్మాత వెంకటేశ మాట్లాడుతూ, హారర్ కథకు అన్నివిధాలా సరిపోయే టైటిల్ ఇది. పూర్ణ కెమెరా పనితనం సినిమాకు ఓ ఆకర్షణ అవుతుంది. గిరిధర్ దివాన అద్భుతమైన బాణీలు అందించారు. సెన్సార్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే పాటల్ని విడుదలచేసి, ఆ తర్వాత సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఛాయాగ్రాహకుడు పూర్ణ, హీరో కిరణ్, హీరోయిన్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నిర్మాతగా...?

అభిరుచికి తగ్గట్టు సినీరంగంలో ఒక శాఖకు చెందినవారు మరో శాఖలోనికి ప్రవేశించడం ఎప్పట్నుంచో చూస్తున్నదే. సహాయ దర్శకుడిగా కెరీర్‌ను మొదలుపెట్టిన నాని ఆ తర్వాత హీరోగా మారి ఎంతటి గుర్తింపును సొంతం చేసుకున్నారో తెలియంది కాదు. తొలి చిత్రం అష్టాచమ్మ నుంచి నిన్నుకోరి చిత్రం వరకు సాగిన ప్రయాణంలో ఎత్తుపల్లాలను చవిచూశారు. స్ఫూర్తినిచ్చే విజయాలతో పాటు నిరాశపరిచిన అపజయాలు ఆయన ఖాతాలో లేకపోలేదు. ప్రస్తుతం ఎం.సి.ఏ. (మిడిల్ క్లాస్ అబ్బాయి) చిత్రంలో నటిస్తున్నారు. వేణుశ్రీరామ్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. కాగా కెరీర్ మధ్యలో తన అభిరుచిని చాటుకుంటూ డి ఫర్ దోపిడి అనే చిత్రానికి సహ నిర్మాత కూడా అయ్యారు. అయితే ఆ చిత్రం నిరాశపరచడంతో హీరోగానే తన పని తాను చేసుకుంటూ పోతున్న ఆయన మళ్లీ నిర్మాతగా ఓ చిత్రాన్ని నిర్మించనున్నట్లు టాలీవుడ్ టాక్. డైలాగ్ ఇన్ ద డార్క్ పేరుతో లఘు చిత్రాన్ని రూపొందించడమే కాకుండా ఇండియాలో తొలిసారిగా వర్చువల్ ఆడియో సాంకేతికతతో దీనిని మలచి ప్రశంసలు అందుకున్న ప్రశాంతవర్మను దర్శకుడిగా పరిచయం చేస్తూ నాని ఈ చిత్రాన్ని తీయబోతున్నట్లు వినిపిస్తోంది. ప్రశాంత్ చెప్పిన పాయింట్ నానికి ఎంతగానో నచ్చి ఈ అవకాశం ఇచ్చారట. అయితే ఈ చిత్రంలో నాని నటిస్తారా...లేదా అన్న అంశానికి కొద్దిరోజుల్లోనే తెరపడుతుందని అంటున్నారు.


నాని